

శనివారం 23 మే 2026
https://www.telugudesam.org



# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





నేడు చిత్తూరు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన

కండ్రిగలో 'సంజీవని'కి హాజరు

- వివరాలు 2 లో..

## హీట్ వేవ్‌పై అప్రమత్తం!

- ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నచోట స్థానికంగా సెలవుల ప్రకటన
- రాష్ట్రంలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలపై సీఎం చంద్రబాబు సమీక్ష

2



## ఎస్ఏఈఎల్.. నిలువెత్తు నమ్మకం



- సోలార్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో మంత్రి నారా లోకేష్
- మా బ్రాండ్ జాబ్ క్రియేషన్... జగన్ బ్రాండ్ గొడ్డలి
- బ్రాండ్ సీబీఎన్ వల్లే ఏపీలో అభివృద్ధి పరుగులు
- మాటిచ్చి చేతల్లో చూపే నాయకత్వంవల్లే పెట్టుబడుల వెల్లువ
- క్లీన్ ఎనర్జీ వినియోగించడమే కాదు... దేశానికి ఎగుమతి చేస్తాం
- సభలో స్పష్టం చేసిన మంత్రి నారా లోకేష్

3

'పర్యాటక పోలీసు' విధానంతో

## పర్యాటకుల భద్రతకు భరోసా

- క్యాబినెట్ లో చర్చించి అమలుకు సన్నాహాలు
- సమీక్షలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



- వివరాలు 13 లో..

## గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం

- జగన్ రాజకీయ ముసుగులో ఫ్యాక్షనిస్టు
- హత్యా రాజకీయాల అసలు వారసుడు జగన్
- చంద్రబాబు అభివృద్ధి చూసి జగన్ ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారు
- వ్యక్తిగత దూషణలే జగన్ రాజకీయ ఆయుధం
- తెలుగుజాతికి పట్టిన రాజకీయ అరిష్టం జగన్
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



- వివరాలు 9 లో..

## జొన్నగిరి గోల్డ్ మైన్స్.. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి బంగారు బాట

- మైనింగ్ రంగాన్ని సంపద సృష్టించే శక్తిగా మార్చడమే లక్ష్యం
- గత ప్రభుత్వ దుర్మార్గాల కారణంగా మైనింగ్ భ్రష్టుపట్టింది
- సహజ వనరుల వినియోగంతో రాష్ట్రాభివృద్ధి
- మైనింగ్ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ



- వివరాలు 11 లో..

## 11 లక్షల పెన్షన్లు కొట్టేసింది జగనే..

- మంత్రి కొండపల్లి కౌంటర్

- వివరాలు 10 లో..

## పదండి.. ప్రకృతి సేద్యంవైపు!

- సేంద్రియ సాగువైపు రైతును ప్రోత్సహించాల్సిన అవసరముంది
- జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ సీఎం చంద్రబాబు లక్ష్యం
- ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన మంత్రి లోకేష్
- సమీకృత సేంద్రియ సాగు చేస్తున్న రైతు కుటుంబంతో మాటామంతీ
- సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న వివిధ పంటల పరిశీలన

6



## భలే నటుడు జగన్‌రెడ్డి

- మతాల మధ్య చిచ్చుకు కుట్ర పన్నారు
- తప్పుచేసిన ఎవరినీ వదిలిపెట్టేది లేదు
- గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తాం
- రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- చేసే పనులు చెప్పుకోవాలి
- జమ్మలమడుగు నియోజకవర్గ సమావేశంలో మంత్రి లోకేష్

5



## పీఎన్జీపై విస్తృత ప్రచారం.. యువతకు ఉపాధి మార్గం

- అన్ని జిల్లాల్లో ప్రత్యేక ప్రచార జాతాలు
- యువతకు పీఎన్జీ సాంకేతిక అంశాలపై ప్రత్యేక శిక్షణ
- డ్వాక్రా సంఘాల మహిళలకు అవగాహన, ప్రోత్సాహకం
- అన్ని ఆలయాల్లో పీఎన్జీ గ్యాస్ వాడకం తప్పనిసరి
- అద్దెదారులకు పీఎన్జీ వాడకంలో సరళంగా నిబంధనలు
- పీఎన్జీ గ్యాస్ విస్తరణపై మంత్రి నాదెండ్ల సమీక్ష



12

# హీట్ వేవ్‌పై అప్రమత్తం!

- ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నచోట స్థానికంగా సెలవుల ప్రకటన
- రాష్ట్రంలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో తీవ్రస్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పుల నేపథ్యంలో ప్రజారోగ్యం, వారి భద్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు నిరంతరం హెచ్చరికలు పంపాలని అధికారులకు సూచించారు. ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించాలని దిశానిర్దేశం చేశారు. తీవ్రస్థాయి ఎల్ నినో కారణంగా హీట్‌వేవ్ తీవ్రత కూడా గణనీయంగా పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

దీనిపై స్పందించిన సీఎం, ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగేలా రద్దీగా ఉన్న ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా తిరిగే చోట్ల చల్లని మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వడగాలుల నుంచి ఎలా రక్షించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మీడియాతోపాటు సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం సమాచారాన్ని చేరవేయాలని నిర్దేశించారు. ప్రజల ప్రాణాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండ తీవ్రత నేపథ్యంలో బయటకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని సూచించారు. ఈ అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి జిల్లా కలెక్టర్లు, మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 1,349 హీట్ షెల్టర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు సీఎంకు వివరించారు. 446 ట్రాఫిక్ జంక్షన్లలో వాహనదారులు, పోలీసులకు నీడ కల్పించేలా ఏర్పాట్లు చేశామని తెలియచేశారు. మరోవైపు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న మూగ జీవులు, పక్షులకు కూడా నీటి తొట్టెలు, మట్టి కుండలతో నీటిని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

### పచ్చదనం పెంపుపై దృష్టి

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా చూడాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. 2015లో బలమైన ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో 50.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డు అయిందని, ఈ ఏడాది కూడా ఎల్ నినో ప్రభావంతో ఇప్పటి వరకు 48 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వివరించారు. గడచిన మూడు రోజులుగా 45 డిగ్రీల నుంచి 48 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు.


దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ జలాలు పెరిగితే పచ్చదనం పెరుగుతుందని, తద్వారా తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం నుంచి కొంతమేర ఉపశమనం లభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. అన్నమయ్య జిల్లాయే దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని వెల్లడించారు. ఇతర జిల్లాలతో పోలిస్తే అన్నమయ్య జిల్లాలో తక్కువ ఉష్ణోగ్రత నమోదైందని స్పష్టం చేశారు. తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో హెచ్చరికలు, అప్రమత్తత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సమాచారం చేరవేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. వచ్చే వారం రోజుల పాటు నిత్యం ప్రజలను అప్రమత్తం చేసేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, పురపాలక, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



*పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రంలో గ్రీన్ కవర్ పెంపొందించే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. త్వరలో చేపట్టే 2.5 కోట్ల సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమం విజయవంతమయ్యేలా చూడాలని అటవీశాఖ అధికారులకు స్పష్టం చేశారు. జూన్‌లో సీడ్ బాల్స్ సిద్ధం చేసి, జూలై, ఆగస్టులో పంపిణీ చేయాలని సీఎం నిర్దేశించారు. ఇందులో విద్యార్థులు, ఉద్యోగులనుంచి స్వచ్ఛంద సంస్థల వరకు అందరినీ భాగస్వాముల్ని చేయాలన్నారు.*

## నేడు చిత్తూరు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన

### కండ్రిగలో 'సంజీవని'కి హాజరు



అమరావతి(చైతన్యరథం): ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొనేం దుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం చిత్తూరుజిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9:00 గంటలకు అమరా వతి క్యాంపు ఆఫీసు నుంచి బయలు దేరి ఉదయం 11:00 గంటలకు యాదమర్రి మండలం కండ్రిగ గ్రామం చేరుకుంటారు. మధ్యాహ్నం 1:00 గంట వరకు ప్రజా వేదికలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1:35 గంటలకు సంతగేటు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసు కుంటారు. అనంతరం మధ్యాహ్నం 2:20 గంటలకు సంతగేటు దగ్గర నిర్వహించే క్యాడర్ సమావేశంలో పాల్గొని పార్టీ కార్యకర్తలకు వివిధ అంశాలపై దిశానిర్దేశం చేస్తారు. సాయంత్రం 4:00 గంటలకు తిరిగి ప్రయాణమై అమరావతికి చేరుకుంటారు.

## సౌండ్ లేకుండా స్కెచ్..

- కడపలో లోకేష్ నిశ్శబ్ద చదరంగం
- మైకుల హడావుడి వద్దు..
- గ్రౌండ్ లెవల్లో పక్కా వ్యూహం
- కడప రాజకీయాల్లో ప్రకంపనలు

విజయవాడ (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మంత్రి నారా లోకేష్ శైలి గతంతో పోలిస్తే పూర్తిగా మారిపోయింది. మైకుల ముందు హడావుడి చేయడం, పెద్దపెద్ద ప్రకటనలు గుప్పించడం పక్కన పెట్టి, సౌండ్ రాకుండా పక్కా వ్యూహంతో క్షేత్రస్థాయిలో పనిచేయడం ఆయన ప్రత్యేకతగా మారింది. తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి కంచుకోటగా ఉన్న ఉమ్మడి కడప జిల్లాపై లోకేష్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. ప్రత్యర్థి పార్టీకి కోలుకునే అవకాశం కూడా ఇవ్వకూడదనే స్థాయిలో ఆయన వేస్తున్న అడుగులు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. ఉమ్మడి కడప జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాలకుగాను ఏకంగా 7 స్థానాల్లో తెలుగుదేశం కూటమి చారిత్రాత్మక విజయం సాధించింది. అయితే లోకేష్ ఈ ఫలితాలతో సంతృప్తి చెందలేదు. ప్రత్యర్థి పార్టీ నేతల్లా మైకుల ముందు అర్థగోలు సవాళ్లు విసరడం కాకుండా, గ్రౌండ్ లెవల్లో పార్టీని ఎలా బలోపేతం చేయాలో స్థానిక నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. అవతలి పార్టీ ఎంత బలహీనపడినా తమ ఓటు బ్యాంకును, క్యాడర్‌ను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచాలనేదే లోకేష్ అసలు వ్యూహం.

### స్థానిక ఎన్నికలే తొలి అంకం

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను లోకేష్ తన సరికొత్త ఆపరేషన్‌కు తొలి అంకంగా ఎంచుకున్నారు. గతంలో అధికార బలాన్ని నమ్ముకుని వైసీపీ సాగించిన బెదిరింపు రాజకీయాలకు, బలవంతపు ఏకగ్రీవాలకు శాశ్వతంగా చెక్ పెట్టాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలోనూ ప్రజల్లో పట్టున్న నేతలను గుర్తించి వారిని స్థానిక పోరులో నిలబెట్టే బాధ్యతను జిల్లా ఇన్‌చార్జ్‌లకు అప్పగించారు. లోకేష్ వేస్తున్న ఈ సైలెంట్ స్కెచ్ ప్రభావం ఎంత శక్తివంతంగా ఉంటుందో ఎన్నికలు ముగిశాక గానీ వైసీపీకి అర్థం కాదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### జగన్ సొంత జిల్లాలో గ్యాప్ ఇవ్వొద్దు

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంత జిల్లా అయిన కడపలో వైసీపీ క్యాడర్ ఇంకా కొంతమేర చురుగ్గా ఉండటాన్ని లోకేష్ గమనించారు. అందుకే అక్కడ ప్రతిపక్షానికి అసలు గ్యాప్ ఇవ్వకూడదని గట్టిగా నిర్ణయించారు. జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వేధింపులకు గురైన క్షేత్రస్థాయి టీడీపీ కార్యకర్తలకు తాము పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అధికారంలో ఉన్నామని అలసత్వం ప్రదర్శించకుండా, ప్రతి ఇంటికీ కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరవేస్తూనే రాజకీయంగా ప్రత్యర్థి కోటను పూర్తిగా బద్దలు కొట్టేలా లోకేష్ రచిస్తున్న ఈ నిశ్శబ్ద చదరంగం కడప జిల్లా రాజకీయాలను ప్రకంపనలకు గురి చేస్తోంది.




# ఎస్ఏఈఎల్.. నిలువెత్తు నమ్మకం

- సోలార్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో మంత్రి నారా లోకేష్
- మా బ్రాండ్ జాబ్ క్రియేషన్... జగన్ బ్రాండ్ గొడ్డలి
- బ్రాండ్ సీబీఎన్ వల్లే ఏపీలో అభివృద్ధి పరుగులు
- మాటిచ్చి చేతల్లో చూపే నాయకత్వంవల్లే పెట్టుబడుల వెల్లువ
- క్లీన్ ఎనర్జీ వినియోగించడమే కాదు... దేశానికి ఎగుమతి చేస్తాం
- సభలో స్పష్టం చేసిన మంత్రి నారా లోకేష్



జమ్మలమడుగు (చైతన్య రథం): ఈరోజు కేవలం ఒక సోలార్ విద్యుత్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం మాత్రమే కాదు, దార్శనికత, నమ్మకం, వేగం, కార్యనిర్వహణ కలగలిసిన వేడుక అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3 వేల కోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ (ఎస్ఏఈఎల్) వారి 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ "మా నాన్న ఉత్తరం రాశారు.. మా తాత కల కన్నారు.. నేను ఆత్మలతో మాట్లాడాను అంటే నమ్మే వాళ్ళు ఎవరూ లేరు బ్రదర్. మా బ్రాండ్ జాబ్ క్రియేషన్... మీ బ్రాండ్ గొడ్డలి." రెండింటికీ ఎంతో తేడా ఉందని అన్నారు.

## రాష్ట్రం చూపు.. జమ్మలమడుగు వైపు

మంత్రి లోకేష్ మాట్లాడుతూ రికార్డు టైమ్‌లో ఎస్ఏఈఎల్ ప్రాజెక్టు పూర్తి అయిందని, ఇది స్థానిక రైతుల విజయం, జమ్మలమడుగు యువత విజయమని చెప్పారు. వారి సహకారం వల్లనే ఈ ప్రాజెక్టు 11 నెలల్లో పూర్తి అయిందన్నారు. రాష్ట్రం మొత్తం జమ్మలమడుగు వైపు చూస్తోందని, ఇతర నియోజకవర్గాల వారు మాకు కూడా ఇటువంటి కంపెనీలు వస్తే బాగుంటుందని అనుకుంటున్నారని పేర్కొన్నారు. ఇక్కడ మెగా సోలార్ పార్క్ ఏర్పాటు చేసింది మనమే, ఇప్పుడు ఎస్ఏఈఎల్ తీసుకువచ్చింది మనమే, అదానీ, చింతా గ్రీన్, జెన్‌కో-ఎన్టీపీసీ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు తీసుకొచ్చింది మనమే అన్నారు. ఎస్ఏఈఎల్ రావడం వల్ల రైతులకు లబ్ధి జరిగింది, యువతకు ఉద్యోగాలు వచ్చాయని వివరించారు. కంపెనీలు తీసుకురావాలన్నా, ఉద్యోగాలు కల్పించాలన్నా అది ఒక్క బ్రాండ్ సీబీఎన్‌కు మాత్రమే సాధ్యమని అన్నారు.

## విజయానికి మూడు మెట్లు

పెట్టుబడుల సాధన, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పనలో ఏపీ విజయానికి ముఖ్యమైన మూడు కారణాలున్నాయని మంత్రి వివరించారు.

మొదటిది బ్రాండ్ సీబీఎన్. పెట్టుబడిదారులు ఇప్పుడు "మేము ఎంత త్వరగా ఆంధ్రప్రదేశ్‌కు రాగలం?" అని అడుగుతున్నారని, ఎందుకంటే ఇచ్చిన మాటను చేతల్లో చూపే నాయకత్వంతో నిర్మితమైన ఆంధ్రప్రదేశ్ నేడు గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగిందని తెలిపారు. రెండవది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. నిర్ణయాలు వేగంగా తీసుకుని, ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేసినప్పుడే విధానాలకు విలువ ఉంటుందని, ఈ ప్రాజెక్టే అందుకు నిదర్శనమని అన్నారు. భూమిపూజ నుంచి ప్రారంభోత్సవం వరకు రికార్డు స్థాయిలో 11 నెలల్లో పూర్తయిందని వివరించారు. మూడవది డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానం మరింత వేగవంతమైందని, రాష్ట్ర ప్రభుత్వ దార్శనికతకు కేంద్ర ప్రభుత్వ మద్దతు తోడైనప్పుడు అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు.

## ప్రపంచంతో పోటీపడే ఎకోసిస్టమ్ నిర్మాణం

ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్, డ్రోన్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా, అధునాతన తయారీ వంటి రంగాల్లో 22 ప్రత్యేక గ్రోత్ క్లస్టర్లను నిర్మిస్తోందని మంత్రి తెలిపారు. ఆధునిక ఆర్థిక వృద్ధి ఎకోసిస్టమ్స్, స్పెషలైజేషన్, ఆవిష్కరణల ద్వారానే సాధ్యమవుతుందని, ఆంధ్రప్రదేశ్, భారత ప్రభుత్వం కలిసి భవిష్యత్తు కోసం ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల ఎకోసిస్టమ్స్‌ను నిర్మిస్తున్నాయని అన్నారు. ఎస్ఏఈఎల్ నాయకత్వంతో మొట్టమొదటి సంభాషణ తనకు ఇప్పటికీ గుర్తుందని, ఢిల్లీలో ఒక టెలికాం ఆపరేటర్ల సంఘం సమావేశం సందర్భంగా జరిగిందని చెప్పారు. అది పునరుత్పాదక ఇంధనానికి సంబంధించిన సమావేశం కాకున్నా, ఆ రోజు ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను నిర్మించాలనే తమ ప్రణాళికల గురించి ఎస్ఏఈఎల్ నాయకత్వం ఎంతో ఉద్వేగంగా మాట్లాడిందని తెలిపారు.

## స్థానిక సమాజంతో కలిసి ముందడుగు

పంజాబ్ లీడర్‌షిప్ నేతృత్వంలో పనిచేస్తున్న ఢిల్లీకి చెందిన ఒక కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలు నిర్వహించగలదా అనే ప్రశ్న తనలో మెదిలిందని మంత్రి చెప్పారు. ఎస్ఏఈఎల్ బృందం అమరావతికి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తనను కలిశారని, క్షేత్రస్థాయిలో పనిచేయడానికి సిద్ధమై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో రావడం తన ప్రశ్నకు జవాబు దొరికించిందన్నారు. ఎస్ఏఈఎల్ బృందం చక్కగా స్థానిక సమాజం, ప్రజలతో మమేకమయ్యారని, క్షేత్రస్థాయిలో గ్రామస్థులు, రైతులు, స్థానిక యంత్రాంగం, ఇంజనీర్లు, కార్మికులు, అధికారులతో కలిసికట్టుగా పనిచేశారని అన్నారు. వారు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని స్థానికుల సహకారంతో ముందుకు సాగారని, ఆ స్ఫూర్తే ఈ ప్రాజెక్టును విజయవంతం చేసిందన్నారు.

## రికార్డు వేగంతో ప్రాజెక్టు పూర్తి

ఎస్ఏఈఎల్ రూ.3,000 కోట్ల పెట్టుబడి పెట్టి, 2,400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఎంహెచ్‌పీ-1, ఎంహెచ్‌పీ-2 భారీ 300 మెగావాట్ల ప్రాజెక్టుల నిర్మాణం 11 నెలల్లో వేగవంతంగా పూర్తి చేసి రికార్డు సృష్టించింది. పంజాబ్, రాజస్థాన్‌లోని

- (మిగతా వివరాలు 4లో)









# ఎస్‌ఏఈఎల్.. నిలువెత్తు నమ్మకం

(3వ పేజీ తరువాయి)

ఎస్‌ఏఈఎల్ సొంత ప్లాంట్లలో తయారైన 12 లక్షలకు పైగా అధునాతన టాప్‌కాన్ బైఫేషియల్ సోలార్ మాడ్యూల్స్ ఏర్పాటుచేశారు.

## 11 లక్షల టన్నుల కర్బన ఉద్గారాల తగ్గుదల

ఈ ఒక్క ప్రాజెక్టు ద్వారానే ఏటా సుమారు 11 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను నివారించవచ్చని అంచనా. ఇక్కడ ఉత్పత్తి అయ్యే స్వచ్ఛమైన విద్యుత్ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో కుదిరిన 25 ఏళ్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం ప్రకారం జాతీయ గ్రిడ్‌లోకి సరఫరా అవుతుంది. ఈ విద్యుత్ గుజరాత్‌తో సహా ఇతర రాష్ట్రాలకు కూడా ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు కేవలం క్లీన్ ఎనర్జీని వినియోగించడమే కాదు, భారతదేశానికి ఎగుమతి చేసే రాష్ట్రంగా ఎదుగుతోందని మంత్రి వివరించారు. ఎస్‌ఏఈఎల్ బృందానికి, ముఖ్యంగా పంజాబ్ నుంచి వచ్చిన సోదర సోదరీమణులకు "తుస్సీ కమాల్ కర్ దిట్టా.. చక్ దే ఫట్టే!" అని మంత్రి అభినందించారు. ఆంధ్రప్రదేశ్ వారిని కుటుంబ సభ్యులుగా స్వాగతిస్తోందని, క్రమశిక్షణ, పట్టుదల, వేగంతో ఎలా సాధించగలమో వారు ఆచరణాత్మకంగా నిరూపించారని కొనియాడారు.

## నిర్మాణ సమయంలోనే వెయ్యి మందికి ఉపాధి

ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే 1,000 మందికి పైగా కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ ఉపాధి లభించింది. వీరిలో 80 శాతం మంది స్థానికులే. వీరి ఆదాయాలు మెరుగయ్యాయి, చుట్టుపక్కల గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తరించాయి. అన్నింటికన్నా ముఖ్యంగా దీర్ఘకాలిక లీజు ఒప్పందాల ద్వారా 760 మంది రైతులు, వారి కుటుంబాలు లబ్ధి పొందాయి.

## వ్యవసాయ వ్యర్థాల నుంచి విద్యుత్

రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ వ్యర్థాల నుంచి దాదాపు 200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ఎస్‌ఏఈఎల్ ప్రాజెక్టులు ఉన్నాయని, ఇవి రైతులకు అదనపు ఆదాయ అవకాశాలను కల్పిస్తాయని మంత్రి తెలిపారు.

పునరుత్పాదక ఇంధన రంగంలో వేలాది ఉద్యోగాలను సృష్టిస్తాయని వివరించారు. ఎస్‌ఏఈఎల్ సంస్థకు ఏ మద్దతు కావాలన్నా తాను ఒక్క వాట్సాప్ కాల్ దూరంలోనే ఉంటానని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్‌ఏఈఎల్ కో-ఫౌండర్ మరియు డైరెక్టర్ సుఖ్ బీర్ సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మరియు సీఈవో లక్షిత్ ఆవ్లా, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్ రెడ్డి పాల్గొన్నారు.


























# భలే నటుడు జగన్‌రెడ్డి

- మతాల మధ్య చిచ్చుకు కుట్ర పన్నారు
- తప్పుచేసిన ఎవరినీ వదిలిపెట్టేది లేదు
- గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తాం
- రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- చేసే పనులు చెప్పుకోవాలి
- జమ్మలమడుగు నియోజకవర్గ సమావేశంలో మంత్రి లోకేష్



జమ్మలమడుగు (చైతన్య రథం): అద్భుత నటుడు జగన్మోహన్ రెడ్డి అని, మతాల మధ్య చిచ్చుకు కుట్ర పన్నారని, తప్పుచేసిన ఎవరినీ వదిలిపెట్టేది లేదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలం, దత్తలూరు వద్ద ఏర్పాటుచేసిన వేదికలో జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడుతూ కష్టకాలంలో పసుపు జెండాకు అండగా నిలబడిన వ్యక్తి భూపేష్‌రెడ్డి అని, మాటలు తక్కువైనా చేతలు ఎక్కువ అని అభినందించారు. జమ్మలమడుగు జోష్ అదిరిపోయిందని, పౌరుషాల గడ్డ ఇదని పేర్కొన్నారు. పెన్నా నది నీళ్లలోనే తేడా ఉందన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో మూడు సాగునీటి ప్రాజెక్టులు, నాలుగు సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయని, గండికోటను, టీడీపీని ఎవరూ టచ్ చేయలేరని స్పష్టం చేశారు.

### మతాల మధ్య చిచ్చుకు కుట్ర పన్నారు

ఉమ్మడి కడప జిల్లా ఎప్పుడూ టీడీపీకి అండగా నిలిచిందని, గత ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్నామని మంత్రి గుర్తు చేశారు. కోటి మంది సభ్యులు టీడీపీ సొంతమని, బడుగు, బలహీన వర్గాలను ప్రోత్సహించిన పార్టీ తెలుగుదేశంపార్టీ అని పేర్కొన్నారు. 2019-24మధ్య అనేక ఇబ్బందులు పెట్టారని, కార్యకర్తలు తెగువ చూపారని, వైసీపీని 11సీట్లకే పరిమితం చేశారని గుర్తుచేశారు. జగన్‌రెడ్డికి చీటింగ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఇవ్వొచ్చని, అద్భుత నటుడు జగన్మోహన్‌రెడ్డి అని, సినిమాల్లో నటిస్తే ఆస్కార్ అవార్డ్ వస్తుందని చమత్కరించారు. ఆస్తి కోసం సొంత తల్లి, చెల్లిని బయటకు గెంటేశారని, ఇంకో చెల్లి తండ్రిని చంపి అన్యాయం చేశారని, సొంత జిల్లా ప్రజలను మోసం చేశారని, సొంత బాబాయిని లేపేసి నెపం మనపై నెట్టారని ఆరోపించారు. గుండెపోటు కాదది, గొడ్డలిపోటు అని, కోడి కత్తి, గులకరాయి డ్రామా చూశామని, మొన్న కడప పట్టణంలో జరిగింది కూడా అదే కుట్ర అని పేర్కొన్నారు. మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూశారని, తప్పుచేసిన ఎవరినీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

### చేసే పనులు చెప్పుకోవాలి

కార్యకర్తే అధినేత అనేది టీడీపీ సిద్ధాంతమని, నాడు, నేడు ఎప్పుడూ పార్టీకి కార్యకర్తలు అండగా నిలిచారని మంత్రి పేర్కొన్నారు. పనిచేసే వారిని గుర్తించేందుకే మై టీడీపీ యాప్ తీసుకువచ్చామని తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేల పెన్షన్ అందిస్తున్నామని వివరించారు. స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, దీపం పథకం కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉన్నా రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. 16 వేల ఉపాధ్యాయ పోస్టులు, 6 వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశామని, 10 వేల ఉద్యోగాలకు సింగిల్ జాబ్ కేలండర్ విడుదల చేశామని వివరించారు. చేసే పనులు చెప్పుకోవాలని, పార్టీలో సంస్కరణల కోసం తాను పోరాడానని, సమస్యలు ఏవైనా ఉంటే అంతర్గతంగా పోరాడాలని, అలిగి ఇంట్లో కూర్చోకూడదని సూచించారు. 2019-24 మధ్య కార్యకర్తలపై నమోదు చేసిన అక్రమ కేసులను తొలగిస్తున్నామని వివరించారు.

### రప్పా, రప్పా అంటే భయపడేవారు ఎవరూ లేరు

రప్పా, రప్పా అంటే భయపడేవారు ఎవరూ లేరిక్కడ అని, వారి నాయకుడిని, తండ్రిని చూశామని మంత్రి అన్నారు. రప్పా, రప్పాకు ఎండ్ కార్డ్ వేసే బాధ్యత తనదని, రెడ్ బుక్ అంటేనే భయపడుతున్నారని, చివరకు ఎర్ర కారు చూసినా భయపడుతున్నారని చమత్కరించారు. జగన్ రెడ్డిది బెంతాహై అని, మూడు రోజులు బెంగళూరు, మూడు రోజులు హైదరాబాద్, ఒకరోజు తాడేపల్లిలో ఉంటున్నారని పేర్కొన్నారు. ఆయనకు సీసీడీ (క్రెడిట్ చోరీ డిజార్డర్) ఉందని, వైసీపీ కుట్రల విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు.

### గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తాం

అనేక పరిశ్రమలు జమ్మలమడుగుకు వస్తున్నాయని, రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను 2029 నాటికి పూర్తిచేస్తామని మంత్రి తెలిపారు. గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కడప గడ్డపైనే మిషన్ రాయలసీమను ప్రకటించామని, లక్ష కోట్ల ఔట్‌లేతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని వివరించారు. రాయలసీమలో కార్లు పరిగెత్తించామని, నేడు ఫైటర్ జెట్లు వస్తున్నాయని అన్నారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానమని స్పష్టం చేశారు. పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. నేతలు మానవ సంబంధాలు పెంచుకోవాలని, తాను రెండే కార్లు వినియోగిస్తున్నానని, నేతలు అహంకారం వీడాలని సూచించారు. జమ్మలమడుగుకు ఎంఎస్‌ఎంఈ కంపెనీలను తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కార్యకర్తలు, ప్రజలను కలిసి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎస్.సవిత, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ సీహెచ్.భూపేష్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు ఎం.రామకృష్ణ, కడప పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వైఎస్. జుబులిలా,జోనల్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.














# పదండి.. ప్రకృతి సేద్యంవైపు!

- సేంద్రియ సాగువైపు రైతును ప్రోత్సహించాల్సిన అవసరముంది
- జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ సీఎం చంద్రబాబు లక్ష్యం
- ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన మంత్రి లోకేష్
- సమీకృత సేంద్రియ సాగు చేస్తున్న రైతు కుటుంబంతో మాటామంతీ
- సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న వివిధ పంటల పరిశీలన



జమ్మలమడుగు (చైతన్య రథం): రైతులను సేంద్రియ సాగు వైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ సీఎం చంద్రబాబు లక్ష్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కడప జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ముందుగా జమ్మలమడుగు నియోజకవర్గం ముద్దనూరు మండలం పెనికలపాడులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని మంత్రి లోకేష్ సందర్శించారు. సమీకృత సేంద్రియ సాగుచేస్తున్న రైతు మునగాల ద్వారకానాథ రెడ్డి, అతని కుటుంబ సభ్యులతో సంభాషించారు. సేంద్రియ వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు రైతు ద్వారకానాథ రెడ్డి, ఆయన సతీమణి రాఘవేంద్రవతి స్వాగతం పలికారు.

## 17 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్న ద్వారకానాథ రెడ్డి కుటుంబం

పెనికలపాడుకు చెందిన రైతు ద్వారకానాథ రెడ్డి, ఆయన సోదరుడు రమణారెడ్డిలు గత ఐదేళ్లుగా తమ ఉమ్మడి కుటుంబానికి చెందిన 17 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నారు. పంటలు, పశుపోషణ, కోళ్లు, చేపల పెంపకం వంటివాటిని ఒకదానికొకటి అనుసంధానం చేసి సమీకృత సేంద్రియ సాగు చేస్తూ స్థిరమైన ఆదాయం అర్జిస్తున్నారు. తమ పొలంలో మామిడి, బత్తాయి, ఉసిరి, కొబ్బరి,చిన్న నిమ్మ, నేరేడు, జామ, మునగ, రామాఫలం, సీతాఫలం పంటల సాగుతో పాటు 250 వరకు నాటు కోళ్ల పెంపకం, 60 వరకు పొట్టేళ్లు, చేపల సాగు చేస్తున్నారు.

## సేంద్రియ సాగు పద్ధతులను అడిగి తెలుసుకున్న మంత్రి లోకేష్

ఈ సందర్భంగా రైతు ద్వారకానాథ రెడ్డి, అతని కుటుంబ సభ్యులతో మంత్రి సంభాషించారు. ప్రకృతి వ్యవసాయం వైపుమళ్లడానికి గల కారణాలను మంత్రి లోకేష్ అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామంలో 70 ఏళ్ల వయస్సున్న సేంద్రియ రైతు లక్ష్మీనారాయణను స్ఫూర్తిగా తీసుకుని తాము సేంద్రియ సాగు చేస్తున్నామని వివరించారు. మొదట ఒడిదొడుకులు ఎదుర్కొన్నా వ్యవసాయ అధికారుల ప్రోత్సాహంతో నిలదొక్కుకున్నామని చెప్పారు. వ్యవసాయ అధికారులు సేంద్రియ సాగులో మెళకువలపై తిరుపతిలో శిక్షణ అందించారని,బయో రీసెర్చ్ సెంటర్ కేటాయించారని తెలిపారు. తమ పొలంలోనే సహజ ఎరువులు, 32 రకాల జీవ వైవిధ్య గింజల తయారీ చేపట్టినట్లు వివరించారు. పురుగు మందులు, రసాయన ఎరువులు ఇప్పుడు తమకు అవసరం లేదన్నారు. పంట పెట్టుబడి తగ్గి పోవడంతో సమీకృత సేంద్రియ సాగు ద్వారా నెలవారీ ఆదాయం పొందు తున్నామన్నారు.




ఒక్క ఆవుతోనే 20 ఎకరాల వరకు సేంద్రియ సాగు చేపట్టవచ్చని తెలిపారు. 250 నాటు కోళ్ల పెంపకం ద్వారా పొలంలో కలుపు తీసే పని లేదని, పురుగు మందుల అవసరం లేదని వివరించారు. తమ వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న మామిడి చెట్ల ద్వారా ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు ఆదాయం పొందుతున్నామని చెప్పారు. ప్రభుత్వం మరింత సహకారం అందిస్తే ప్రకృతి వ్యవసాయంలో అద్భుతాలు చేయవచ్చని ధీమా వ్యక్తం చేశారు.

## రైతులను సేంద్రియ సాగు వైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ స్పందిస్తూ పంట పొలాల్లో అధిక రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం ద్వారా భూసారం దెబ్బతినడంతో పాటు రైతుకు సాగు పెట్టుబడి వ్యయం అధికమవుతోందన్నారు. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ సీఎం చంద్రబాబు గారి లక్ష్యమని వివరించారు. రాష్ట్రంలోని రైతులను సేంద్రియ సాగు వైపు మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం కూడా ఇందుకు కృషిచేస్తోందని వివరించారు. చిరుధాన్యాల సాగును కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. రాయలసీమలో బిందు సేద్యానికి మరింత అండగా ఉంటున్నామని, గొలుసుకట్టు చెరువుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు స్థానిక రైతులను అనుసంధానించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ క్షేత్రం మొత్తం కలియతిరిగి వివిధ పంటల సాగును మంత్రి పరిశీలించారు. అనంతరం 32 లక్షల లీటర్ల సామర్థ్యమున్న నీటి కుంటను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీకృత సేంద్రియ సాగులో అద్భుతాలు సృష్టిస్తూ స్థిరమైన ఆదాయం పొందుతున్న మునగాల ద్వారకానాథ రెడ్డి, కుటుంబ సభ్యులను మంత్రి అభినందించారు. అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన మామిడిని మంత్రి లోకేష్ రుచి చూశారు. అనంతరం రైతు ద్వారకానాథ రెడ్డి కుటుంబం మంత్రి లోకేష్‌కు మామిడి పండ్లను బహుమతిగా అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి ఫోటోలు దిగారు. కార్యక్రమంలో రైతు మునగాల ద్వారకానాథ రెడ్డి, ఆయన సతీమణి రాఘవేంద్రవతి, సోదరుడు రమణారెడ్డి,మాతృమూర్తి నారాయణమ్మ, రమణారెడ్డి కుమారుడు విఘ్నేశ్వర్ రెడ్డి, కుమార్తె జ్యోతికా రెడ్డి పాల్గొన్నారు.



















# కడపలో మంత్రి లోకేష్..

## ప్రజలు, పార్టీ శ్రేణుల ఘన స్వాగతం

కడప (చైతన్య రథం): విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్‌కు కడప జిల్లాలో ఘన స్వాగతం లభించింది. వల్లూరు గణేష్‌పురం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మంత్రికి ఆప్యాయంగా స్వాగతం పలికారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో భారీ గజమాలతో మంత్రిని సత్కరించారు. కమలాపురం బైపాస్ వద్ద కూడా పార్టీ శ్రేణులు లోకేష్‌కు స్వాగతం పలికాయి. మంత్రి లోకేష్ అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కార్యకర్తలు, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారినుంచి అర్జీలు స్వీకరించారు.













# అభివృద్ధి మారుపేరు కూటమి ప్రభుత్వం

## గుంటూరులో ఆర్‌వోబీకి శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు (చైతన్యరథం): గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి చేస్తుందని చెప్పడానికి సంతోషిస్తున్నామని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. ఎంపీగా బాధ్యతలు స్వీకరించిన తొలి రోజు నుంచి గుంటూరు, పరిసర ప్రాంత ప్రజల ట్రాఫిక్ సమస్యల పరిష్కారం పైనే దృష్టి సారించడం జరిగిందని, అందుకు అనుగుణంగా చేసిన ప్రయత్నాలతో గుంటూరు జిల్లాలో మొత్తం ఏడు ఆర్‌వోబీలను మంజూరు చేయించామన్నారు. శుక్రవారం గుంటూరు నగర పరిధిలో రూ.49.95 కోట్ల నిధులతో చినపలకలూరు ఆర్‌వోబీ నిర్మాణానికి పెమ్మసాని చంద్రశేఖర్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ... కల్తీ మద్యం, గుంతల రోడ్లు, ఉద్యోగాలు లేని యువత వంటి అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్న రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి అంటే ఎంటో కూటమి ప్రభుత్వం మరోసారి పరిచయం చేసిందన్నారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో పెద్దఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, త్వరలోనే మంగళగిరి ఆర్‌వోబీకి కూడా శంకుస్థాపన చేయబోతున్నామన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే నాయకుడు పెమ్మసాని లాంటి నాయకుడు మనకు ఎంపీగా ఉండటం గుంటూరు పార్లమెంట్ ప్రజల ఆదృష్టమని ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వ్యాఖ్యానించారు. శుక్రవారం గుంటూరు నగర శివారులో రైల్వే ఆరవోబీ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని, ఈ ఆర్‌వోబీ అందుబాటులోకి వస్తే తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు రవాణా అనుసంధానం మరింత పెరుగుతుందన్నారు. అడిగి వెంటనే కేంద్ర ప్రభుత్వం సైతం రైల్వే ఆర్‌వోబీ నిర్మాణానికి సహకరించడం సంతోషంగా ఉందని, రాష్ట్రంలో అభివృద్ధి దూసుకుపోతుందన్నారు. మోడీ, బాబు, పవన్ కళ్యాణ కూటమికి తిరుగులేదని రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లడం ఖాయమన్నారు ఈ కార్యక్రమంలో రైల్వే డీఆర్ఎం సుథేష్ణ సేన్, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, గుంటూరు జిల్లా బీజేపీ అధ్యక్షులు తిరుపతయ్య, టీడీపీ జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు, జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, జడ్పీ చైర్ పర్సన్ క్రిస్టియనా, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీవ వైవిధ్యం లేకుంటే మానవ మనుగడ లేదు

- ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్
- ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఘనంగా అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవ వేడుకలు
- ఎంపిక చేసిన పది మందికి రాష్ట్రస్థాయిలో 'బయోడైవర్సిటీ కన్జర్వర్' అవార్డుల ప్రదానం



గుంటూరు (చైతన్యరథం): 'మన సంస్కృతి ఎప్పుడూ ప్రకృతితో ముడిపడి ఉంది... సర్వేజనా సుఖినోభవంతు, లోకాసమస్తా సుఖినోభవంతు' అన్న శ్లోకాలే జీవ వైవిధ్యానికి అసలైన పరమార్థం' అని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయ పాలెం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గ్లోబల్ వార్మింగ్, ఓజోన్ క్షీణత వంటి అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారాలు కేవలం ప్రపంచస్థాయి సదస్సుల్లో కాకుండా మన గ్రామాలు, ఇళ్ల నుంచే ప్రారంభం కావాలన్నారు.రాష్ట్ర జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంవత్సరం ఐక్యరాజ్యసమితి ప్రకటించిన 'ప్రపంచవ్యాప్త మార్పు కోసం... స్థానికంగా నడుం బిగిద్దాం' నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

### ఎర్రచందనం ఏబీఎస్ నిధులతో సరికొత్త చరిత్ర

ఈ సందర్భంగా జరిగిన సభలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ... నల్లమల అడవులు, కొల్లేరు–పులికాట్ లాంటి రామ్సార్ సైట్లు,ఒంగోలు గిత్తలు, పుంగనూరు ఆవులు వంటి విశిష్ట జాతులతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం (974 కి.మీ), జీవ వైవిధ్యానికి నిలయంగా ఉందన్నారు. దేశంలోనే తొలిసారిగా ఎర్రచందనం వినియోగించే అంతర్జాతీయ కంపెనీల నుంచి ఐదు శాతం అదనపు ధరను Access and Benefit Sharing (ABS) చట్టం ద్వారా వసూలుచేసి, ఆ నిధులను నేరు గా స్థానిక రైతులు, గ్రామ బయోడైవర్సిటీ మేనేజ్ మెంట్ కమిటీల (BMCs) బ్యాంకు ఖాతాల్లో జమ చేసి ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చరిత్ర సృష్టించిందన్నారు. రాష్ట్రంలో జీవ వైవిధ్యాన్ని మరింత పెంపొం దించేందుకు బోర్డు పలు కీలక ప్రాజెక్టులు చేపట్టింద న్నారు. కడప సమీపంలో బయోడైవర్సిటీ పార్కు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని,అమరావతిలో అటవీశాఖ సహకారంతో త్వరలోనే బయోడైవర్సిటీ కార్యకలా పాలు ప్రారంభం అవుతాయని చెప్పారు. తిరుపతి లో కూడా అటవీ శాఖతో కలిసి బయోడైవర్సిటీ పార్కు ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రధాన మున్సిపాలిటీల్లో నిరుపయోగంగా ఉన్న స్థలాలను గుర్తించి అర్బన్ మైక్రో ఫారెస్ట్‌లను అభివృద్ధి చేస్తామన్నారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాల్లో సిటీ బయోడైవర్సిటీ ఇండెక్స్ గణనను ఢిల్లీ సంస్థ సహకారంతో పూర్తిచేశామని, త్వరలోనే ఇండెక్స్ నివేదికలను విడుదల చేస్తామని వెల్లడించారు. గత నెలలో విజయవాడలో జరిగిన 'మెరైన్ ఏబీఎస్ వర్క్‌షాప్ ద్వారా సముద్ర వనరుల సంరక్షణలో చారిత్రాత్మక అడుగు వేయడమే కాదు, సముద్ర ఉత్పత్తుల్లో మత్స్యకారులకు సరైన భాగం వచ్చే చట్టం అమలు త్వరలో సాకారమవుతుందని చెప్పారు.

మెంబర్ సెక్రటరీ పి.రామకృష్ణ(ఐఎఫ్ఎస్) మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో 13,500 కంటే ఎక్కువ బయో బయోడైవర్సిటీ కమిటీలను ఏర్పాటు చేసి స్థానిక ప్రజలకు చట్టబద్ధమైన అధికారాలు కల్పించామన్నారు. స్థానిక వైద్య విజ్ఞానాన్ని రికార్డు చేస్తూ 12వేల కంటే ఎక్కువ పీపుల్స్ బయోడైవర్సిటీ రిజిస్టర్లను విజయవంతంగా నమోదు చేశామని తెలిపారు.

ప్రభుత్వ సలహాదారుడు మల్లికార్జునరావు, ఏపీఎఫ్‌డీసీ ఈడీ నందిని సలరియా, మెడిసినల్ ప్లాంట్స్ బోర్డు సీఈవో చంద్రశేఖర్ మాట్లాడుతూ... అడవులు, అరుదైన వనమూలికల సంరక్షణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సింహాచలం, ప్రొఫెసర్ బ్రహ్మాజీ మాట్లాడుతూ వర్సిటీ వేదికగా ఇటువంటి సదస్సు జరగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే తరానికి జీవవైవిధ్యంపై అవగాహన కల్పించేందుకు విద్యా సంస్థల్లో బయోడైవర్సిటీ క్లబ్‌లను విస్తృతం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ప్రతినిధి ఫరిదా తంపా.... అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణలో స్థానిక కమిటీల పాత్రను కొనియాడారు.

రాష్ట్రంలో ఎంపిక చేసిన పది మందికి జీవ వైవిధ్య మండలి ద్వారా 'బయోడైవర్సిటీ కన్జర్వర్" అవార్డులను బహూకరించారు. పర్యావరణ రక్షణకు అంకితభావంతో పనిచేసిన పలువురు అధికారులు, క్షేత్రస్థాయి ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మండుతున్న తెలుగు నేల..

- 48 డిగ్రీల వరకు చేరే అవకాశం..
- అప్రమత్తంగా ఉండాలన్న వాతావరణ శాఖ
- 15 జిల్లాల్లో 67 మండలాల్లో 42 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ఎండ తీవ్రత నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో 44.8 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 44.7 డిగ్రీలు నమోదైనట్టు వెల్లడించారు. రాష్ట్రంలోని 28 జిల్లాలకు గాను 15 జిల్లాల పరిధిలోని 67 మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని, బుధవారం వరకు ఎండ తీవ్రత కొనసాగే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

### శుక్రవారం నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

శుక్రవారం నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఈ విధంగా ఉన్నాయి: తణుకు 44.8, దేవరాపల్లి–తొర్రగుడిపాడు 44.7,కలపర్రు–కానుమోలు–పిడుగురాళ్ల 43.8, చిట్యాల–దొరవారిసత్రం 43,శివల–తాడేపల్లి–కాజులూరు–కొమ్మిపాడు 42.8, సాలూరు 42.4, రామభద్రాపురం 42.3, విశాఖ రూరల్ 42.1, నగరి 42 డిగ్రీలు నమోదయ్యాయి. రాబోయే రెండు రోజుల్లో ఇంకా పెరిగే అవకాశముంది. శనివారం (మే 23): పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి,ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 46 నుంచి 48 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ హెచ్చరించారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో 43 నుంచి 45 డిగ్రీలు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 41నుంచి 43డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. అదే సమయంలో ద్రోణి ప్రభావంతో శనివారం కర్నూలు,నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షం పడేటప్పుడు పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు చెట్ల కింద నిలబడరాదని, వెంటనే సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని సూచించారు.

ఆదివారం (మే 24): పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు,బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లో 45 నుంచి 46 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, నెల్లూరు జిల్లాల్లో 43 నుంచి 45 డిగ్రీలు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం సహా మిగతా జిల్లాల్లో 40 నుంచి 42 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.

### ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య వీలైనంత వరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ప్రఖర్ జైన్ సూచించారు. వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, గుండె సంబంధ వ్యాధులు, షుగర్, బీపీ ఉన్న వారు ఎండలో తిరగరాదని హెచ్చరించారు. అత్యవసరంగా బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్తపడాలని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం

- జగన్ రాజకీయ ముసుగులో ఫ్యాక్షనిస్టు
- హత్యా రాజకీయాల అసలు వారసుడు జగన్
- చంద్రబాబు అభివృద్ధి చూసి జగన్ ఫ్రస్టేషన్‌లో ఉన్నారు
- వ్యక్తిగత దూషణలే జగన్ రాజకీయ ఆయుధం
- తెలుగుజాతికి పట్టిన రాజకీయ అరిష్టం జగన్
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




అమరావతి (చైతన్య రథం): హత్యా రాజకీయాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ముసుగులో ఉన్న ఫ్యాక్షనిస్టు అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. సమాజంలో విద్వేషాలు, హింస, కక్ష రాజకీయాలను పెంచే గొడ్డలి పార్టీ రాష్ట్రానికి హానికరమని మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ జగన్ ప్రెస్‌మీట్‌లో ఫ్రస్ట్రేషన్ స్పష్టంగా కనిపించిందన్నారు. రాష్ట్రంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో శరవేగంగా అభివృద్ధి జరుగుతుంటే తట్టుకోలేక వ్యక్తిగత ఆరోపణలకు దిగుతున్నారని అచ్చెన్నాయుడు అన్నారు. రెండేళ్ల పాలనలో విమర్శించడానికి ఒక్క అంశం కూడా దొరక్క చంద్రబాబుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ లాంటి స్వభావం ఉన్న వ్యక్తులు వస్తారని ముందే గుర్తించి దర్శకుడు శంకర్ అపరిచితుడు సినిమా తీశారేమో అనిపిస్తోంది అంటూ ఎద్దేవా చేశారు.

జగన్ చేసిన వ్యాఖ్యలతో రాజారెడ్డి దమనకాండ, నాటి చరిత్ర, వైఎస్ కుటుంబ రాజకీయ నేపథ్యం మొత్తం మళ్లీ చర్చకు వచ్చాయని అన్నారు. నేటి తరానికి వైఎస్ కుటుంబ చరిత్ర తెలిసేలా జగన్ స్వయంగా చేసుకున్నారని వ్యాఖ్యానించారు. రాజారెడ్డి హత్య కేసులో ఉన్న నిందితులందరినీ చంపేశారని, ఒక్క పార్థసారధి రెడ్డి మాత్రమే మిగిలారని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. ఆ కేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తి ఈరోజు వైసీపీలో ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్నాడని పరోక్షంగా ప్రస్తావించారు. అలాగే వంగవీటి రంగ హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి కుటుంబ సభ్యులు కూడా జగన్ పార్టీలోనే ఉన్నారని గుర్తు చేశారు. రంగా హత్య కేసులో ప్రధాన నిందితుడి కొడుకు నీకు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతాడు... సెండాఫ్ ఇస్తాడు అంటూ జగన్‌ను ప్రశ్నించారు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డికి హిందూ దేవుళ్లపై ఎందుకు కక్షో అర్థం కావడం లేదన్నారు. తిరుమల ఏడుకొండల అంశాన్ని ప్రస్తావిస్తూ, నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రజలు మరచిపోలేదన్నారు. ఆ వ్యాఖ్యలను తప్పుపట్టిన చంద్రబాబు వ్యాఖ్యలను ఇప్పుడు జగన్ వక్రీకరించి ప్రస్తావిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని చంపింది జగన్ అని బొత్సనే చెప్పారని నేను చెబితే ఆయన ఎందుకు ఏడ్చారో ఇప్పటికీ అర్థం కాలేదు అని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. రిలయన్స్ సంస్థలపై దాడులు చేయించి, మళ్లీ వాళ్లకు రాజ్యసభ ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో ఎవరి ప్రమేయం ఉందో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. నీ సొంత చెల్లెలు వైఎస్ సునీత జగన్ ప్రమేయం ఉందని చెబుతోంది... దానికి సమాధానం చెప్పగలవా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవి కోసం బాబాయినే కాదు, సొంత పార్టీ కార్యకర్తలను కూడా వదల్లేదని తీవ్ర విమర్శలు చేశారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తండ్రి మరణం, బాబాయ్ హత్య, కోడికత్తి డ్రామా గురించి మాట్లాడిన జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారి కూడా వాటిపై మాట్లాడలేదని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. చంద్రబాబుకు నోటీసు కూడా ఇవ్వకుండా 53 రోజులు జైలులో పెట్టారని, తాను తప్పు చేయకపోయినా వేధింపులకు గురిచేశారని అన్నారు. అప్పటి ఎంపీ రఘురామ కృష్ణం రాజును చిత్రహింసలకు గురిచేశారని, కోర్టుల వల్లే ఆయన ప్రాణాలు దక్కాయని చెప్పారు. సోషల్ మీడియాలో తల్లి, చెల్లిని కూడా వదలకుండా అసభ్య పోస్టులు పెట్టించారని ఆరోపించారు. డాక్టర్ సుధాకర్ ఘటన, రేపల్లె నియోజకవర్గంలో అమర్‌నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టిన ఘటన, నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబ ఆత్మహత్య వంటి ఘటనలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో జరిగిన దమనకాండకు ఇవే నిదర్శనమన్నారు. టీడీపీ కార్యకర్తల ప్రాణాలు తీసి ఇప్పుడు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

రాజారెడ్డి నుంచి వివేకా వరకు ప్రతి చావులో జగనే ప్రధాన లబ్ధిదారు. జగన్‌ను సైకో అనాలా... పిచ్చోడు అనాలా అర్థం కావడం లేదు అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతిపై జగన్ చేస్తున్న విమర్శలను ఖండిస్తూ, అమరావతికి రాజముద్ర పడిన తర్వాత కూడా మావిగన్ అంటున్నారు. గ్రామీణ రోడ్లు, జాతీయ రహదారులు, ఐకానిక్ రాజధాని రోడ్లు అన్నీ ఒకేలా ఉంటాయా? అని ప్రశ్నించారు. విశాఖలో జగన్ కట్టుకున్న ప్యాలెస్‌కు ఎంత ఖర్చు పెట్టారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి జరుగుతుంటే జగన్ ఓర్చుకోలేకపోతున్నారు. ఆస్తి, పదవి కోసం కార్యకర్తలను కూడా వదలరు. ఆ పార్టీ కార్యకర్తనే కారు కింద వేసి తొక్కించేశారు అంటూ అచ్చెన్నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదన్నారు. జీతాలు ఇస్తే చాలు అని ఉద్యోగులతో దండాలు పెట్టించుకున్నారు. కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించినా జగన్ తగ్గించలేదు. ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్న ప్రతి అంశాన్ని సరిచేసే ప్రయత్నం చేస్తున్నామని, విద్యుత్ ఛార్జీలను తగ్గించిన చరిత్రను ఎన్డీయే ప్రభుత్వం సృష్టించిందన్నారు. ఇకపై జగన్ చేసే ప్రతి అబద్ధపు ఆరోపణకు వడ్డీతో సహా సమాధానం చెబుతామని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

## జూన్‌నాటికి ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు!

### మంత్రి నారాయణ ఆదేశాలు



*అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీల్లో ఏర్పాటు చేస్తున్న ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ల పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొనగా, మునిసిపల్ కమిషనర్లు ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారు. రాష్ట్రంలోని 107 మునిసిపాలిటీల్లో ప్రతిరోజూ ఉత్పత్తి అవుతున్న ఘన వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేయడానికి ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి మునిసిపాలిటీలో నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ల ఏర్పాటు వేగంగా పూర్తయ్యేలా అవసరమైన స్థలం, విద్యుత్, నీటి సరఫరా, రోడ్డు కనెక్టివిటీ వంటి మౌలిక వసతులన్నింటినీ వెంటనే కల్పించాలని మునిసిపల్ కమిషనర్లకు ఆదేశించారు. జూన్ నెలాఖరులోగా అన్ని ప్లాంట్ల నిర్మాణ పనులు పూర్తి చేసి వ్యర్థాల ప్రాసెసింగ్ ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి స్పష్టం చేశారు.*

## మళ్లీ సైకిల్‌తొక్కిన నిమ్మల

- పాలగొల్లునుంచి విజయవాడకు రైలు ప్రయాణం
- రెండోవారం నో వెహికల్ డే



పాలకొల్లు (చైతన్య రథం): నో వెహికల్ డే సందర్భంగా వరుసగా రెండో వారం కూడా మంత్రి నిమ్మల రామానాయుడు సైకిల్ తొక్కి పర్యావరణ స్పృహకు ఆదర్శంగా నిలిచారు. పాలకొల్లు నుంచి సాధారణ ప్రయాణికులతో కలిసి రైలులో విజయవాడ చేరుకున్న ఆయన, రామవరప్పాడు రైల్వే స్టేషన్ నుంచి మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం వరకు సుమారు 18 కిలోమీటర్లు సైకిల్ తొక్కారు. తాడేపల్లి వద్ద టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మంత్రి నిమ్మలకు స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ కలిసి ఒకే సైకిల్‌పై పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి జగన్‌కు భయం మొదలైందని, అందుకే అమరావతిపై విషం కక్కుతున్నారని ఆరోపించారు. జగన్ "మావిగన్" అంటే కూటమి భయపడటం లేదని, ప్రజలే భయపడుతున్నారని స్పష్టం చేశారు. హత్యా రాజకీయాలు జగన్‌కు అలవాటేనని, అధికారం కోసం ఆయన ఎంతకైనా తెగిస్తారని మంత్రి ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు 11 సీట్లు కూడా రావని నిమ్మల పేర్కొన్నారు.

## జగన్ ప్రెస్‌మీట్ అసత్యాల పరంపర

### మాజీమంత్రి సోమిరెడ్డి తీవ్ర విమర్శలు

నెల్లూరు (చైతన్య రథం): వైఎస్సార్సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి నిన్న నిర్వహించిన ప్రెస్‌మీట్ అత్యంత హాస్యాస్పదంగా, అసత్యాలతో నిండి ఉందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ ఆయన పలు కీలక అంశాలు ప్రస్తావించారు. "2009లో హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్సార్ మరణించిన రోజు నాకు స్పష్టంగా గుర్తుంది. అంత్యక్రియలకు వెళ్లేందుకు చంద్రబాబుతో కలిసి బయలుదేరాను. ఉద్రిక్త పరిస్థితుల కారణంగా వెనక్కి రావాల్సి వచ్చింది. ఆ రోజు పాత స్నేహితుడి మరణంపై చంద్రబాబులో ఉన్న నిజమైన వ్యథను నేను స్వయంగా చూశాను" అని సోమిరెడ్డి తెలిపారు.



అప్పట్లో రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలో ఉందని, వైఎస్సార్ ఆప్తుడైన రోశయ్య ముఖ్యమంత్రి అయ్యారని గుర్తు చేశారు. కేంద్రంలోనూ మన్మోహన్ సింగ్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని అన్నారు. "సొంత పార్టీ ముఖ్యమంత్రి మరణిస్తే కాంగ్రెస్ ఊరుకుంటుందా? రోశయ్య గారే కేంద్రానికి లేఖ రాసి సీబీఐ దర్యాప్తు వేయించారు. ఆ సీబీఐ సుదీర్ఘంగా విచారణ చేసి ఇది కేవలం ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనేనని స్పష్టంగా తేల్చింది. ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు సీబీఐని మార్చి తప్పుడు రిపోర్టు ఇప్పించారా? 17 ఏళ్ల తర్వాత ఇప్పుడు తండ్రి చావుకు చంద్రబాబే కారణమని అనుమానాలు రేకెత్తించాలని చూడటం సిగ్గుచేటు" అని మండిపడ్డారు.

### పార్థసారథి రెడ్డి మీ నేరాలకు సాక్షి

వైసీపీ నేత పార్థసారథి రెడ్డి నిన్న మీడియా ముందు జగన్ కుటుంబ చరిత్రను, కడపలో తాతలు-ముత్తాతల నాటి ఫ్యాక్షన్ నేపథ్యాన్ని బయటపెట్టారు. "మీ కుటుంబం చేసిన ఘోరాలకు, నేరాలకు ప్రత్యక్ష సాక్షి పార్థసారథి రెడ్డి ఒక్కరే. జగన్ రెడ్డి -నీ తండ్రి హయాంలో జరిగిన అవినీతి, నువ్వు సీఎం అయిన తర్వాత రాష్ట్రంలో వెలువడిన జె-బ్రాండ్ మద్యంతో 30 వేల మంది పేదలు చనిపోయిన పాపం నీదే" అని సోమిరెడ్డి ఆరోపించారు. నిన్న ప్రెస్‌మీట్‌లో చెప్పిన మాటలు ఎంత అసత్యాలో వైసీపీ కార్యకర్తలనే అడగమని సవాలు విసిరారు.

### చంద్రబాబుకు ఫ్యాక్షన్ చరిత్ర లేదు

"చంద్రబాబు నాయుడిని శత్రువుగా చిత్రించాలని జగన్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలు వ్యర్థం. ఆయనకు ఎలాంటి ఫ్యాక్షన్ నేపథ్యం లేదు, చరిత్రలో నేరాలు లేవు. అది గుర్తుపెట్టుకో. కడప గన్ కల్చర్‌ను రాష్ట్రంపై రుద్దాలని చూస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలు చూస్తూ ఊరుకోరు" అని సోమిరెడ్డి హెచ్చరించారు.

చైతన్యరథం

# సంక్షేమం, అభివృద్ధి..
# కూటమి తొలి ప్రాధాన్యం

- గత ఐదేళ్లు ప్రజల ధన మాన ప్రాణాలకు రక్షణ కరువైంది
- పరిశ్రమలు, పెట్టుబడులతో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నాం
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమాన్ని సక్రమంగా అమలు చేస్తున్నాం
- ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి గడపకూ చేర్చాలన్న మంత్రి కొల్లు



కర్నూలు (చైతన్య రథం): రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం బాటలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా జొన్నగిరి జియో మైసూర్ గోల్డ్ మైన్స్ పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే కె.ఇ.శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో జొన్నగిరిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎంతోమంది నాయకులు వచ్చారు, వీడారు. కానీ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఎన్ని కష్టాలు వచ్చినా తెలుగుదేశం పార్టీ జెండాను ఎప్పుడూ కార్యకర్తలు వీడలేదు. అంతటి అభిమానం, ధైర్యం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో మాత్రమే సాధ్యమన్నారు.

రాష్ట్రానికి తలమానికంగా జియో మైసూర్ గోల్డ్ మైన్స్ నిలవబోతోంది. దేశంలో అనేక ప్రాంతాల్లో గోల్డ్ మైన్స్ ఉన్నప్పటికీ ప్రైవేట్ రంగంలో వచ్చిన తొలి గోల్డ్ మైన్ మన రాష్ట్రంలోనే ఉండటం అదృష్టమన్నారు. గోల్డ్ మైన్ రావడంతో ఈ ప్రాంతంలో సుమారు 800 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్థానికులకు కల్పించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం రోజుకు కిలో చొప్పున బంగారం ఉత్పత్తి అవుతోంది. భవిష్యత్తులో రోజుకు 5 కిలోల చొప్పున మొత్తంగా 13 వేల టన్నుల బంగారం వెలికి తీయడమే లక్ష్యంగా సంస్థ పని చేస్తోంది.

గత ఐదు సంవత్సరాలు పరిశ్రమలను బెదిరించి కమీషన్ దండుకుంటే, ప్రస్తుతం కూటమి పాలనలో పరిశ్రమలు, పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. గత రెండేళ్ల కాలంలో దేశం మొత్తంలో వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు ఏపీకి రావడం రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి నిదర్శనమన్నారు. జగన్ రెడ్డి పాలనలో దాడులు, దౌర్జన్యాలు, హత్యలతో ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేశారు. ఉద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలను రకరకాలుగా హింసించారు. ప్రజలు గత ఐదేళ్ల పాలనలో ఎంతలా విసిగిపోయారో మొన్నటి ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ అభివృద్ధి దిశగా పాలన సాగిస్తున్నామని, ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు.

సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశామని, హామీ మేరకు పెన్షన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. పెన్షన్ల కోసమే నెలకు రూ.2,700 కోట్లు చొప్పున ఏడాదికి సగటున రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. త్వరలోనే వితంతు పెన్షన్ కూడా అందించబోతున్నామని తెలిపారు. తల్లికి వందనం పథకంతో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందించామని, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలను పక్కాగా అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా గుంతలు లేకుండా రోడ్లు నిర్మించామని, సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తున్నామని వివరించారు.

గత ఐదు సంవత్సరాలు జగన్ రెడ్డికి ఫోటోలు వేసుకోవడం, రాళ్లపై బొమ్మలు వేసుకోవడం, రంగులేయడం, తీయడం తప్ప రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో డ్రామాలాడాడని, ఉచిత ఇసుక పథకాన్ని రద్దు చేసి ప్రైవేటు పేరుతో ఇసుకలో దోచుకున్నాడని విమర్శించారు. మద్య నిషేధం పేరుతో అధికారంలోకి వచ్చి కల్తీ మద్యంతో ప్రజల్ని దోచుకున్నాడని ఆరోపించారు. చివరికి కూటమి ప్రభుత్వంపై కూడా నిందలేసేందుకు మొలకలచెరువు, ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్‌తో కల్తీ మద్యం తయారు చేయించారని, ప్రభుత్వాన్ని అస్థిరపరచడం లక్ష్యంగా ప్రజల ప్రాణాలు తీసేందుకు సైతం తెగబడ్డారని మండిపడ్డారు.

రాష్ట్రంలో ప్రతి మూడు మద్యం బాటిళ్లలో ఒకటి కల్తీ అని చెప్పిన జగన్ రెడ్డి నిరూపించమంటే తప్పించుకుని పారిపోయాడని, చివరికి సొంత చిన్నాన్నను హత్య చేసి చంద్రబాబుపై నెట్టేందుకు భారీ ఫోటోలు వేయించాడని ఆరోపించారు. నరకాసుర రక్తచరిత్ర అంటూ కథనాలు వండి వార్చారని, అధికారంలోకి వచ్చాక హంతకులకు వంత పాడాడని విమర్శించారు. ఇప్పుడు అమరావతి, పోలవరం, రాయలసీమ ప్రాజెక్టులపై విషం చిమ్ముతున్నాడని, మావిగన్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో మూడు ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని, పోలవరం పూర్తయితే అన్ని ప్రాంతాలకు సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

కార్యక్రమంలో పత్తికొండ ఎమ్మెల్యే కె.ఇ.శ్యామ్ కుమార్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, జిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 11 లక్షల పెన్షన్లు కొట్టేసింది జగనే..

### - మంత్రి కొండపల్లి కౌంటర్



అమరావతి (చైతన్య రథం): మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి పెన్షన్ల విషయంలో వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో కౌంటర్ ఇచ్చారు.

గురువారం జగన్మోహన్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో 66 లక్షల మందికి పెన్షన్లు ఇస్తే, చంద్రబాబు హయాంలో 6 లక్షల పెన్షన్లు తొలగించారని చెప్పింది అవాస్తవాలు, పచ్చి అబద్ధాలు అని కొండపల్లి విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో పెన్షన్ల కోత పెడితే కూటమి ప్రభుత్వం వచ్చాకే పెన్షన్ పెంచి వారికి భద్రత కల్పించామని మంత్రి తెలిపారు. గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 5 ఏళ్లలో ఏకంగా 11 లక్షల మంది నిరుపేదల పెన్షన్లు నిర్దాక్షిణ్యంగా తొలగించిందని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరి పెన్షన్ కూడా తొలగించలేదని, కేవలం మృతి చెందిన వారి పెన్షన్లు మాత్రమే రద్దయ్యాయని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే స్పౌజ్ పెన్షన్ కోటాలో వితంతువులతో పాటు ఆరోగ్య పెన్షన్లు కూడా పంపిణీ చేస్తున్న విషయం జగన్మోహన్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు.

ఇప్పటి వరకు 2.50 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేయగా, ఒక్క పెన్షన్ ఇవ్వలేదని, 6 లక్షల పెన్షన్లు తొలగించారంటూ అబద్ధపు ప్రచారం చేయడంలో జగన్మోహన్‌రెడ్డి ఆరితేరిపోయారని మంత్రి ఎద్దేవా చేశారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 5 ఏళ్లలో పెన్షన్ల కోసం 91 వేల కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వంలో 22 నెలల్లోనే పెన్షన్ల కోసమే రికార్డు స్థాయిలో రూ.63,157 కోట్లు ఖర్చు చేశామని కూడా మంత్రి తెలిపారు. గతంలో ఎప్పుడూ లేనట్టుగా మూడు నెలల పెన్షన్లు కూడా ఒకేసారి తీసుకునే సదవకాశం కూడా పెన్షనర్లకు కూటమి ప్రభుత్వం కల్పించిందని మంత్రి తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి అబద్ధపు ప్రచారాలను రాష్ట్ర ప్రజలు ఎవ్వరూ నమ్మవద్దని మంత్రి ఈ సందర్భంగా సూచించారు.

## టిడ్కో కాలనీలకు రోల్ మోడల్..
# ఆత్మకూరు రామాలయం

- నక్షత్రవనంతో ఆధ్యాత్మిక శోభ..
- త్వరలో మంత్రి నారాయణ చేతుల మీదుగా ప్రారంభం
- దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి




ఆత్మకూరు (చైతన్య రథం): రాష్ట్రంలోని టిడ్కో కాలనీలకు రోల్ మోడల్‌గా ఆత్మకూరు టిడ్కో కాలనీలో నిర్మాణంలో ఉన్న రామాలయం నిలుస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం ఆత్మకూరు పట్టణం టిడ్కో కాలనీలో నిర్మిస్తున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని అధికారులు, స్థానిక నేతలతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి, శ్రీవాణి భజన మందిరాల పథకం కింద రాష్ట్రంలో మొట్టమొదట నిర్మాణం పూర్తికాబోతున్న ఆలయంగా ఆత్మకూరు రామాలయం నిలుస్తోందని తెలిపారు. ఈ ఆలయాన్ని త్వరలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. ఆలయ ప్రారంభంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా మంత్రి నారాయణ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్టు చెప్పారు.

### వెయ్యికి పైగా ఆలయాలకు నిధులు మంజూరు

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 5 వేలకు పైగా శ్రీవాణి భజన మందిరాలు ప్రతిపాదించగా, వెయ్యికి పైగా ఆలయాలకు నిధులు మంజూరు చేసి పనులు మొదలుపెట్టారు. ఈ పథకం ద్వారా రూ.10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు నిధులు మంజూరు చేస్తున్నారు. ఆత్మకూరులో రూ.40 లక్షల వ్యయంతో రామాలయ నిర్మాణం మంజూరు కాగా, ప్రస్తుతం పనులు 80 శాతం మేర పూర్తయినట్టు మంత్రి తెలిపారు.

### నక్షత్రవనంతో ప్రత్యేకత

రామాలయ ప్రాంగణంలో 27 నక్షత్రాలకు సంబంధించిన పవిత్ర మొక్కలతో ప్రత్యేకంగా "నక్షత్రవనం" ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి వెల్లడించారు. పురాణాల గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు అందించేందుకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక శోభతో, ప్రశాంత వాతావరణంతో తీర్చిదిద్దుతూ ప్రతి భక్తుడు ఆహ్లాదకరమైన అనుభూతి పొందేలా అభివృద్ధి చేస్తున్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ

ఆత్మకూరు నమూనాను ఆదర్శంగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో కాలనీల్లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రామాలయాల నిర్మాణానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. పేదలు నివసించే టిడ్కో కాలనీల్లో ఆధ్యాత్మిక వాతావరణం కల్పించాలనే సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా భక్తుల ఆకాంక్షల మేరకు ఆలయాల మంజూరుకు చర్యలు చేపట్టినట్టు గుర్తు చేశారు. హిందూ ధర్మ వైభవం, సనాతన ధర్మ ఆచార వ్యవహారాలను పరిరక్షిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం, ధార్మిక చింతన పెంపొందించడమే లక్ష్యంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 43 వేల కోట్ల అవినీతి సామ్రాట్..

# జగన్‌రెడ్డిపై టీడీపీ పొలిట్‌బ్యూరో యనమల ఫైర్

### రాష్ట్రం అతలాకుతలం చేసిన జగన్‌కు ప్రతిపక్ష హోదా దండగని వ్యాఖ్య

విజయవాడ (చైతన్య రథం): వైకాపా అధ్యక్షుడు జగన్‌రెడ్డిపై తెలుగుదేశం పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు మరోసారి ఫైర్ అయ్యారు. నిన్నటి జగన్‌రెడ్డి రెండు గంటల ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర ప్రయోజనాల గురించి గానీ, ప్రజల బాగోగుల గురించి గానీ ఎక్కడా ప్రస్తావించని జగన్ ధోరణి అతని నైజానికి దర్పణం పడుతుందని యనమల ఎద్దేవా చేశారు. సొంత డబ్బా కొట్టుకున్న జగన్‌రెడ్డి టీడీపీపైనా, చంద్రబాబుపైనా నిందలకు మీడియాను అడ్డుపెట్టుకున్నారని, ప్రతిపక్ష పార్టీకి నాయకత్వం వహిస్తున్న ఆయనలో రాష్ట్ర ప్రయోజనాలు ఎక్కడా కనిపించలేదని యనమల తూర్పారబట్టారు. జగన్‌దంతా పాక్షనిజంతో కూడిన క్రిమినల్ బ్యాక్‌గ్రౌండేనని, తాత రాజారెడ్డి జీన్స్ నిండుగా ఉన్న ఆయన బుద్ధివంతుడు ఎలా అవుతాడని యనమల ప్రశ్నించారు. నీతివంతుడుగా తనకు తానే చెప్పుకోవడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని చమత్కరించిన రామకృష్ణుడు, శత్రువులను హతమార్చడం, ఆస్తులు దోపిడీ చేయడం విష సంస్కృతి రాజారెడ్డిదని, కడప జిల్లాలో పాక్షన్‌కు మూలపురుషుడు రాజారెడ్డి కాదా అని యనమల ప్రశ్నించారు.

బెంగళూరు ప్యాలెస్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల వైపు తొంగి చూసిన జగన్‌రెడ్డి, తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని అవినీతి మూటలు గట్టుకున్న అవినీతి సామ్రాట్ అని యనమల ఘాటుగా విమర్శించారు. ఆ అవినీతి చిట్టాలపై దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీలు నిగ్గు తేల్చి జగన్ రూ.43 వేల కోట్లు దొచుకున్నట్టు తేల్చి 11 చార్జీషీట్లు వేశాయన్నారు. ఎప్పటికైనా జగన్ అవినీతి భాగోతం బయట పడక తప్పదని, అందుకనే జగన్‌రెడ్డి జ్యుడీషియల్‌ను కూడా తప్పుదోవ పట్టించి ట్రయల్‌కు రాకుండా డీలే చేస్తున్నారని యనమల ఆరోపించారు.



జగన్‌రెడ్డికి ప్రతిపక్ష పాత్ర పోషించే అర్హత లేదన్న యనమల, ఒకసారి ప్రజలు అధికారమిస్తే విధ్వంసకర పాలనతో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేశాడని, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అతనిలో ఏ మార్పూ కనిపించలేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి భవిష్యత్తు ఉండకూడదన్నదే జగన్ ఏకైక అజెండాగా కనిపిస్తుందన్న యనమల, పెట్టుబడులు రాకుండా పారిశ్రామికవేత్తలకు మోకాలడ్డుతున్నారని మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఆరోపించారు.

సీట్లు ఎన్నన్నది ముఖ్యం కాదని, సభలో ఒక్క సీటు ఉన్నా నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాముడు కావాల్సిన బాధ్యత ప్రతిపక్షంపై ఉంటుందని, అయితే జగన్‌రెడ్డికి అదేమీ పట్టలేదని యనమల మండిపడ్డారు. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలు పదవులకు రాజీనామా చేసి ప్రజా తీర్పు కోరాలని ఆయన డిమాండ్ చేశారు.

**అవలక్షణాలు మెండుగా ఉన్న జగన్‌రెడ్డి**

జగన్ రాజకీయాలకు అర్హుడు కాదని, అమ్మను చెల్లిని రోడ్డెక్కించిన నేర చరిత్ర వివేక సినిమా చూస్తే తెలుస్తుందని యనమల వ్యాఖ్యానించారు.

## ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్‌తో

# ఎంఎస్ఎంఈలను పటిష్టం చేసుకోండి

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

అమరావతి (చైతన్య రథం): పశ్చిమాసియాలో నెలకొన్న తాజా రాజకీయ, ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో దేశీయ పరిశ్రమలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం "ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ 5.0" తీసుకురావడంపై రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకం ద్వారా గుర్తింపు పొందిన బ్యాంకులు అందించే అదనపు క్రెడిట్ సదుపాయాలపై కేంద్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుందని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 20.77 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉన్నాయని, వాటిలో తయారీ రంగంలో 4.98 లక్షల యూనిట్లు (24శాతం), సేవా రంగంలో 10 లక్షల యూనిట్లు (48శాతం), వ్యాపార కార్యకలాపాల్లో 5.74 లక్షల యూనిట్లు (28శాతం) ఉన్నాయని ఆయన వివరించారు.

**పథకం వివరాలు**

**ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ 5.0 ముఖ్యాంశాలు:**

రుణం చెల్లించలేని పరిస్థితి (డిఫాల్ట్) ఏర్పడినప్పుడు ఎంఎస్ఎంఈలకు 100 శాతం, నాన్ ఎంఎస్ఎంఈ రంగాలకు 90 శాతం వరకు క్రెడిట్ గ్యారెంటీ కవరేజీ అందిస్తారు. 2025-26 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో ఉపయోగించిన అత్యధిక వర్కింగ్ క్యాపిటల్‌లో 20శాతం వరకు బ్యాంకుల ద్వారా పొందవచ్చు. ఒక్కో రుణగ్రహీతకు గరిష్టంగా రూ.100 కోట్ల పరిమితి వరకు అదనపు రుణం లభిస్తుంది. 31మార్చి 2027లోపు మంజూరై, 30 జూన్ 2027నాటికి పంపిణీ చేయబడే రుణాలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థల్లో రుణ ఖాతాలను సక్రమంగా చెల్లిస్తున్న రుణగ్రహీతలు మాత్రమే అర్హులు. నేషనల్ క్రెడిట్ గ్యారెంటీ ట్రస్టీ కంపెనీ లిమిటెడ్ ఈ పథకాన్ని స్వయంగా నిర్వహించి పర్యవేక్షిస్తుంది.



పశ్చిమాసియా యుద్ధ సంక్షోభ ప్రభావానికి గురైన ఎంఎస్ఎంఈలు ఈ సదుపాయం వినియోగించుకుని తమ పరిశ్రమలను పటిష్టం చేసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపిచ్చారు. ఈసీఎల్‌జీఎస్ 5.0 పథకం తీసుకురావడంపై కూటమి ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## జొన్నగిరి గోల్డ్ మైన్స్..

# రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి బంగారు బాట

- మైనింగ్ రంగాన్ని సంపద సృష్టించే శక్తిగా మార్చడమే లక్ష్యం
- గత ప్రభుత్వ దుర్మార్గాల కారణంగా మైనింగ్ భ్రష్టుపట్టింది
- సహజ వనరుల వినియోగంతో రాష్ట్రాభివృద్ధి
- మైనింగ్ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ



కర్నూలు (చైతన్య రథం): రాష్ట్ర మైనింగ్ రంగంలో అపారమైన వనరులున్నాయని, వాటిని సంపద సృష్టించే శక్తిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సమీపంలో ఉన్న జియో మైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తున్న గోల్డ్ మైన్స్‌ను పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్ బాబుతో కలిసి సందర్శించారు. గోల్డ్ మైనింగ్ కార్యకలాపాలు, ఆధునిక సాంకేతిక పద్ధతులు, ఖనిజ శుద్ధి ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మైనింగ్ రంగాన్ని అత్యాధునిక సాంకేతికతతో అభివృద్ధి చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలంగా మలచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జొన్నగిరి గోల్డ్ మైన్స్‌లో అత్యాధునిక యంత్రాంగం, నూతన సాంకేతిక పద్ధతులు ఉపయోగిస్తున్న తీరు ఆకట్టుకుందని పేర్కొన్నారు. గతంలో గోల్డ్ మైన్స్‌ను సందర్శించిన సందర్భంలో అక్కడి పరిస్థితులతో పోలిస్తే జొన్నగిరిలో సాంకేతిక పరంగా ఎంతో అభివృద్ధి కనిపిస్తోందన్నారు. ప్రస్తుతం గనుల్లో సుమారు 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో రెండు కిలోమీటర్ల లోతు వరకు వెళ్లే అవకాశముందని తెలిపారు. లోతుకు వెళ్లే కొద్దీ బంగారం నిల్వలు మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. ప్రస్తుతం రోజుకు సగటున ఒక కిలో బంగారం ఉత్పత్తి అవుతుండగా, నెలకు సుమారు 30 కిలోల వరకు ఉత్పత్తి చేస్తున్నారని వెల్లడించారు. ఒక టన్ను ఖనిజంలో సుమారు ఒక గ్రాము బంగారం లభిస్తోందని చెప్పారు. జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో సుమారు 13 వేల టన్నుల వరకు ఖనిజ నిల్వలు ఉన్నాయని అంచనా వేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రెండు లక్షల టన్నుల ఖనిజాన్ని ప్రాసెసింగ్ చేసినట్లు వివరించారు. ఈ గోల్డ్ మైన్ దేశంలోనే తొలి ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో మైనింగ్ రంగంలో ఇంకా విస్తృత అవకాశాలు ఉన్నాయని, అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో కూడా గోల్డ్ మైనింగ్‌కు అనుకూల ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. త్వరలోనే అక్కడి ప్రక్రియలను పూర్తి చేసి అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ కాలంలో మైనింగ్ రంగం నిర్లక్ష్యానికి గురైందని, ఖనిజ సంపదను రాష్ట్ర అభివృద్ధికి వినియోగించకుండా కొందరి ప్రయోజనాలకే పరిమితం చేశారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఖనిజ సంపదను రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. రాష్ట్ర తీరప్రాంతాల్లో లభించే రేర్ ఎర్త్ మినరల్స్‌కు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ ఉందని, చైనాకు పోటీగా నిలిచే స్థాయిలో మన దేశంలో ఖనిజ వనరులు ఉన్నాయని పేర్కొన్నారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ అభివృద్ధికి అవసరమైన బ్లాకులను గుర్తించి టెండర్ ప్రక్రియలు పూర్తి చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా క్వార్ట్జ్ ఖనిజానికి విలువ ఆధారిత పరిశ్రమలు తీసుకువచ్చి, సోలార్ ప్యానెల్స్ వంటి ఉత్పత్తులను రాష్ట్రంలోనే తయారు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దీని ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని చెప్పారు. అలాగే రాష్ట్రంలో లభించే గ్రానైట్‌కు అంతర్జాతీయ మార్కెట్లో భారీ డిమాండ్ ఉందని, వాటిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి అలంకార వస్తువుల తయారీకి ప్రోత్సాహం అందించనున్నట్లు వెల్లడించారు. జొన్నగిరి గోల్డ్ మైన్స్‌ను ముఖ్యమంత్రి త్వరలో సందర్శించే అవకాశముందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించి మైనింగ్ రంగంలో గత ఏడాదితో పోలిస్తే 30 శాతం వృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. భవిష్యత్తులో మైనింగ్ రంగం ద్వారా రాష్ట్రానికి మరింత ఆదాయం, ఉపాధి, పారిశ్రామికాభివృద్ధి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత ఐదు సంవత్సరాలు మైనింగ్ రంగాన్ని జగన్ రెడ్డి నాశనం చేశారు. క్వార్ట్జ్ లాంటి మినరల్స్ మరింత దారుణంగా దోచుకుని జేబులు నింపుకున్నారు. కేసులు పెట్టి క్వారీలను లాక్కోవడంతో మైనింగ్ ఆదాయం పూర్తిగా నిలిచిపోయింది. ఆ పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, భవిష్యత్తులో అత్యుత్తమ రంగంగా తీర్చిదిద్దుతామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఓబులేసు, టీడీపీ జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, బోయ కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఇన్‌చార్జ్) నాగిని, డీఎస్పీ వెంకటరామయ్య పాల్గొన్నారు.

చైతన్యరథం

# పీఎన్జీపై విస్తృత ప్రచారం..

# యువతకు ఉపాధి మార్గం

- అన్ని జిల్లాల్లో ప్రత్యేక ప్రచార జాతాలు
- యువతకు పీఎన్జీ సాంకేతిక అంశాలపై ప్రత్యేక శిక్షణ
- డ్వాక్రా సంఘాల మహిళలకు అవగాహన, ప్రోత్సాహకం
- అన్ని ఆలయాల్లో పీఎన్జీ గ్యాస్ వాడకం తప్పనిసరి
- అద్దెదారులకు పీఎన్జీ వాడకంలో సరళంగా నిబంధనలు
- పీఎన్జీ గ్యాస్ విస్తరణపై మంత్రి నాదెండ్ల సమీక్ష



అమరావతి (చైతన్య రథం): ఎల్పీజీ గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ నేచరల్ గ్యాస్ (పీఎన్జీ) వైపు ప్రజలను మళ్లించే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. పీఎన్జీ గ్యాస్ విస్తరణపై శుక్రవారం సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రవాణా శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయ గ్యాస్ ఏర్పాట్లను వేగంగా ప్రజలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రజలు వంట గ్యాస్ విషయంలో ఎలాంటి ఇబ్బందీ పడకూడదనే కృత నిశ్చయంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పీఎన్జీ గ్యాస్ నిర్వహిస్తున్న 5 కంపెనీలు సిద్ధంగా ఉండాలని, విస్తరణను వేగవంతం చేయాలని సూచించారు. నగరాలు, పట్టణాల్లో గ్యాస్ విస్తరణకు అవసరమైన అనుమతులు వేగంగా ఇస్తున్నామని, ఎలాంటి సమస్యలున్నా ప్రభుత్వం అత్యంత వేగంగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పీఎన్జీ ఫిల్లింగ్ సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను లీజు పద్ధతిలో సత్వరం కేటాయించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

**యువతకు నైపుణ్య శిక్షణ.. ఉపాధి అవకాశాలు**

పీఎన్జీ గ్యాస్ విస్తరణలో మానవ వనరుల కొరత లేకుండా ఉండాలంటే యువతను భాగస్వాములను చేయాలని మంత్రి పేర్కొన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు, ఇతర నైపుణ్య సంస్థల విద్యార్థులకు పీఎన్జీ టెక్నికల్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు ఇందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి జిల్లా నుంచి 15 రోజులకు ఒక బ్యాచ్‌లో 100 మంది యువతకు వారం రోజులపాటు ఉచిత వసతి, భోజనం, ఉపకారవేతనంతో పీఎన్జీ నైపుణ్య శిక్షణ అందించాలని ఆదేశించారు. ఇందులో పీఎన్జీ కంపెనీలను అనుసంధానం చేసుకుంటే మానవ వనరుల కొరత అధిగమించవచ్చని, యువతకు ఉపాధి భరోసా కల్పించవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రచార జాతాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని గ్యాస్ కంపెనీలను కోరారు.

**మహిళా సంఘాల ద్వారా ప్రచారం**

పీఎన్జీ వినియోగం వల్ల కలిగే సౌకర్యాలు, ఆర్థిక ఆదా, భద్రత వంటి సానుకూల అంశాలను ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లాలని మంత్రి చెప్పారు. సెర్ప్, మెప్మా అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా పీఎన్జీ ప్రయోజనాలు మహిళలకు తెలిసేలా ప్రచార కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. గ్యాస్ కంపెనీలు సైతం మహిళా సంఘాలతో సమన్వయం చేసుకుని తగిన ప్రోత్సాహకాలు అందించాలన్నారు. ప్రసార సమాచార శాఖ ద్వారా అన్ని జిల్లాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తారని వెల్లడించారు.

**ఆలయాల్లో పీఎన్జీ తప్పనిసరి**

రాష్ట్రంలో అన్నదానం జరిగే పెద్ద ఆలయాలన్నింటిలో పీఎన్జీ వినియోగం తప్పనిసరి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి తెలిపారు. ఇప్పటికే కొన్ని ఆలయాలు పీఎన్జీ వైపు మారాయని, మిగతా వాటిలో ఉన్న చిన్నపాటి సమస్యలను వేగంగా పరిష్కరిస్తారని చెప్పారు. దుర్గగుడి, శ్రీకాళహస్తి ఆలయాల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ఆదేశించినట్లు వెల్లడించారు.

**అద్దె నివాసితులకు సరళ నిబంధనలు**

ఇళ్లలో అద్దెకు నివసించే వారికి పీఎన్జీ కనెక్షన్ వాడకం, ఎల్పీజీ రాయితీ సులభంగా అందుకునే నిబంధనలు సరళంగా రూపొందిస్తారని మంత్రి స్పష్టం చేశారు. పీఎన్జీ వినియోగదారులకు కూడా ఏటా రూ.2,400 దీపం-2 పథకం రాయితీ అందించాలని ముఖ్యమంత్రి సూచించారని, అందుకు అనుగుణంగా నిబంధనలు సిద్ధం చేశారని తెలిపారు. నగరాలు, పట్టణాల్లో గ్రూప్ హౌసింగ్, అపార్ట్‌మెంట్లు, విల్లాలకు వేగంగా పీఎన్జీ అందించేలా కంపెనీలు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. 15 రోజుల్లో పీఎన్జీ కంపెనీల పనితీరుపై మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, అన్ని కంపెనీల విస్తరణలో స్పష్టమైన పురోగతి కనిపించాలని మంత్రి హెచ్చరించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు, డైరెక్టర్ నపూర్, ఆయిల్ కంపెనీలు, పీఎన్జీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్యూఆర్ కోడ్‌తో మందుల పారదర్శకత

# ఇ-ఔషధికి కొత్త రూపం


- మందుల సరఫరా, వినియోగ వ్యవస్థలో సమూల మార్పులు
- మందుల వినియోగ కాలపరిమితికి తగ్గట్టు 'అలర్ట్' మెసేజ్‌లు
- రాష్ట్ర ఇ-ఔషధి (సాఫ్ట్వేర్) కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణ
- మంగళగిరిలో ప్రస్తుత విధానం అమలుతీరుపై ప్రత్యేక సమీక్ష

మంగళగిరి (చైతన్య రథం): ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల సరఫరా, వినియోగ విధానంలో సమూల మార్పులు రాబోతున్నాయి. ఏ ఆసుపత్రిలో ఏ మందు అందుబాటులో ఉందో ప్రజలు నేరుగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తెలుసుకునే విధానాన్ని అమలులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మందుల వ్యవహారంలో ప్రతి ప్రక్రియను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత పర్యవేక్షణ అధికారులకు రియల్ టైమ్ అలర్ట్‌లు పంపే వ్యవస్థను రూపొందించనున్నారు. ఈ లక్ష్యంతో 2014నుంచి అమలవుతున్న 'ఇ-ఔషధి' వ్యవస్థను అత్యాధునిక సాంకేతికతతో పటిష్టం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళగిరిలోని రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం కీలక సమావేశం జరిగింది. మంత్రి సత్యకుమార్ చొరవతో ఢిల్లీ నుంచి సీ-డాక్ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటింగ్) ఉన్నతాధికారులు ప్రత్యేకంగా వచ్చి పాల్గొన్నారు.

**ప్రస్తుత విధానం ఇలా ఉంది**

రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ద్వారా జరిగే కొనుగోళ్లకు అనుగుణంగా ప్రభుత్వ ఆసుపత్రులకు మందుల సరఫరా ప్రస్తుతం 'ఇ-ఔషధి' యాప్ ఆధారంగా నడుస్తోంది. ప్రతి ఏటా మందులు, సర్జికల్ పరికరాల కొనుగోళ్లకు సుమారు రూ.800 కోట్లు వ్యయమవుతున్నాయి. ఇందులో రూ.600 కోట్ల విలువైన మందులను పేద రోగులకు ఉచితంగా సరఫరా చేస్తున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బోధనాసుపత్రుల వరకు ఫార్మసిస్టులు, మెడికల్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లు పంపే ఇండెంట్ల



ఆధారంగా 'ఇ-ఔషధి' ద్వారా మందుల ప్రతిపాదనలు తయారవుతున్నాయి. టెండర్ల ద్వారా ఎంపికైన సంస్థలు జిల్లాల సెంట్రల్ డ్రగ్ స్టోర్లకు (సీడీఎస్) మందులు పంపుతున్నాయి. అక్కడి నుంచి సంబంధిత ఆసుపత్రులకు సరఫరా జరుగుతోంది. ఈ ప్రక్రియలో మందుల సరఫరా, వినియోగం, గడువు తేదీ నిర్వహణ వంటి అంశాల్లో పలు సమస్యలు తలెత్తుతున్నాయి.

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే సీ-డాక్ ప్రస్తుతం ఏపీతో సహా 26 రాష్ట్రాలు, 5 కేంద్ర పాలిత ప్రాంతాల్లో మందుల సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తోంది. సీ-డాక్ నేషనల్ అసోసియేట్ డైరెక్టర్ సంష్యాద్ అన్సారీ, ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్ పార్థ పి.చటర్జీ, ప్రాజెక్ట్ మేనేజర్ ముస్తాక్ అహ్మద్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర సీ-డాక్ సీనియర్ ప్రాజెక్ట్ ఇంజినీర్ పి.అశ్విని, డ్రగ్ వింగ్ అధికారులు, జిల్లాల సెంట్రల్ డ్రగ్ స్టోర్ పర్యవేక్షణ అధికారులు, సీనియర్ ఫార్మసిస్టులు కూడా హాజరయ్యారు. ప్రస్తుత విధానంలో సానుకూలతలు, లోపాలను చర్చించి, రాబోయే మార్పులపై సలహాలు, సూచనలు స్వీకరించారు.

**రాబోయే కీలక మార్పులు**

క్యూఆర్ కోడ్ ద్వారా పారదర్శకత: ఆసుపత్రుల్లో మందుల నిల్వలను ఫార్మసిస్టులు, వైద్యాధికారులు మాత్రమే కాకుండా సాధారణ ప్రజలు కూడా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నేరుగా తెలుసుకోవడానికి వీలుకల్పిస్తారు.

గడువు తేదీ అలర్ట్ వ్యవస్థ: మందులు ఆరు నెలల్లోగా గడువు తీరబోతున్నా ముందస్తుగా అలర్ట్ వచ్చే వ్యవస్థను 'ఇ-ఔషధి'లో పొందుపరుస్తారు. దీనివల్ల మందులు వృథా అవకుండా సకాలంలో వినియోగించవచ్చు.

డ్యాష్‌బోర్డ్ సదుపాయం: ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల (ఉప ఆరోగ్య కేంద్రాలు) నుంచి బోధనాసుపత్రుల వరకు అన్ని స్థాయిల్లో మందుల నిల్వలను ఎవరైనా ఒకే చోట తెలుసుకునే 'గ్లోబల్ డ్యాష్‌బోర్డ్'ను అభివృద్ధి చేస్తారు.

అవసరానికి తగ్గట్టు కొనుగోళ్లు: రోగుల అవసరాలకు అనుగుణంగా మాత్రమే మందుల డిమాండ్ వచ్చే విధానాన్ని బలోపేతం చేస్తారు. కొనుగోళ్లు, సరఫరా ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండేలా మార్పులు తీసుకొస్తారు.

రియల్ టైమ్ అలర్ట్‌లు: మందుల తయారీదారులు, పంపిణీదారులు సీడీఎస్‌లకు సరఫరా చేసిన వెంటనే జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు తక్షణం అలర్ట్ వచ్చే వ్యవస్థను అమలు చేస్తారు. టెండర్ నిబంధనల మేరకు మందులు సకాలంలో సరఫరా అవుతున్నాయా లేదా అన్న అంశాన్ని కూడా రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తారు.

మనమిత్ర యాప్‌లో అనుసంధానం: 'మనమిత్ర' యాప్ ద్వారా కూడా ప్రతి ఆసుపత్రిలో మందుల నిల్వ వివరాలు తెలుసుకునే సదుపాయం కల్పిస్తారు.

ఆయుష్ మందులు కూడా: ఆయుర్వేద, హోమియో, యూనాని మందుల సరఫరా విధానాన్ని కూడా 'ఇ-ఔషధి' పరిధిలోకి తీసుకురావడంపై పరిశీలన జరుగుతోంది.

## 'పర్యాటక పోలీసు' విధానంతో

# పర్యాటకుల భద్రతకు భరోసా

- **క్యాబినెట్ లో చర్చించి అమలుకు సన్నాహాలు**
- **సమీక్షలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**



అమరావతి (చైతన్య రథం): వెలగపూడి సచివాలయంలో శుక్రవారం అటవీ, పర్యాటక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విస్తృత సమీక్ష నిర్వహించారు. ఎకో టూరిజం అభివృద్ధి, పచ్చదనం పెంపు, అటవీ భూముల రక్షణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో దాదాపు 200 దర్శనీయ స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. అటవీ, పర్యాటక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా కమిటీగా ఏర్పడి ఐదు రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. పర్యాటకుల భద్రతకు 'పర్యాటక పోలీసు' విధానాన్ని క్యాబినెట్‌లో చర్చించాలని సూచించారు. ఇది అమలైతే రాష్ట్రంలో 50 వేలమంది యువతకు ఉపాధి లభిస్తుందని, జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు సురక్షిత రాష్ట్రంగా గుర్తింపు వస్తుందన్నారు.

గ్రామాల్లో పర్యాటకాన్ని పెంపొందించేందుకు ఈశాన్య రాష్ట్రాల హోమ్‌స్టే విధానాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, పైలెట్ ప్రాజెక్టులుగా కొన్ని ప్రాంతాలు ఎంచుకోవాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. కర్నూలు జిల్లా కృష్ణ జింకలు, నల్లమల బైర్లూటి, నెల్లూరు ఫ్లెమింగో కేంద్రాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని నొక్కి చెప్పారు. రూట్ మ్యాప్, వసతుల వివరాలతో ప్రత్యేక యాప్ రూపొందించాలని, జూన్ 10లోపు అటవీ-పర్యాటక శాఖల మధ్య ఎంఓయూ కుదుర్చుకోవాలని ఆదేశించారు. దేవాదాయ శాఖతో సమన్వయం చేసుకుని ఆధ్యాత్మిక-ప్రకృతి కాంబో ప్యాకేజీలు రూపొందించాలని పేర్కొన్నారు.

## బాధ్యతగా పని చేయకపోతే ఎలా?

- **50 శాతం గ్రీన్ కవర్ ఉండాలని చెప్పాము**
- **గ్రేట్ గ్రీన్ వాల్‌లాంటి ప్రతిష్ఠాత్మక పనులూ చేపట్టలేరా?**
- **ప్రత్యేక సమీక్షలో డిప్యూటీ సీఎం పవన్ ఆగ్రహం**

అమరావతి (చైతన్య రథం): స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంలో భాగంగా రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వారం రోజుల్లో ఏపీ గ్రీన్ సొసైటీ ఏర్పాటు చేయాలని, జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 2.5 కోట్ల విత్తన బంతులు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని - విద్యార్థులు, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయాలని అన్నారు. శేషాచలం అడవుల నుండి విదేశాలకు అక్రమంగా తరలిపోయిన ఎర్ర చందనం తిరిగి రప్పించే ప్రక్రియపై కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేయాలని ఆదేశించారు. అటవీ భూముల ఆక్రమణలపై జియోట్యాగ్ స్పేషియల్ సర్వే చేపట్టాలని, ఆక్రమణ వివరాలు అటవీ శాఖ వెబ్‌సైట్‌లో పారదర్శకంగా పొందుపరచాలని కోరారు. "మొక్కలు నాటడమే కాదు -అవి మహావృక్షాలు అయ్యే వరకు కాపాడటమే అసలైన బాధ్యత" అని అధికారులను హెచ్చరించారు. నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో పులులు గ్రామాల వైపు రాకుండా వాటి సంచార మార్గాల్లోనే వాటర్ సాసర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో పర్యాటక మంత్రి శ్రీ కందుల దుర్గేష్, అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ శ్రీ పి.వి.చలపతిరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విషపూరిత సేద్యానికి చెక్!

**ప్రకృతి సాగుతో ఏపీ రైతుకు అంతర్జాతీయ బ్రాండింగ్ - 20 లక్షల ఎకరాల్లో జీరో బడ్జెట్ విప్లవం - చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రకృతి విప్లవం**

మార్కెట్‌కు వెళ్తే పురుగుల మందుల భయం. పొలంలో పెట్టుబడి తడిసి మోపెడవుతుందని రైతుకు వేదన.. ఈ రెండు సమస్యలకూ ఒకే సమాధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం "పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం" (జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ - జెడ్‌బీఎన్‌ఎఫ్)ను ఉద్యమస్థాయిలో ముందుకు తీసుకెళ్తోంది. రాష్ట్రంలో ఇప్పటికే 18 లక్షలమంది రైతులు ప్రకృతి వ్యవసాయంవైపు అడుగులు వేయగా, 20 లక్షల ఎకరాల్లో రసాయనాలు లేని సేద్యం దిశగా ఏపీ దూసుకుపోతోంది.



### ఐక్యరాజ్యసమితి వేదికపై చంద్రబాబు ప్రకటన

ప్రకృతి వ్యవసాయంపై చంద్రబాబు నాయుడికి ఉన్న అవగాహన ఈనాటిది కాదు. గతంలోనే ఆయన ఐక్యరాజ్యసమితి వేదికపై సుస్థిర వ్యవసాయంపై మాట్లాడుతూ "రసాయన రహిత ఆహారమే ప్రపంచానికి రక్షణ. ఆంధ్రప్రదేశ్‌ను వంద శాతం ప్రకృతి వ్యవసాయ రాష్ట్రంగా మార్చడమే తన సంకల్పం" అని ప్రకటించి అంతర్జాతీయ స్థాయి ప్రశంసలు అందుకున్నారు. "సాంకేతికత ఎంత పెరిగినా మనిషి తినేది తిండే. ఆ తిండి విషపూరితం కాకూడదంటే మనం మళ్లీ ప్రకృతి ఒడిలోకి వెళ్లాలి" అని ఆయన నిరంతరం చెబుతుంటారు. పెట్టుబడి లేని వ్యవసాయాన్ని కేవలం ఒక పద్ధతిగా కాకుండా, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే ఆర్థిక వ్యూహంగా ఆయన అభివర్ణిస్తున్నారు.

### అసలు జెడ్‌బీఎన్‌ఎఫ్ అంటే ఏమిటి?

సాధారణంగా వ్యవసాయమంటే హైబ్రిడ్ విత్తనాలు, యూరియా, డీఏపీ వంటి రసాయన ఎరువులకు వేల రూపాయల పెట్టుబడి అవుతుంది. కానీ జెడ్‌బీఎన్‌ఎఫ్ విధానంలో బయటి మార్కెట్ నుంచి ఒక్క రూపాయి వస్తువు కొనాల్సిన అవసరం లేదు. మన పొలంలో, ఇంట్లో దొరికే వనరులతోనే పంటలు పండించవచ్చు. మహారాష్ట్రకు చెందిన ప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ రూపొందించిన ఈ విధానాన్ని ఏపీలో చంద్రబాబు పెద్దఎత్తున విస్తరింపజేశారు. ఈ పద్ధతికి దేశీ ఆవు (నాటు ఆవు) అత్యంత కీలకమైన ఆధారం. ఒక్క దేశీ ఆవు ఉంటే చాలు, దాదాపు 30 ఎకరాల భూమిలో ప్రకృతి వ్యవసాయం చేయవచ్చని ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తోంది.

### నాలుగు సూత్రాలే పునాది

**జెడ్‌బీఎన్‌ఎఫ్ విధానం నాలుగు ముఖ్యమైన సూత్రాల చుట్టూ తిరుగుతుంది.**

బీజామృతం (విత్తన శుద్ధి): దేశీ ఆవు పేడ, ఆవు మూత్రం, సున్నం, స్థానిక పొలం మట్టిని కలిపి విత్తనాలకు బీజామృతం పట్టిస్తారు. దీని వల్ల విత్తనాలకు ఫంగస్ గానీ, తెగుళ్లు గానీ ఆశించవు.

జీవామృతం (నేలకు జీవం): నీటిలో దేశీ ఆవు పేడ, ఆవు మూత్రం, నల్ల బెల్లం, శనగపిండి, పొలం గట్టు మట్టి వేసి జీవామృతం తయారు చేస్తారు. దీనిని పొలానికి ఇవ్వడం వల్ల మట్టిలోని వానపాములు మేల్కొని నేలను సారవంతంగా మారుస్తాయి.

ఆచ్ఛాదన (మల్చింగ్): పంట వరుసల మధ్య ఖాళీ స్థలాన్ని ఎండుగడ్డి లేదా ఆకులతో కప్పి ఉంచుతారు. దీని వల్ల భూమిలో తేమ ఆవిరి కాకుండా ఉండి నీటి వాడకం 90 శాతం వరకు తగ్గుతుంది.

వాఫాసా (తేమ-గాలి సమతుల్యత): మొక్కలకు విపరీతమైన నీరు కాదు, కొద్దిపాటి తేమ మాత్రమే సరిపోతుంది. భూమిలో నీరు, గాలి సమతుల్యంగా ఉండేలా చూసే ఈ విధానం వేర్లు బలంగా నాటుకోవడానికి దోహదపడుతుంది.

### గ్లోబల్ మార్కెట్‌కు ఏపీ రైతు ఉత్పత్తులు

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండే పంటలకు ప్రత్యేక బ్రాండింగ్ కల్పించి రైతులకు మార్కెట్‌లో ప్రీమియం ధర లభించేలా కూటమి ప్రభుత్వం సరికొత్త విధానాలు తీసుకొస్తోంది. ప్రపంచ మార్కెట్‌లో నేచురల్ ఫుడ్ ప్రొడక్ట్స్‌కు ఉన్న భారీ డిమాండ్‌ను అంచనా వేసుకుంటూ రాష్ట్ర ఉత్పత్తులను అంతర్జాతీయంగా ఎగుమతి చేసేందుకు భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అంతర్జాతీయ గుర్తింపు తెచ్చేలా సర్టిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. అధునాతన సాంకేతికతను ఉపయోగించి అంతర్జాతీయ మార్కెట్ అనుసంధానం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కంటే అత్యధిక ప్రీమియం ధర లభించేలా చర్యలు తీసుకుంటోంది.

"రైతు నుంచి రైతుకు" (ఫార్మర్ టు ఫార్మర్) అనే వినూత్న పద్ధతిలో ప్రకృతి సేద్యంలో అనుభవజ్ఞులైన రైతులు ఇతరులకు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చేలా బలమైన వ్యవస్థను ప్రభుత్వం రూపొందించింది.

### జగన్ హయాంలో నిర్వీర్యం.. కూటమి హయాంలో పునరుజ్జీవం

గత జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ప్రకృతి వ్యవసాయ విభాగానికి నిధులు నిలిపివేసి తూతూమంత్రంగా నిర్వహించారు. దీని వల్ల క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు సరైన ప్రోత్సాహం, మార్కెటింగ్ సదుపాయాలు కరువయ్యాయి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ విభాగానికి మళ్లీ జీవం పోశారు.

రసాయనాలు లేని కూరగాయలు, పండ్లు పండటం వల్ల క్యాన్సర్, మధుమేహం వంటి వ్యాధుల బారిన పడకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం సాధ్యమవుతోంది. ఏళ్ల తరబడి రసాయనాలు వాడి నిస్సారమైపోయిన భూములు సైతం ఈ సంస్కరణల వల్ల మళ్లీ జీవం పోసుకుంటున్నాయి. "ఖర్చు లేని వ్యవసాయం, నిరంతర ఆదాయం" అనే చంద్రబాబు ఆశయం జెడ్‌బీఎన్‌ఎఫ్ ద్వారా సాకారమవుతోందని ప్రభుత్వం పేర్కొంటోంది.





**బి. నిర్మలాజ్యోతి,**

**అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్**

## విశాఖలో టిడ్కో లబ్ధిదారులకు తాళాలు అందజేత

**● కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు**



విశాఖ పశ్చిమ (చైతన్యరథం): విశాఖపశ్చిమ నియోజకవర్గం పద్మనాభనగర్‌లో నిర్మించిన టిడ్కో గృహ సముదాయంలోని సీ9, సీ10 బ్లాకుల్లోని ఇళ్లను విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్, స్థానిక ఎమ్మెల్యే పిజివిఆర్ నాయుడు (గణబాబు), ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను వారు స్వయంగా అందజేశారు.

**ఇల్లు చూడకుండానే లబ్ధిదారులు చనిపోవడం నన్ను తీవ్రంగా కలిచివేసింది: ఎమ్మెల్యే గణబాబు భావోద్వేగం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పేద ప్రజలు ఎదుర్కొన్న నరకాన్ని గుర్తుచేసుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ దుర్మార్గమైన తీరు వల్ల మన నియోజకవర్గంలో తమ సొంతింటిని కళ్లారా చూడకుండానే 122 మంది లబ్ధిదారులు కన్నుమూశారు. కేవలం ఈ పద్మనాభనగర్‌లోనే 22 మంది పేదలు తమ ఇల్లు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూనే ప్రాణాలు కోల్పోయారు. ఈ నిజం నన్ను ఎంతగానో బాధించింది, నిరంతరం కలిచివేసిందని ఎమ్మెల్యే గణబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై పూర్తి నమ్మకంతో పేద ప్రజలు అప్పులు తెచ్చి మరీ డీడీలు కట్టారని, కానీ గత ఐదేళ్లు ఇళ్లు ఎప్పుడు వస్తాయో తెలియని దుస్థితిని సృష్టించారని, వడ్డీలు భారం కాగా, ఇళ్లు రాక పేదలు పడిన అవస్థలు చూసి నాకు రాత్రుళ్లు నిద్ర కూడా పట్టేది కాదని భావోద్వేగానికి గురయ్యారు. 2017లోనే స్టీల్, కాంక్రీట్, గ్రానైట్ కిచెన్లు, టైల్స్‌తో పటిష్టమైన టిడ్కో గృహాల నిర్మాణాన్ని ప్రారంభించామని.. మిగిలిన బ్లాకుల పనులను కూడా రాబోయే రెండు మూడు నెలల్లో పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందజేస్తామని స్పష్టం చేశారు.

**పేదలకు ఇళ్లు ఇవ్వడమే మా బాధ్యత: ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్**

విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ.. మాకు క్రెడిట్ రావడం ప్రధానం కాదని, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు ఎంత త్వరగా ఇల్లు ఇవ్వగలిగామన్నదే తమ బాధ్యతని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కేవలం రంగుల రాజకీయం కోసం రూ.2000 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిందని, అదే డబ్బును టిడ్కో ఇళ్లకు వాడి ఉంటే లక్షలాది మంది పేదలు ఎప్పుడో తమ సొంతింట్లో ఉండేవారన్నారు. 2019లోనే ఇక్కడి ప్రజలు అబద్ధాలను నమ్మకుండా టీడీపీ ఎమ్మెల్యేను గెలిపించి తమ విచక్షణను చాటుకున్నారని కొనియాడారు.

**ఎమ్మెల్యే గణబాబు కృషి అమోఘం: ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి**

ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి మాట్లాడుతూ.. విశాఖ పశ్చిమ నియోజకవర్గానికి గణబాబు ఎమ్మెల్యేగా ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. అందుకే ఈ నియోజకవర్గం ఎప్పుడూ 'వెస్ట్ ఆల్వేస్ బెస్ట్' లా ఉంటుందని ప్రశంసించారు. ఎమ్మెల్యే గణబాబు ప్రతిరోజూ అధికారులను సమన్వయం చేసుకుంటూ, స్వయంగా పర్యవేక్షించి, పట్టుబట్టి మరీ ఈ టిడ్కో పనులను పూర్తి చేయించి సకల సౌకర్యాలతో పేదల కల నిజం చేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, టిడ్కో మరియు జీవీఎంసీ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం

**● అధికారులకు సూచించిన ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు... అర్జీలు స్వీకరణ**



విజయనగరం (చైతన్యరథం): నియోజకవర్గ శాసనసభ్యుల కార్యాలయంలో శుక్రవారం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన 40 సమస్యల వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. శాసనసభ్యురాలు ప్రజల వినతులను శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యురాలు మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండటం తమ ప్రధాన బాధ్యత అని, ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేయడం ద్వారా వేగవంతమైన పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## వివాద, సమస్యల రహిత గ్రామాల నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయం

**●"వన్ మంత్ - వన్ కానిస్టిట్యూయెన్సీ-ఫోర్ విజిట్స్" ప్రారంభంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**

**●ఆనందపురం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన కలెక్టర్, ఎమ్మెల్యే**



విశాఖపట్టణం (చైతన్యరథం) : వివాద, రెవెన్యూ సమస్యల రహిత గ్రామాల నిర్మాణమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "వన్ మంత్ - వన్ కానిస్టిట్యూయెన్సీ - ఫోర్ విజిట్స్" కార్యక్రమం శుక్రవారం భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రారంభమైంది. ప్రజల రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఆర్డీవో సంగీత్ మాధుర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ... గ్రామీణ స్థాయిలో రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రజల వద్దకే జిల్లా స్థాయి అధికారులు వెళ్లి సమస్యలను స్వీకరించి పరిష్కరించడం ద్వారా వేగవంతమైన సేవలు అందుతాయని తెలిపారు. ఇప్పటికే నిర్వహించిన "వన్ మంత్ - వన్ విలేజ్" కార్యక్రమం మంచి ఫలితాలను ఇచ్చిందని గుర్తుచేశారు. వారం వారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కు ఇది అదనపు బలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవటం ద్వారా విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

**జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ...** ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి నాలుగు దఫాలుగా అధికార యంత్రాంగం సందర్శిస్తుందని తెలిపారు. ప్రతి సోమవారం అందుతున్న వినతుల్లో అధిక భాగం రెవెన్యూ సమస్యలేనని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి వద్దకే వెళ్లి పరిష్కారం చూపడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. నెల్లూరు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహించిన ఈ విధానం మంచి ఫలితాలను ఇచ్చిందని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్‌తో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

**161 వినతులు సమర్పించిన ప్రజలు**

ఆనందపురం వేదికగా నిర్వహించిన వన్ మంత్ - కానిస్టిట్యూయెన్సీ-ఫోర్ విజిట్స్ కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై 161 వినతులు సమర్పించారు. వాటిలో రెవెన్యూకు సంబంధించి 95 వినతులు ఉండగా, జీవీఎంసీ, పోలీసు, హౌసింగ్, సంక్షేమ పథకాలకు సంబంధించి 66 వచ్చాయి. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, భీమిలి ఆర్డీవో, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

## అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి : కేంద్ర మంత్రి కె.రామ్మోహన్



ఆమదాలవలస (చైతన్యరథం): అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలంలోని మదనాపురం నుంచి అల్లెన వరకు ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన బీటి రహదారిని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆమదాలవలస మున్సిపాలిటీ జగ్గుశాస్త్రులపేట వద్ద రూ.3.82 కోట్ల నిధులతో చేపట్టనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి రామ్మోహన్ నాయుడు శంకుస్థాపన చేశారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందన్నారు. 24 గంటలు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలనే ఉద్దేశంతో సబ్ స్టేషన్ ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్, జనసేన ఇన్చార్జ్ పేడాడ రామ్మోహన్, కూటమి శ్రేణులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## యువత రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలి : మంత్రి వంగలపూడి



నక్కపల్లి (చైతన్యరథం): యువత ఉన్నత చదువులు చదివి కేవలం ఉద్యోగాలే కాకుండా, రాజకీయాల్లోకి రావాలని హోం మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. పదో తరగతి పరీక్షల్లో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల వారీగా తొలి రెండు స్థానాల్లో నిలిచిన విద్యార్థులతోపాటు జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన 12 మంది.. మొత్తం 115 మంది విద్యార్థులకు రూ. అయిదు వేల చొప్పున నగదు అందించే కార్యక్రమాన్ని సారిపల్లిపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో రాజకీయాల్లో యువత కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. సినిమాల్లో చూపినట్లుగా రాజకీయం, పోలీసు వ్యవస్థ చెడ్డవి కావని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ పదో తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం వంద రోజుల ప్రణాళిక అమలు చేసినప్పుడు ఉపాధ్యాయ వర్గాల నుంచి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని చెబితే ఆయన మాత్రం వారిపై పూర్తి నమ్మకం ఉంచారన్నారు. మంచి ఫలితాలు సాధించి లోకేశ్ నమ్మకాన్ని ఉపాధ్యాయులు నిజమని నిరూపించారన్నారు. ఆడపిల్లలే ఎక్కువమంది ఉత్తమ ఫలితాలు తెచ్చారన్నారు.

## సంస్కారం గురించి వైసీపీ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదం



విజయనగరం (చైతన్యరథం): టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జునను చూసి వైసీపీ నాయకులు సంస్కారం నేర్చుకోవాలని టీడీపీ విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... నాగార్జునకు సంస్కారం నేర్పాల్సిన అవసరం వైసీపీ నాయకులకు లేదన్నారు. ఆయన తల్లి మృణాళిని జిల్లాలో మంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆయన ఎంతో విలువలతో, గౌరవంగా, సాంప్రదాయంగా ఉన్నారని ఆయన చూసి మీరే నేర్చుకోవాలని సూచించారు. ప్రతిపక్ష నేత స్థాయిలో ఉన్న బొత్స సత్యనారాయణ తన స్థాయిని తగ్గించుకోవద్దని నాగార్జున సూచించారని దానికి చీపురుపల్లి వైసీపీ నాయకులు లేనిపోని రాద్ధాంతం చేయడం అర్థ రహితంగా ఉందన్నారు. వైసీపీ నాయకులు చిల్లర వేషాలతోనే బొత్స సత్యనారాయణ స్థాయి తగ్గిపోతోంది తప్ప తమ నాయకుడు తగ్గించలేదని హితవు పలికారు. నాగార్జున వారి తల్లిదండ్రులకు పదవులు ఉన్నప్పుడు కూడా ఎలాంటి అవినీతి చేయకుండా విలువలతో కూడిన సేవలు అందించారని అన్నారు. వైసీపీ నాయకులు మాదిరిగా అవినీతికి పాల్పడలేదని అన్నారు.

# హత్యలు, కుట్ర రాజకీయాలకు కేరాఫ్ “జగన్”

● ప్రజల భావోద్వేగాలతో ఆడుకోవడం జగన్‌కు అలవాటుగా మారింది : ఎంపీ సానా సతీష్‌బాబు



కాకినాడ (చైతన్యరథం): హత్య రాజకీయాలు, కుట్రలతో నిండిన రాజకీయ సంస్కృతికి కేరాఫ్‌గా వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి మారారని రాజ్యసభ సభ్యుడు ఎంపీ సానా సతీష్‌బాబు వ్యాఖ్యానించారు. పేదల నేతగా నిలిచిన వంగవీటి రంగ హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న వారిని రాజకీయంగా ప్రోత్సహించడం ఏ విధమైన నైతికత అని ఆయన ప్రశ్నించారు. అదే కేసుతో సంబంధం ఉన్న కుటుంబ సభ్యులకు కీలక పదవులు కట్టబెట్టడం ద్వారా జగన్‌రెడ్డి ఎలాంటి సందేశం ఇస్తున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. దేవినేని అవినాష్‌కు వైసీపీ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడం వెనుక ఉద్దేశం ఏమిటి? కడియాల బుచ్చిబాబుకు పదవులు ఇచ్చి ప్రోత్సహించింది ఎవరు అని ప్రశ్నించారు. ఇది రంగా అభిమానుల భావోద్వేగాలపై నేరుగా దెబ్బ కాదా? అని నిలదీశారు. రంగా హత్యపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గౌతమ్ రెడ్డికి ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పదవి ఇవ్వడం ద్వారా, జగన్ రెడ్డి రంగా అభిమానులను అవమానించలేదా? అని సతీష్ బాబు ప్రశ్నించారు. రంగా పేరు, వారసత్వం, అభిమానుల భావోద్వేగాలను ఒకవైపు రాజకీయ లాభాల కోసం వినియోగిస్తూ, మరోవైపు అదే హత్య కేసుతో సంబంధం ఉన్న కుటుంబ సభ్యులను పార్టీలో చేర్చుకోవడం వారికి ఉన్నత పదవులు కట్టబెట్టడం... ఇది ఏ విధమైన ద్వంద్వ వైఖరి? అని మండిపడ్డారు. “ఒక మహానేతను అవమానించిన వారిని ప్రోత్సహించడం విలువల రాజకీయమా? లేక స్వార్థ రాజకీయాలా?” అని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. రంగా అభిమానుల ఓట్లు కావాలి కానీ ఆయన గౌరవం అవసరం లేదా? ఇదేనా జగన్ రాజకీయ శైలి? అని నిలదీశారు. ప్రత్యర్థులను విమర్శించడం రాజకీయాల్లో సహజమే అయినా, చారిత్రాత్మక నాయకులను అవమానించిన వారిని పదవులతో సత్కరించడం ప్రజాస్వామ్యానికి అవమానమని పేర్కొన్నారు. జగన్ పాలనలో రంగా గారిని విమర్శించిన వారే పదవులు పొందడం యాదృచ్ఛికమా? లేక పక్కా వ్యూహమా? అని ప్రశ్నించారు. వైసీపీ అధినేత జగన్‌రెడ్డి వైఖరిని ప్రజలు ఇప్పటికే గుర్తించి, పార్టీని కేవలం 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. ఇదే విధానం కొనసాగితే భవిష్యత్తులో వైసీపీ పూర్తిగా రాజకీయంగా పతనమై, అధమపాతాళానికి పడిపోతుందని ఎంపీ సానా సతీష్‌బాబు హెచ్చరించారు.

# పేద ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : జోత్యుల నవీన్



జగ్గంపేట (చైతన్యరథం): జగ్గంపేట మండలం రాజపూడి గ్రామానికి చెందిన గొర్రెల శ్రీలక్ష్మి ఆపరేషన్ కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.49,400 ఎల్ఓసిను జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ స్థానిక రావులమ్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ కుమార్ మాట్లాడుతూ... పేద ప్రజల ఆరోగ్యమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అత్యవసర వైద్యం అవసరమైన వారికి వెంటనే సాయం అందిస్తున్నామని తెలిపారు. పార్టీ కార్యకర్తలు ప్రతి గ్రామంలో సమస్యలు గుర్తించి అర్హులకు న్యాయం చేయాలని సూచించారు. సహాయం అందుకున్న శ్రీలక్ష్మి కుటుంబం చంద్రబాబు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకి, జ్యోతుల నవీన్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జీను మణి బాబు, జిల్లా అధికార ప్రతినిధి రేకా బులిరాజు, గోవిందపురం మాజీ సర్పంచ్ కమ్మిల వెంకటేశ్వరరావు, పీలా మహేష్, కంచి కృష్ణ, కంచి మణి బాబు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే భాష్యం



పెదకూరపాడు (చైతన్యరథం): ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ 87వ రోజు ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాలు కార్యక్రమాన్ని అచ్చంపేట మండలం తాళ్లచెరువులో నిర్వహించారు. 67 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్, సీసీ రోడ్లను ప్రారంభించారు. మండలంలో 19 మందికి మంజూరైన 11,59,314 రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాలకు లింక్ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైన్ నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల వద్దకు ప్రవీణ్ 100రోజులు 100 గ్రామాలు కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమయం పట్టే సమస్యలను నిర్దిత సమయంలో పరిష్కరించాలని సూచించారు. గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలో వీధి లైట్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు. గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పనిచేయాలన్నారు. గ్రామ నాయకులతో సమావేశమై కలిసి కట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గ్రామంలోని కార్యకర్తల ఇళ్లలో జరిగిన కార్యక్రమాల నేపథ్యంలో వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాలతో మాట్లాడారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్య తలెత్తినా వారికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు,గ్రామ అధికారులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 12 క్లస్టర్లలో మహానాడు కార్యక్రమం : పీలా గోవింద



అనకాపల్లి (చైతన్యరథం): అనకాపల్లిలో తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని 12 క్లస్టర్లలో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. అనకాపల్లిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది మహానాడును వర్చువల్ విధానంలో నిర్వహించాలని పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయించడంతో అనకాపల్లి నియోజకవర్గంలో 12 క్లస్టర్లలో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి మహానాడు వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్లు బత్తుల తాతయ్య బాబు, మల్ల సురేంద్ర, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

● కాకినాడలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన టీడీపీ నేతలు



కాకినాడ (చైతన్యరథం): కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమం కీలక వేదికగా నిలుస్తోందని నియోజకవర్గ కో ఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ) అన్నారు. ఆయన ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. మంత్రి నారా లోకేష్‌బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆదేశాల మేరకు ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ప్రతివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఇల్లు పట్టాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధాప్య పింఛన్లు, దివ్యాంగుల పింఛన్లు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, సీఎంఆర్ఎఫ్, చంద్రన్న బీమా తదితర సమస్యలపై మొత్తం 12 అర్జీలు సమర్పించినట్లు వెల్లడించారు. అందిన ప్రతి అర్జీపై తక్షణమే స్పందించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట ప్రకాష్ గౌడ్, సహదేవుడు, దవులూరి కృష్ణ కాంత్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

# భీమవరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

●అర్జీలు స్వీకరించిన ఇన్‌ఛార్జ్ తోట సీతారామలక్ష్మీ



భీమవరం (చైతన్యరథం): నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, భీమవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో “గ్రీవెన్స్ – ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమం నిర్వహించారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అర్హులు అందరికీ అందజేశారు. ఈ వేదిక ద్వారా నియోజకవర్గ ప్రజలు మరియు పార్టీ కార్యకర్తల నుండి ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, రోడ్లు, డ్రైనేజీలు తదితర స్థానిక సమస్యలపై వినతులు, ఫిర్యాదులు స్వీకరించబడ్డాయి. అందిన ప్రతి సమస్యను సవివరంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ పరిష్కారానికి చర్యలు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ మరియు టౌన్, మండలం నాయకులు మరియు తెలుగు మహిళ తెలుగు యువత, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు తెలుగుదేశం పార్టీ, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పండుగకు శ్రేణులు సమాయత్తం

● ఆన్‌లైన్ మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు



తుని (చైతన్యరథం): జాతీయ స్థాయిలో అత్యంత అట్టహాసంగా జరుపుకునే మహానాడు ఈఏడాది క్లస్టర్ల పరిధిలో నియోజకవర్గాల్లో నిర్వహించాలని అధిష్ఠానం నిర్ణయించింది. ఇంధన ఇతర పొదుపు పాటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర మహానాడుకు ప్రత్యామ్నాయంగా నియోజకవర్గాల పరిధిలో క్లస్టర్ల పరిధిలో మహానాడు సభలు నిర్వహించాలని సంకల్పించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రతినిధులతో జరిగే మహానాడుకు నియోజకవర్గాల్లో క్లస్టర్ల పరిధిలో జరిగే మహాసభలను అనుసంధానం చేస్తారు. ఈ నేపథ్యంలో తుని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో క్లస్టర్ల మహానాడు సభలకు పార్టీ నాయకత్వం తలమునకలైంది. శుక్రవారం తేటగుంట క్యాంప్ కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు హాజరై క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ... పది క్లస్టర్ల పరిధిలో పది మహానాడు సభలు నిర్వహించాలని ఇందుకు మండల నాయకత్వాలు సమన్వయంతో పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈనెల 27,28 తేదీల్లో జరిగే మహానాడు సభలను విజయవంతం చేసి రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకు రావాలని సూచించారు. క్లస్టర్లో జరిగే మహాసభలను ఎమ్మెల్యే యనమల దివ్య పర్యవేక్షణ చేస్తారని ఆయన తెలిపారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట) చైతన్యరథం

## స్థానిక ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని ప్రభుత్వ చీఫ్ విప్, జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ వారి కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఒక ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. జీవీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' సంక్షేమ పథకాలను నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ, ప్రతి లబ్ధిదారునికీ చేరేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే శ్రీరామరక్షగా రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి జెండాను ఎగురవేయడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో, అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆయన దిశా నిర్దేశం చేశారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలకు ప్రాధాన్యత ఇస్తున్నాం

**●పెడనలో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్**



పెడన (చైతన్యరథం): నియోజకవర్గంలోని తోటమూల పెడన ఫంక్షన్ హాల్ నందు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా అధికారులులతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలు, గ్రామీణాభివృద్ధి సంబంధిత అంశాలు మరియు ఇతర సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకి కలెక్టర్‌కి తెలియజేశారు. ప్రజలు తమ వినతి పత్రాలను అందజేయగా, కాగిత కృష్ణ ప్రసాద్ వాటిని సానుకూలంగా స్వీకరించి, సమస్యలను త్వరితంగా పరిష్కరించే దిశగా అధికారులను ఆదేశించారు. వేసవికాలం ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, ఎక్కడా తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. "ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా నీటి సరఫరా సజావుగా ఉండేలా చూడాలి. వేసవి ఎండలు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో ఇది ముఖ్యమైన బాధ్యత" అని అయన అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రజా దర్బార్‌లో అధికారులు ఎమ్మెల్యే నిర్దేశాలను అమలు చేయడానికి సిద్ధమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా నాయకులకు చేర్చుకోవడం సాధ్యమవుతోందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

## పర్యావరణ పరిరక్షణపై ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అవగాహన

**● ఇంధన పొదుపుపై అవగాహన కల్పిస్తూ సైకిల్ యాత్ర**



పెనుగంచిప్రోలు (చైతన్యరథం): జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలతో మరింత చేరువ కావడంతో పాటు ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే లక్ష్యంతో శాసనసభ్యులు తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ శుక్రవారం ప్రత్యేకంగా సైకిల్ యాత్ర నిర్వహించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆలోచనలకు అనుగుణంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజాప్రతినిధులు వారంలో ఒకటి లేదా రెండు రోజులు పబ్లిక్ వాహనాల్లో ప్రయాణిస్తూ ఇంధన పొదుపుకు ప్రాధాన్యత ఇవ్వాలని, అనవసర కాన్వాయిలు మరియు ఆర్భాటాలను తగ్గించాలని ఇచ్చిన పిలుపు మేరకు ఎమ్మెల్యే స్పందించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట పట్టణం నుండి ఆర్టీసీ బస్సులో పెనుగంచిప్రోలు వరకు ప్రయాణించిన ఎమ్మెల్యే, అనంతరం పెనుగంచిప్రోలు గ్రామం నుండి అనిగండ్లపాడు గ్రామానికి స్వయంగా సైకిల్ తొక్కుకుంటూ వెళ్లి అక్కడ నిర్వహించిన ప్రజాదర్బార్ – ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలతో కలిసి సాధారణ జీవన విధానాన్ని అనుసరించడం ద్వారా ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతల సీతారామయ్య, కొఠారు సత్యనారాయణ ప్రసాద్, కళ్యాణం కృష్ణారావు మరియు వివిధ హోదాలలో ఉన్న కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ అభివృద్ధే ఎంపీ కేశినేని శివనాథ్ చిరునామా

**●గత ఐదేళ్లు వైసీపీ చేసింది కబ్జాలు సెటిల్మెంట్లే... అవినాష్‌తో రంగా విగ్రహానికి దండ వేయించాలి**

**●ఎంపీ కేశినేని చిన్నిపై దేవినేని అవినాష్ అనుచిత వ్యాఖ్యలను ఖండించిన టీడీపీ నేతలు**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయం నందు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)పై వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ చేసిన అనుచిత వ్యాఖ్యలను టీడీపీ విజయవాడ పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగ సంజయ్ వర్మ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చరణ్ సాయియాదవ్, టీఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి దర్శిత్ మీడియా ముఖంగా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మొన్న జగన్ మీడియా సమావేశంలో ఎన్టీఆర్ జిల్లాలో ఒక కీలక రాజకీయ అంశాన్ని ప్రస్తావిస్తూ వంగవీటి రంగాను టైగర్గా అభివర్ణించిన జగన్‌కు వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఎందుకు గుర్తుకు రాలేదన్నారు. ఓట్లు కోసమే రంగ గుర్తు వచ్చారని ఎద్దేవా చేశారు. నిజంగా జగనుకు చిత్తశుద్ధి ఉంటే విజయవాడలో ఉన్న రంగా విగ్రహానికి ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్‌తో పూలమాల వేయించగలడాని అన్నారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ ఎంపీ చిన్నిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను సైతం తీవ్రంగా ఖండించారు. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ పార్లమెంట్‌లో జరుగుతున్న అభివృద్ధి ఏంటో బయటకు వచ్చి అవినాష్ చూస్తేనే అర్థమవుతుంది కానీ... గుణదల దొడ్డిలో కూర్చుని మీడియా సమావేశాలు నిర్వహిస్తే తెలియదని మండిపడ్డారు. ప్రతి నియోజకవర్గంలో ఎంపీ చిన్ని చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ఏంటో ఆ నియోజకవర్గాలకు వెళితే తెలుస్తుందని జిల్లా అధ్యక్షుడిగా ఉండి ఎంపీ చేస్తున్న అభివృద్ధి ఏంటో తెలుసుకోకపోవడం హాస్యాస్పదమని అన్నారు. విజయవాడ గర్వకారణంగా జరిగే దసరా ఉత్సవాలను ఎంపీ చిన్ని నెక్స్ట్ లెవెల్‌కు తీసుకువెళ్లారని విజయవాడ ఉత్సవ్ వలన ఎందరో మంది చిన్న వ్యాపారుల కు లాభం చేకూరిందని గుర్తు చేశారు. గత ఐదు సంవత్సరాలు జరిగింది మట్టి ఇసుక రేషన్ బియ్యం సెటిల్మెంట్లు పంచాయతీలే జరిగాయని ఇప్పుడు వాటికి తావు లేకుండా విజయవాడ పార్లమెంటు పరిధిలో ప్రశాంతమైన కూటమి పరిపాలనతో పాటు ప్రతి ఎమ్మెల్యే వారి నియోజకవర్గాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టారని ఎంపీ చిన్ని అధిష్టానం ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి విజయవాడ పార్లమెంట్‌కు అనేక రకాల నిధులు తీసుకువస్తున్నారని ఆర్ఓబీలు డ్రైనేజీ పనులు ఫ్లై ఓవర్ నిర్మాణాలు విజయవాడ పార్లమెంట్లో కొత్త పెట్టుబడులు ఇలా అనేక రకాలుగా అభివృద్ధి విజయవాడ పార్లమెంట్లో పరుగులు పెడుతుందని నేతలు తెలిపారు.

## రాష్ట్రంలో చిచ్చు పెట్టి.. ప్రజల్ని రెచ్చగొట్టడమే జగన్ లక్ష్యం : ప్రత్తిపాటి

**●ఐదేళ్లు సాగించిన విధ్వంసం..దోపిడీ...అరాచకంతో ప్రజలు మళ్లీ జగన్‌ను నమ్ముతారా?**

**●మళ్లీ అధికారంలోకి వస్తామనే మత్తు నుంచి జగన్.. వైసీపీ నేతలు బయటపడాలి**



చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రశాంతమైన రాష్ట్రంలో, ప్రజలకోసం పనిచేస్తున్న కూటమి పార్టీల్లో ఏదోఒక చిచ్చు పెట్టి. ప్రజల్ని రెచ్చగొట్టి తన కుటిల రాజకీయాలు అమలు చేయాలన్నదే జగన్ ప్రధాన లక్ష్యమని, ఆయన నిర్వహిస్తున్న సుదీర్ఘ ప్రెస్ మీట్లతో ఎవరికి ఏం ఉపయోగమని ప్రజలే అసహనం వ్యక్తం చేస్తున్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు.

**మళ్లీ అధికారంలోకి వస్తామనే మత్తునుంచి జగన్... వైసీపీనేతలు బయటపడాలి**

గంటలు.. గంటలు ప్రెస్ మీట్లు పెట్టి, నిరాధార ఆరోపణలు.. అవాస్తవాలతో ప్రజల దృష్టి మళ్లించి, తన రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవాలనే ధోరణిలో జగన్ ఉన్నాడని, ఆయన.. వైసీపీనేతలు మళ్లీ అధికారంలోకి వస్తామని మత్తునుంచి బయటపడాలని ప్రత్తిపాటి సూచించారు. చంద్రబాబు పనితీరు, లోకేశ్ సమర్థతతో రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే జగన్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాడన్నారు. పెట్టుబడులు తీసుకొచ్చి, అభివృద్ధి చేయడం చేతగాని జగన్ రెడ్డి.. కూటమిప్రభుత్వ పనితీరుతో నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నాడన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం.. దూరదృష్టి.. విశ్వసనీయతలపై ప్రజలకున్న నమ్మకం ఎప్పటికీ చెక్కుచెదరదనే వాస్తవాన్ని జగన్ గ్రహించాలన్నారు.

**ప్రజల కోరిక మేరకే ఆక్రమణల తొలగింపు...**

పట్టణంతో పాటు.. ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న ఆక్రమణలతో తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నందున, ఆక్రమణలు తొలగించాలని నిర్ణయించినట్లు ప్రత్తిపాటి చెప్పారు. గ్రీవెన్స్ లో కొందరు స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చిన ఆక్రమణల సమస్యపై ప్రత్తిపాటి స్పందించారు. కృష్ణారెడ్డి డొంక, పసుమర్రు–కొత్త బైపాస్ మార్గంలో ఉన్న ఆక్రమణలు తొలగిస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ స్థలాలు, ఇతర భూముల్ని కూడా ఆక్రమణదారులు నుంచి విడిపిస్తామని ప్రత్తిపాటి స్పష్టంచేశారు.

## పొగాకు వినియోగం ప్రాణాంతకం... పోస్ట్ కార్డ్స్ ఉద్యమం ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె



విజయవాడ (చైతన్యరథం): పొగాకు వినియోగం ప్రాణాంతకమని, అందరూ వాటికి దూరంగా ఉండాలని ముఖ్యంగా యువత అస్సలు తీసుకోవద్దని తూర్పు శాసనసభ్యులు గద్దె రామమోహన్ హితవు పలికారు. శుక్రవారం ఉదయం నవజీవన్ బాల భవన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆటోనగర్ అర్.టి.సి. బస్ స్టాండ్ ఆవరణలో ప్రపంచ పొగాకు వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా "పోస్ట్ కార్డ్స్ ఉద్యమం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు హాజరయ్యారు. పొగాకు వ్యతిరేక సందేశంతో మొదటి పోస్టు కార్డును ఆయన పూర్తి చేసి అందజేశారు. అనంతరం ప్రత్యేక పొగాకు వ్యతిరేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గద్దె రామమోహన్ మాట్లాడుతూ, పొగాకు ఆరోగ్యానికి అత్యంత హానికరమని తెలిపారు. పొగాకు వినియోగం వలన శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్, గుండెజబ్బులు వంటి అనేక తీవ్రమైన వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. అనంతరం అవి ప్రాణాంతకమవుతాయని చెప్పారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నవజీవన్ సంస్థ వినూత్నంగా నిర్వహిస్తున్న "పోస్ట్ కార్డ్స్ క్యాంపెయిన్" అభినందనీయమని కొనియాడారు. వారు నిర్వహిస్తున్న "పోస్ట్ కార్డ్స్ ఉద్యమం" ద్వారా ప్రజలు, విద్యార్థులు, యువత, కార్మికుల్లో పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ అభిప్రాయాలు, విజ్ఞప్తులు, పొగాకు వ్యతిరేక సందేశాలను పోస్ట్ కార్డులపై రాసి ప్రచారానికి మద్దతు తెలియజేయాలని కోరారు.

# సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

## పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



గిద్దలూరు (చైతన్యరథం): పట్టణంలో 11వ వార్డ్, గాంధీ బొమ్మ సెంటర్, బ్రిటన్ స్ట్రీట్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం జరిగిన భూమిపూజలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. బ్రిటన్ స్ట్రీట్ లో రోడ్డు ప్యాచ్ వర్క్ లో భాగంగా రూ. 7లక్షలు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆశోక్ రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ చాలాకాలం నుండి రోడ్డు చాలా ఘోరంగా గుంతలు పడి నరకయాతన అనుభవించినా గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ద్విచక్ర వాహనాల ప్రమాదాలు జరిగాయన్నారు. దీనితో సమస్యను ఎమ్మెల్యే ఆశోక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళామన్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని వెంటనే సిమెంట్ రోడ్డు వేయడానికి భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని, మహిళలందరు ఎమ్మెల్యే ఆశోక్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మహిళలతో ఎమ్మెల్యే ఆశోక్ రెడ్డి మాట్లాడుతూ మీరు నాకు ధన్యవాదాలు కాదు ఆశీస్సులు ఇవ్వాలి అని కోరారు. మీకు ఇబ్బందిగా ఉంటే వాటిని పరిష్కారించడం మీ ఎమ్మెల్యే గా నా బాధ్యత అని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఆర్ అండ్‌బీ, మున్సిపాలిటీ, రెవిన్యూ అధికారులు, పట్టణ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, వార్డ్ కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, వార్డ్ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



### మహానాడుపై డాక్టర్ ముక్కుతో చర్చ

ఈ నెల 27, 28 తేదీలలో నిర్వహించనున్న వర్చువల్ మహానాడు కార్యక్రమం సందర్భంగా క్లస్టర్ ఇన్‌చార్జులు, మండల పార్టీ అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ బలోపేతం కేడర్ సమన్వయంపై నాయకులతో చర్చించారు.





ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



నెల్లూరు రూరల్ (చైతన్యరథం): “ప్రజా దర్బార్‌ను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే మా ప్రధాన లక్ష్యం” అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ‘ప్రజాదర్బార్’లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ద్వారా నియోజకవర్గ ప్రజలకు నిరంతరం సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు కార్యాలయం తెరిచే ఉంటుందని, ప్రజలకు అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేకంగా ‘ప్రజా దర్బార్’ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత భవిష్యత్తును మార్చడంపై యువ నేత, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారని గిరిధర్ రెడ్డి కొనియాడారు. కేవలం 23 నెలల కాలంలోనే రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు 657 కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు. తద్వారా భవిష్యత్తులో యువతకు భారీగా ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాదర్బార్‌లో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నెల్లూరు మురళి, వాణిజ్య విభాగం నెల్లూరు రూరల్ అధ్యక్షుడు బిల్లుపాటి రవి, ఏఎంసీ డైరెక్టర్ భీమతాటి సుధాకర్, వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యుడు సింహాద్రి నాయుడు, టీడీపీ నాయకులు ఎంసీ సుబ్రహ్మణ్యం, పట్నం అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

## గూడూరి ఎరిక్సన్ బాబు

యర్రగొండపాలెం (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్సన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం మండలంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించగా, వాటిని స్వయంగా పరిశీలించిన ఎరిక్సన్ బాబు గారు తక్షణమే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించి, కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వినతులపై కూడా వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని అధికారులను సూచించారు. ప్రతి వినతి పత్రాన్ని ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ూావీజ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళ రెడ్డి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ పల్లెవనం పార్కు అభివృద్ధే నా లక్ష్యం

## దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శి (చైతన్యరథం): పట్టణంలోని పల్లెవనం పార్కును శుక్రవారం సాయంత్రం దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ సందర్శించి పార్కులో వాకింగ్ చేశారు. పార్కు అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. వాకర్స్ ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్నారు. ముఖ్యంగా మహిళలకు వాకింగ్ సమయంలో ఇబ్బంది లేకుండా ఎలక్ట్రికల్ లైట్లు ఏర్పాటు జరిగిందన్నారు. పల్లె వనం పార్క్‌లో అగ్ని ప్రమాదాలపై డాక్టర్ లక్ష్మీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆకతాయిలు ఆగడాలను అడ్డుకోవాలని, మొక్కలను అగ్నికి ఆహుతి చేస్తున్నారని ఆమె అసహనం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత పోలీస్, మున్సిపల్ శాఖలు దీనిపై సీరియస్‌గా తీసుకొని విచారించాలని ఆదేశించారు.

వాకర్స్ కు ఇబ్బంది లేకుండా ఉండేందుకు వాటర్ కూలర్లు కూడా ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఇక ప్రతి వారం తాను కూడా వాకింగ్‌కి వస్తానని మీతో పాటు పార్కు అభివృద్ధి అవసరాలు గుర్తించి తన వంతు కృషి చేస్తానని అధికారులు కూడా ఎప్పటికప్పుడు పార్కులో వసతులు పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ, సీఐ రామారావు, ఎస్సై మురళి, దర్శి మున్సిపల్ కమిషనర్ అర్జున్ రావు, దర్శి సొసైటీ అధ్యక్షులు కలువకొలను చంద్ర శేఖర్, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఒంగోలు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షులు కాట్రాజ్ నాగరాజు, దర్శి నియోజకవర్గంలోని మండల టీడీపీ అధ్యక్షులు, మారెళ్ల వెంకటేశ్వర్లు, పిడతల నెమిలయ్య, మోడీ ఆంజనేయులు, మేడగం వెంకటేశ్వర రెడ్డి, కూరపాటి శ్రీను, దర్శి పట్టణ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ, వార్డ్ కౌన్సిలర్లు, వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



రాచర్ల మండలం రాచర్ల గ్రామానికి చెందిన తలపాటి లింగయ్యకు ఆపరేషన్ నిమిత్తం ప్రభుత్వం ద్వారా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి 1,04,000 (ఒక లక్ష నాలుగు వేల రూపాయలు) ఎల్‌ఓసీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వారి కుటుంబ సభ్యులు తలపాటి రాజు, మాదరి మనోహర్ కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట రాచర్ల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వర్చువల్‌గా మహానాడును విజయవంతం చేద్దాం

## రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు



రాప్తాడు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడును పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. పొదుపు చర్యల్లో భాగంగా తొలిసారిగా వర్చువల్ విధానంలో మహానాడు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మహానాడుకు సంబంధించి అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్చార్జిలు, ప్రధాన కార్యదర్శులు, కో క్లస్టర్ ఇన్చార్జిలు, పార్లమెంట్ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పార్టీలో పొదుపు చర్యలను అమలు చేయాలనే ఉద్దేశంతో.. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో మహానాడు నిర్వహించాలన్న నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ పసుపు పండుగను సరికొత్త సాంకేతికతతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 27, 28 తేదీలలో రెండు రోజుల పాటు ఈ డిజిటల్ మహానాడు వేడుకలు జరుగుతున్నాయని, పార్టీ కేంద్ర కార్యాలయం 'ఎన్టీఆర్ భవన్' లో కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్టీఆర్ భవన్ నుంచే ప్రత్యేక స్టేజిని ఏర్పాటు చేసి మహానాడు ఆన్‌లైన్ కార్యక్రమాలను పార్టీ తీర్మానాలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో క్లస్టర్ల వారీగా ప్రత్యక్ష ప్రసారం చేస్తారన్నారు. ఈ వేడుకల్లో కేడర్, క్షేత్రస్థాయి నాయకులు పాల్గొనే విధంగా అధిష్టానం ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, ప్రతి క్లస్టర్ పరిధిలో ఉన్నవారంతా ఈ వేడుకల్లో పాల్గొనేలా నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. ఇందులో ప్రధానంగా తాగునీరు, రోడ్లు, భూ సమస్యలు, విద్యుత్, పాఠశాలలో అడ్మిషన్లు వంటి అంశాలపై అర్జీలు ఇచ్చారు. ప్రజలతో ఎమ్మెల్యే సునీత ఓపికగా మాట్లాడుతూ వారి సమస్యలు విన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.



కొత్తచెరువు మండల కేంద్రంలోని నాగులకట్ట సమీపంలో బుక్కపట్నం చెరువులో రూ.136 కోట్లతో మంజూరైన సమగ్ర తాగునీటి పథకం శంకుస్థాపన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో కలిసి పాల్గొన్న పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, అధికారులు కూటమి నాయకులు

# ప్రమాదకర డ్రైన్ సమస్యకు శాశ్వత పరిష్కారం

నెల్లూరు (చైతన్యరథం): చిన్నారి ఘటనతో వెంటనే డాక్టర్ గణేష్ కుమార్ బృందం ప్రమాదకర డ్రైన్ సమస్య శాశ్వత పరిష్కారానికి పూనుకుంది. సమస్యను వెంటనే మంత్రి పొంగూరు నారాయణ సార్ దృష్టికి తీసుకెళ్ళారు. ప్రమాదకర డ్రైన్స్‌పై అత్యవసరంగా కాంక్రీట్ స్లాబ్స్ ఏర్పాటు చేశారు. ఓపెన్ డ్రైన్స్, ఓపెన్ రింగ్స్ పూర్తిగా మూసివేశారు. అధికారులతో సమన్వయం చేస్తూ పనులు వేగంగా పూర్తి చేశారు. ప్రజా భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమస్య చెప్పగానే వెంటనే స్పందించారంటూ స్థానికుల ప్రశంసలు కురిపించారు. మంత్రి పొంగూరు నారాయణ, ధర్మవరం సుబ్బారావు, డాక్టర్ గణేష్ కుమార్ టీంకు స్థానికుల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు మదనంబేటి మునిశేఖర్, నెల్లూరు నగర మైనారిటీ సెల్ సెక్రటరీ మహబాషు, బూత్ ఇంచార్జులు కంచి కృష్ణ, నీలకంఠం మునికృష్ణ, కల్వకుంట గౌరీశంకర్, కార్తిక్, షేక్ ఫయాజ్, విజయమ్మ, వర్క్ ఇన్స్పెక్టర్ సాయి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# భూ తగాదాల్లేని రాష్ట్ర సాధనే సీఎం చంద్రబాబు లక్ష్యం

## పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి




పుట్టపర్తి (చైతన్యరథం): రాష్ట్రాన్ని భూ తగాదాలు లేని ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమని, ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మంత్రి మౌర్య భరద్వాజ్ ,ఆర్డీఓ సువర్ణ ,డీఈవో కిష్టప్ప, జిల్లా ప్రభుత్వ అధికారులు డివిజన్ స్థాయి అధికారులు తహసీల్దార్లు ఎంపీడీవోలు ఇతర శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సుమారు 139 మంది ప్రజలు వివిధ సమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన మొత్తం 139 అర్జీలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు ఇచ్చి వాటికి తక్షణం పరిష్కారం చూపాలని ఆదేశించారు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ,జాయింట్ కలెక్టర్ మంత్రి మౌర్య భరద్వాజ్, ఆర్డీఓ సువర్ణ , డీఈవో క్రిష్టప్ప ఆర్డబ్ల్యూఎస్ డీఈ గంగాధర్ , ఇతర శాఖల అధికారులు పాల్గొని ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు కొత్తచెరువు మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్, మండల టీడీపీ కన్వీనర్ మైలే శంకర్, టీడీపీ నాయకులు కేశవరెడ్డి రమణ, వెంకటనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, ప్రభుత్వ శాఖల అధికారులు తహసీల్దార్లు మనోజ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, మారుతి ప్రసాద్, రామాంజనేయులు కళ్యాణ్, ఎంపీడీవోలు ఈఓఆర్డీలు , డ్వామా, డీఆర్డీఏ వెలుగు , విద్యుత్ వ్యవసాయ శాఖ, ఇతర శాఖల అధికారులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# వంద స్మశాన వాటిక పనులు వెంటనే పూర్తికావాలి

## వివిధ శాఖల అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆదేశం




మడకశిర (చైతన్యరథం): మడకశిర నియోజకవర్గంలో వివిధ వర్గాలకు అందించేందుకు నిర్దేశించబడిన 100 శ్మశానవాటికల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నియోజకవర్గ తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఉపాధిహామీ ఏపీఓలు సంబంధిత అధికారులకు స్థానిక శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యుడు శ్రీసత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు ఆదేశాలు జారీ చేశారు. మడకశిర క్యాంపు కార్యాలయంలో మండలస్థాయిలోని వివిధ శాఖల అధికారులతో ఎం.ఎస్.రాజు సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ సమస్యలపై అధికారులను ఆరా తీశారు. నియోజకవర్గవ్యాప్తంగా 100 శ్మశానవాటికలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, జంగిల్ క్లియరెన్స్ చేయాలని, త్వరితగతిన వాటిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులకు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఆదేశించారు. ప్రజలు ఎవరూ తాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిదేనని సూచించారు. ఎప్పటికప్పుడు మండలస్థాయిలో సమీక్షలు నిర్వహించుకుని, గ్రామాల్లో తాగునీటి పరిస్థితులపై ఆరా తీయాలని ఎక్కడ ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

హంద్రీనీవా సుజల స్రవంతి(హెచ్.ఎన్.ఎస్.ఎస్.) అధికారులతో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సమీక్ష నిర్వహించారు. మడకశిర బైపాస్ బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తి, కాలువల పూడికతీత, రోళ్ల, ఆగళి మండలాల్లో పెండింగ్ పనులపై ఆరా తీశారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు. మడకశిర నియోజకవర్గానికి హెచ్.ఎన్.ఎస్.ఎస్. ద్వారా సమృద్ధిగా నీరు రావాలని, మడకశిర ప్రజల కల నెరవేరేలా అధికారులు చొరవతో పనిచేయాలని ఆదేశించారు.

# టీడీపీకి మాసినేని సేవలు మరువలేనివి

## జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం (చైతన్యరథం): జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాసినేని గ్రాండ్ హోటల్ యజమాని మాసినేని రామయ్యమృతి పట్ల అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పార్థివ దేహానికి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, టీడీపీ నాయకులతో కలిసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ అంటే ఎంతో అభిమానించే రామయ్య పార్టీకి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. రామయ్య ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు పూల నాగరాజు తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప, ఏపీ రాష్ట్ర కార్యదర్శి సిమెంట్ పోలన్న , మాజీ రాష్ట్ర కార్యదర్శులు ఆలం నరసానాయుడు, రాయల్ మురళి , పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు పెరువల్లి కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.



# మస్కట్‌లో వేడుకగా 'మహానాడు'

## ఎన్ఆర్ఐ టీడీపీ ఒమన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళులు... రక్తదాన శిబిరం విజయవంతం



**మస్కట్ (ఒమన్):** తెలుగు వారి ఆత్మగౌరవానికి, అభ్యున్నతికి నిలువెత్తు ప్రతీకగా నిలిచిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు స్ఫూర్తితో ఒమన్ రాజధాని మస్కట్‌లో 'మహానాడు' అత్యంత వైభవంగా జరిగింది. ఎన్ఆర్ఐ టీడీపీ ఒమన్ ఆధ్వర్యంలో అల్‌ఖువైర్‌లోని ఇండిస్పేస్ వేదికగా శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పసుపు పండుగను టీడీపీ అభిమానులు, ప్రవాసాంధ్రులు వేడుకగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు, మానవ సేవే మాధవ సేవ అనే తెలుగుదేశం పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. టీడీపీ అభిమానులు, తెలుగు యువత రక్తదానం చేశారు. మహానాడు ఉత్సవంతో పాటు రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన వారందరికీ ఎన్ఆర్ఐ టీడీపీ ఒమన్ నేత సత్య శ్రీధర్, కార్యవర్గ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.








## శాన్ ఆంటోనియోలో రేపు అన్నమాచార్య జయంతి ఉత్సవాలు

**టెక్సాస్:** అమెరికాలోని టెక్సాస్‌లో శ్రీఅన్నమాచార్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శాన్ ఆంటోనియో తెలుగు సంఘం (TASA), హిందూ టెంపుల్ ఆఫ్ శాన్ ఆంటోనియో (HTSA) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జయంతి జరుపుతారు.

వేదిక: హెలోటెస్ (Helotes, TX)లోని మహాలక్ష్మి హాల్ (MahaLakshmi Hall) ప్రముఖ వైద్యులు హిమబిందు & రాజశేఖర్ బొర్రా ఈవెంట్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచే ఆలయ ప్రాంగణంలో వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.

ఉదయం 8.30-9.00: ఆలయం నుంచి మహాలక్ష్మి హాల్ వరకు ఘనంగా ఊరేగింపు

ఉదయం 9.00-9.30: సప్తగిరి సంకీర్తనల ఆలపన.

ఉదయం 9.30-మధ్యాహ్నం 1.30: అన్నమాచార్య ఆరాధనతో పాటు సంకీర్తనలు, నాట్య సేవ

మధ్యాహ్నం 1:30 తర్వాత: భక్తులకు లంచ్ (మహా ప్రసాదం) పంపిణీ

ఈ వేడుక ఏర్పాట్లను టాసా (TASA) కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. మరిన్ని వివరాలకు కింది ప్రతినిధులను సంప్రదించవచ్చు.

ఆదినారాయణ (ప్రెసిడెంట్)-919-916-0919

నీరజ సుంకర (ప్రెసిడెంట్ ఎలెక్ట్)-210-827-1881

మూర్తి పటమల్ల (ఛైర్మన్)-210-262-1245

ప్రసాద్ తూర్లపాటి (ఛైర్-ఎలెక్ట్)-281-546-7374

ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో ప్రవాసాంధ్రులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహక బృందం కోరింది.

# అమెరికాలో తెలుగు భాషా వైభవం

## ఘనంగా 'తెలుగు బడి' గ్రాడ్యుయేషన్ సంబరాలు... 62 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

**నెబ్రాస్కా:** నెబ్రాస్కా తెలుగు సమితి, 'తానా పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు బడి వార్షికోత్సవం, గ్రాడ్యుయేషన్ వేడుకలు ఆనందోత్సాహాల నడుమ జరిగాయి. విదేశీ నేలపై తెలుగు భాషా పరిరక్షణకు అంకితభావంతో కొనసాగుతున్న తెలుగు బడి మరో విజయవంతమైన విద్యా సంవత్సరాన్ని పూర్తి చేసుకుంది.

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫైనల్ పరీక్షలను విద్యార్థులు విజయవంతంగా పూర్తి చేయగా మొత్తం 62 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యార్థులను చప్పట్లతో అభినందించారు. చిన్నారుల ఆనందం, తల్లిదండ్రుల గర్వం, ఉపాధ్యాయుల సంతృప్తి కలిసి సభను భావోద్వేగభరితంగా మార్చాయి.

తెలుగు సమితి ప్రస్తుత అధ్యక్షుడు కొల్లి ప్రసాద్ మాట్లాడుతూ Telugu Samiti of Nebraska తరపున TANA Paatasalaతో జరిగిన అద్భుతమైన సహకారానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభం నుంచి ముగింపు వరకు సాగిన ఈ ప్రయాణం రెండు సంస్థల మధ్య నమ్మకాన్ని, అనుబంధాన్ని మరింత బలోపేతం చేసిందన్నారు. ఈ సహకార బంధాన్ని నిర్మించడంలో దూరదృష్టి, ప్రేరణతో ముందుండిన రాజా కసుకుర్తికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో విశేష సహకారం అందించిన భాను, శేఖర్‌లకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

కొల్లి ప్రసాద్ మాట్లాడుతూ... పిల్లలు ఇంట్లో తల్లిదండ్రులతో పాటు ముఖ్యంగా తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలతో తప్పకుండా తెలుగులో మాట్లాడాలని సూచించారు. మన భాషే మన సంస్కృతి, సంప్రదాయాలు, మూలాలకు ప్రతిబింబమని, తెలుగు మాట్లాడటం ద్వారా పిల్లలు తమ వారసత్వానికి మరింత



దగ్గరవుతారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో ప్రధానోపాధ్యాయుడు వేణు మురకొండ విశేష కృషి చేశారు. మొత్తం కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు.

విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను శ్వేత బొడెపూడి, పావులూరి సత్యనారాయణ, నవీన్ కంటెం, నాగరాజు ముద్దెల్లి అందజేశారు. తెలుగు భాషను ఆసక్తిగా నేర్చుకుని ధైర్యంగా మాట్లాడాలని ప్రోత్సహించారు.

తెలుగు బడి ఉపాధ్యాయులు రాజా, ఉమా, పవిత్ర, దివ్య, సుధీర్, స్వప్న, వీణామాధురి, సువర్ణరేఖ, మౌనిక, సుహిత, తనూజ విద్యార్థులకు తెలుగు భాషను ప్రేమగా బోధిస్తూ వారిలో భాషపై ఆసక్తి పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషించారు. వారి అంకితభావం, సహనం, కృషిని తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

సర్టిఫికెట్లను అందుకుంటున్న సమయంలో ఉపాధ్యాయులు భావోద్వేగానికి లోనయ్యారు. తెలుగు బడి కేవలం భాషను నేర్పించే వేదిక మాత్రమే కాకుండా పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ విలువలను చేరవేసే ఒక అందమైన కుటుంబమన్నారు. పిల్లలు తెలుగు భాష నేర్చుకుని తమ మూలాలతో మరింత దగ్గరవ్వాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు.

ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ... విదేశాల్లో పెరుగుతున్న తమ పిల్లలు తెలుగు మాట్లాడటం ఎంతో ఆనందంగా ఉందని, తెలుగు బడి చేస్తున్న సేవలు అమూల్యమని కొనియాడారు. సర్టిఫికెట్ల పంపిణీ అనంతరం పిల్లల కోసం ఫేస్ పెయింటింగ్, సరదా ఆటలు, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్వేత వాలంటీర్‌గా ముందుకొచ్చి పిల్లలందరికీ ఫేస్ పెయింటింగ్ చేస్తూ వారు ఎంతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొనేలా చేశారు. దివ్య, పవిత్ర, మౌనిక నిర్వహించిన ఆటల పోటీలు చిన్నారులను ఎంతో ఆకట్టుకున్నాయి. పిల్లలు ఆటల్లో పాల్గొంటూ ఆనందంగా గడపడం అందరినీ అలరించింది.

పిల్లల కోసం పిజ్జా, స్నాక్స్, ఇతర అల్పాహారాలను నెబ్రాస్కా తెలుగు సమితి సభ్యులు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. చిన్నారుల నవ్వులు, ఉత్సాహం, సందడి కార్యక్రమానికి మరింత అందాన్ని తీసుకొచ్చాయి.

తెలుగు బడి ప్రిన్సిపాల్ వేణు మురకొండ, ఆయన ముఖ్య బృందం కార్యక్రమాన్ని ప్రారంభం నుంచి ముగింపు వరకు అత్యంత సమర్థవంతంగా ప్రణాళిక చేసి అద్భుతంగా నిర్వహించారు. వారి అంకితభావం, నిరంతర శ్రమ, నాయకత్వం, నిజాయితీ గల కృషి లేకపోతే ఈ కార్యక్రమం ఇంత గొప్ప విజయాన్ని సాధించేది కాదన్నారు. వారి సేవలు నిజంగా అభినందనీయమైనవన్నారు.

ఈ వార్షికోత్సవం కేవలం ఒక విద్యా కార్యక్రమం మాత్రమే కాకుండా తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు ప్రతీకగా నిలిచింది. విదేశీ నేలపై పెరుగుతున్న పిల్లల్లో తెలుగు పట్ల ప్రేమ, గౌరవం, అనుబంధం పెంపొందిస్తూ, భవిష్యత్ తరాలకు మన భాషా వారసత్వాన్ని అందించే గొప్ప వేదికగా తెలుగు బడి నిలుస్తోంది.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన ఉపాధ్యాయులు, వాలంటీర్లు, తల్లిదండ్రులు, ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మన తెలుగు భాష గొప్పతనం ప్రపంచవ్యాప్తంగా విరాజిల్లాలని, భవిష్యత్ తరాలకు తెలుగు వెలుగు ఇలాగే అందాలని అందరూ ఆకాంక్షించారు.











# సరిహద్దు చొరబాట్లపై ఉక్కుపాదం: అమిత్‌షా



సరిహద్దు చొరబాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హెచ్చరించారు. ఇందుకోసం జీరో టాలరెన్స్ పాలసీని అనుసరించనున్నామనీ, దేశ సరిహద్దులను మూసివేసేందుకు ఏడాదిలోగా సమగ్ర 'స్మార్ట్ బోర్డర్' పాలసీని తీసుకురానున్నామని చెప్పారు. అక్రమ వలసదారులను వెనక్కి తిప్పిపంపుతామని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారంనాడు జరిగిన సరిహద్దు భద్రతా దళం (బీఎస్‌ఎఫ్) సిబ్బంది సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ, అక్రమ వలసలను కృత్రిమంగా దేశ జనాభాలో మార్పు తెచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. దేశ డెమోగ్రాఫిక్స్‌ను సురక్షితంగా ఉంచేందుకు అక్రమ వలసదారులను ప్రభుత్వం గుర్తించి ప్రతి ఒక్కరిని వెనక్కి పంపిస్తుందని స్పష్టం చేశారు. ఇందుకోసం దేశంలోని 6,000 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి అభేద్యమైన భద్రతా గ్రిడ్‌ను అమలు చేస్తుందని చెప్పారు. స్మార్ట్ బోర్టర్ కాన్సెప్ట్ కింద రాడార్లు, అడ్వాన్స్‌డ్ కెమెరాలతో బీఎస్‌ఎఫ్‌ను అధునాతన టెక్నాలజీతో సన్నద్ధం చేస్తామని వివరించారు. బీఎస్‌ఎఫ్ నేరుగా రాష్ట్ర పోలీసులు, జిల్లా కలెక్టర్లు, విలేజ్ పట్వారీల సమన్వయంతో ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవాలని, అక్రమ చొరబాటుదారులను, పశువుల అక్రమ రవాణా మార్గాలను గురించాలని అమిత్‌షా సూచించారు. పశ్చిమబెంగాల్, అస్సాం, త్రిపుర రాష్ట్రాలను కలుపుకుని కలుపుతూ సెక్యూరిటీ గ్రిడ్ ఏర్పాటు జరుగుతుందని, మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో హోం శాఖ త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. వామపక్ష తీవ్రవాదం నిర్మూలనపై మాట్లాడుతూ, సమస్యను కంట్రోల్ చేయడం కేవలం భద్రతగా చూడరాదని, ఈ బెడదను సమూలంగా పెకిలించాల్సిందేనని అన్నారు. వాపక్ష తీవ్రవాదం ఎలా నిర్మూలించామో అదే రీతిలో చొరబాటుదారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఫ్రంట్‌లైన్ జవాన్లకు సహకరించేందుకు ఉన్నతస్థాయి డెమోగ్రఫీ మిషన్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్టు అమిత్‌షా ప్రకటించారు. దేశభద్రతకు బీఎస్‌ఎఫ్ అందిస్తున్న సేలను అమిత్‌షా ప్రశంసించారు. 1965లో బీఎస్‌ఎఫ్‌ను కేవలం 25 బెటాలియన్లతో ప్రారంభించగా ఇప్పుడది 2,70,000 మందితో పటిష్టమైన దళంగా ఏర్పడిందని, ప్రపంచంలోనే అతిపెద్ద సరిహద్దు రక్షణ దళంగా నిలిచిందని అన్నారు. సరిహద్దుల పటిష్టత విషయంలో బీఎస్‌ఎఫ్ ఎప్పుడూ వెనుకంజ వేయలేదన్నారు. ఎలాంటి సవాళ్లు ఎదురైనా శత్రువును చిత్తుచేస్తూ వచ్చారని, దేశం ఎప్పుడూ తలవంచుకునే పరిస్థితి రాలేదని అన్నారు.

## దేవాలయాలపై ప్రభుత్వాల నియంత్రణ

### చట్టాలపై విచారణకు సుప్రీం కోర్టు గ్రీన్‌సిగ్నల్



తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరిలో హిందూ దేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణ చట్టాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టును ఆశ్రయించాలంటూ ఏప్రిల్ 2025న ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు వెనక్కి తీసుకుంది. దేవాలయాలపై ప్రభుత్వాల నియంత్రణ చట్టాలపై విచారణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దక్షిణ భారతదేశంలోని హిందూ దేవాలయాలను ప్రభుత్వాలు తమ అధీనంలో ఉంచుకోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన కీలక పిటిషన్ల విచారణకు సుప్రీంకోర్టు శుక్రవారం నాడు అంగీకరించింది. కేసును హైకోర్టులకు బదిలీ చేస్తూ గతంలో ఇచ్చిన పాత ఆదేశాలను జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీశ్ శర్మతో కూడిన ధర్మాసనం రద్దు చేసింది. చట్టాల చెల్లుబాటుపై జూలై 24 నుంచి మెరిట్స్ ఆధారంగా తామే తుది విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టంచేసింది. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరిలో హిందూ ధార్మక సంస్థల నియంత్రణ చట్టాలను పిటిషన్లరు సవాలు చేశారు. కేవలం హిందూ ఆలయాలనే నియంత్రించడం రాజ్యాంగం కల్పించిన మతస్వేచ్ఛ, సమానత్వ హక్కులకు విరుద్ధమని తమ పిటిషన్‌లో స్వామి దయానంద సరస్వతి ట్రస్ట్ పేర్కొంది. ఆలయాల హుండీ ఆదాయం, మిగులు నిధులను ప్రభుత్వాలు ఇతర కార్యకలాపాలకు మళ్లించడంపై పలువురు పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. సామాజిక సమానత్వం, నిధుల అవినీతిని అరికట్టేందుకే ఆలయాల నిర్వహణలో ప్రభుత్వాలు జోక్యం చేసుకుంటున్నాయని రాష్ట్రాలు వాదన వినిపించాయి. ఈ నేపథ్యంలో ఈ అశంపై హైకోర్టును ఆశ్రయించాలంటూ గతంలో ఆదేశించిన సుప్రీంకోర్టు తాజాగా తామే స్వయంగా విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. కాగా, సుప్రీంకోర్టు నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఏకీభవించారు. వేర్వేరు హైకోర్టుల కంటే సుప్రీంకోర్టు తేల్చడమే సముచితమని పేర్కొన్నారు.

## సీబీఎస్‌ఈలో మూడు భాషల విధానంపై పిటిషన్

### విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు




సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తొమ్మిదో తరగతి విద్యార్థులకు మూడు భాషల బోధనను తప్పనిసరి చేస్తూ తీసుకువచ్చిన నూతన విద్యా విధానం ఇప్పుడు న్యాయ వివాదానికి దారితీసింది. బోర్డు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల తరఫున దాఖలైన ఈ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ప్రస్తావించారు. విద్యా సంవత్సరం మధ్యలో అకస్మాత్తుగా తొమ్మిదో తరగతి నుంచి మూడు భాషలను తప్పనిసరి చేయడం వల్ల విద్యార్థులపై తీవ్రమైన మానసిక, విద్యాపరమైన భారం పడుతుందని రోహత్గి కోర్టుకు వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానానికి ఇది పూర్తిగా భిన్నంగా ఉందని, దీనివల్ల అటు విద్యార్థుల్లో, ఇటు విద్యాసంస్థల్లో తీవ్ర గందరగోళం నెలకొందని ఆయన పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై త్వరితగతిన విచారణ జరపాలని ఆయన ధర్మాసనాన్ని అభ్యర్థించారు. జాతీయ విద్యా విధానం సిఫార్సుల మేరకు సీబీఎస్‌ఈ విద్యా చట్రంలో మార్పులు చేస్తూ, 9, 10 తరగతుల్లో విద్యార్థులు కచ్చితంగా మూడు భాషలను (అందులో రెండు భారతీయ భాషలు అయి ఉండాలి) చదవాలనే నిబంధనను తీసుకువచ్చింది. ఈ వాదనలను పరిశీలించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం, ఈ పిటిషన్‌పై వచ్చే వారం సమగ్ర విచారణ జరిపేందుకు అంగీకారం తెలిపింది.

## పహల్గామ్ ఉగ్రదాడిలో పాకిస్తాన్ కుట్ర

### సీబీఐ ఛార్జ్‌షీట్‌లో సంచలనాలు

గత ఏడాది ఏప్రిల్ 22వ తేదీన జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిపై నేషనల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ఎన్ఐఏ) దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎన్ఐఏ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లోని వివరాల మేరకు.. 26 మందిని చంపడానికి ముందు ముగ్గురు ఉగ్రవాదులు చెట్టు కింద భోజనం చేశారు. తర్వాత పైన్ చెట్ల మధ్య నుంచి బయటకు వచ్చి.. మధ్యాహ్నం 2.23 గంటలకు పర్యాటకులపై కాల్పులకు తెగబడ్డారు. 25 మంది పర్యాటకులతో పాటు ఓ స్థానికుడిని చంపేశారు. అధికారులు పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులను ఫైజల్ జట్, హబీబ్ తహిర్, హమ్జా అఫ్ఘానీలుగా గుర్తించారు. ఈ ఉగ్రదాడికి పాకిస్థాన్ నుంచే కుట్ర జరిగినట్లు ఎన్ఐఏ తేల్చింది. పహల్గామ్ ఉగ్రదాడి కోసం ప్లానింగ్, ఆర్థిక సాయం అందించటం, ప్లాన్‌ను అమలు చేయటంలో హాఫీజ్ సయీద్ నేతృత్వంలోని లష్కర్ ఈ తోయిబా (ఎల్ఈటీ), హబీబుల్లా మాలిక్ నేతృత్వంలోని ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) పాత్ర ఉన్నట్లు పేర్కొంది. దాడికి ఒకరోజు ముందు.. అంటే ఏప్రిల్ 21వ తేదీన ముగ్గురు ఉగ్రవాదులు బైసరన్‌లోని స్థానికుడి ఇంటికి వెళ్లారు. ఆ స్థానికుడిని పర్వీజ్ అహ్మద్‌గా అధికారులు గుర్తించారు. పర్వీజ్ అహ్మద్ అధికారులతో ఏం చెప్పాడంటే.. 'సాయంత్రం 5 గంటల ప్రాంతంలో నేను నా భార్య, కొడుకుతో గుడిసెలో కూర్చుని ఉన్నాను. ఆ సమయంలో ముగ్గురు అక్కడికి వచ్చారు. గుడిసె బయట ఉన్న నా మేనమామ బషీర్ అహ్మద్ జోతర్ లోపలికి వచ్చాడు. మమ్మల్ని నిశబ్దంగా ఉండమన్నాడు. కొద్దిసేపటి తర్వాత బయటకు వెళ్లాడు. చేతుల్లో గన్నులు ఉన్న ముగ్గురు ఉగ్రవాదులను లోపలికి తీసుకువచ్చాడు. వారు లోపలికి వచ్చి కూర్చున్నారు. తాగడానికి నీళ్లు అడిగారు. నీళ్లు ఇచ్చాను'.. 'వారికి నీళ్లు ఇచ్చినందుకు అల్లా నాకు మంచి చేస్తాడని చెప్పారు. వారి భాషను బట్టి వారు కశ్మీరీ వ్యక్తులు కాదని గుర్తించాను. వారు తమ బ్యాగులు దాచమన్నారు. నేను దాచాను. వాళ్లు తాగడానికి టీ చేయమని నా భార్యను పురమాయించాను. వారు మా దగ్గరే రాత్రి భోజనం కూడా చేశారు. కొన్ని రొట్టెలు ప్యాక్ చేసుకున్నారు. పది గంటల సమయంలో అక్కడినుంచి వెళ్లిపోయారు' అని చెప్పాడు. ఉగ్రవాదులకు సాయం చేసినందుకు ఫర్వీజ్‌తో పాటు అతడి మేనమామ బషీర్‌లను జూన్ 22వ తేదీన అరెస్ట్ చేశారు.



## 'కాక్రోచ్ జనతా పార్టీ' విదేశీ శక్తుల కుట్ర

### అశాంతిని సృష్టించే వ్యూహంపై నిఘా విభాగాల దర్యాప్తు

సోషల్ మీడియాను షేక్ చేస్తున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' విదేశీ శక్తుల కుట్రంటూ భారత భద్రతా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దేశంలో నిరుద్యోగ యువత అసంతృప్తిని ఆసరాగా చేసుకుని అశాంతిని సృష్టించేందుకు వ్యూహం పన్నారనే కోణంలో ఇంటెలిజెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. సోషల్ మీడియాలో అతి తక్కువ సమయంలో మిలియన్ల కొద్దీ ఫాలోవర్స్ రావడంపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక విదేశీ శక్తుల ప్రమేయం ఉందేమోనని భావిస్తూ ఆరా తీస్తున్నారు. న్యాయవ్యవస్థపై ఆర్టీఐ యాక్టివిస్టుల తీరును తప్పుబడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వారిని బొద్దింకలతో పోల్చుతూ సీజేఐ ఘాటుగా స్పందించారు. సీజేఐ సూర్యకాంత్ తీరుకు నిరసనగా సోషల్ మీడియాలో కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో వ్యంగ్యాత్మక ఉద్యమం పుట్టుకొచ్చింది. కేవలం 5 రోజుల్లోనే సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ పేజీని 1.5 కోట్ల ఫాలోవర్సు దాటేశారు. అధికార బీజేపీ ఫాలోయింగ్‌నీ సీజేపీ దాటేయడం చర్చనీయాంశమైంది. నిరుద్యోగం, నీట్ పేపర్ లీకేజీలు, ఆర్థిక ఇబ్బందులపై జెన్ జీ యువత డిజిటల్ ప్లాట్ ఫామ్స్ వేదికగా ఉద్యమానికి దిగారు. అయితే, ఒకే తరహా హ్యాష్‌ట్యాగ్‌లు, ఏఐ, సింక్రనైజ్డ్ పోస్టుల వెనుక డీప్ స్టేట్ ఐటీ సెల్స్ హస్తం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ మేరకు భద్రతా కారణాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో భారతదేశంలో సీజేపీ అధికారిక ఎక్స్ ఖాతాను నిలిపివేశారు. అయితే, యువత వ్యంగ్య నిరసనను అణచివేయడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అందుకే 'దేశ వ్యతిరేక' ముద్ర వేస్తూ అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ప్రతిపక్ష నేతలు, విమర్శకులు మండిపడుతున్నారు.




## చివరి వ్యక్తికి అందని రిజర్వేషన్ల ఫలాలు : సుప్రీం



దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకు?' అని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' (ధనిక, ఉన్నత శ్రేణి) పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉంది' అని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చుని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్ని' (మండల్ కమిషన్) కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక, ఈ కేసులో సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వానికి, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# మస్క్‌ను ట్రాప్ చేశారా!




మస్క్‌ను చైనా ట్రాప్ చేసిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా వ్యాపారిపై డ్రాగన్ దేశం నిఘా పెట్టినట్లు రూమర్స్ వస్తున్నాయి. ఇటీవల బీజింగ్‌లో ఓ విందులో పాల్గొన్న సమయంలో.. మస్క్ చుట్టూ ఓ అమ్మాయి తిరిగింది. అయితే ఆమె వెయిట్రెస్ కాదు.. ఆ దేశ లేడీ మేజర్ జనరల్ అని ఓ బ్లాగర్ పేర్కొన్నారు.

### ఆమె వెయిట్రెస్ కాదు.. చైనీస్ జనరల్..

బీజింగ్: ట్రంప్ నేతృత్వంలోని అమెరికా బృందం కొన్ని రోజుల క్రితం చైనాలో పర్యటించిన విషయం తెలిసిందే. అయితే అమెరికా రాజకీయ, వ్యాపారవేత్తలకు బీజింగ్‌లో భారీ విందు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఓ అమ్మాయి ఎరుపు రంగు దుస్తుల్లో వెయిట్రెస్‌గా కనిపించారు. ఆమె కాసేపు మస్క్ వద్ద అటూ ఇటూ తిరిగింది. ఆ తర్వాత ఓ దశలో ఫొటో కూడా దిగింది. అయితే ఆ అమ్మాయి గురించి ఇప్పుడు చైనాకు చెందిన ఇండిపెండెంట్ బ్లాగర్ జెన్నిఫర్ జెంగ్ ఓ సంచలన విషయాన్ని చెప్పారు. అమెరికా బృందంపై చైనా నిఘా పెట్టినట్లు జెంగ్ ఆరోపించారు.

సర్వర్‌గా ఎలన్ మస్క్ సమీపంలో నిలబడ్డ ఆ అమ్మాయి వెయిట్రెస్ కాదు అని, ఆమె చైనా మిలిటరీకి చెందిన లేడీ జనరల్ అని జెంగ్ తన బ్లాగ్‌లో ఆరోపించారు. తన సోషల్ మీడియాలో జెంగ్ ఆ వెయిట్రెస్ గురించి పోస్టులు పెట్టారు. మేజర్ చెంగ్ చెంగ్ అనే మహిళ మస్క్ వద్ద నిలుచుకున్నట్టు ఆ బ్లాగ్‌లో పేర్కొన్నారు. చైనా మిలిటరీ కార్యక్రమాలకు చెందిన ఆపరేషనల్ మాన్యువల్స్ ఆమె రాస్తారట. ఆ దేశ ఎలైట్ బెటాలియన్ కమాండర్ ఆమె అని తెలిపారు. మస్క్ వద్ద నిలబడ్డ ఆ వెయిట్రెస్ వేసుకున్న ఎరుపు రంగు దస్తుల వెనుక గన్ ఉండి ఉంటుందేమో అని ఆమె పేర్కొన్నారు.

బ్లాగర్ జెంగ్ గతంలో ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జార్ గురించి సంచలన ఆరోపణ చేశారు. ఆ హత్య చైనా చేసిందని, కానీ దాంట్లో ఇండియాను ఇరికించినట్లు ఆమె ఆరోపించారు.

# నా కుమారుడి పెళ్లికెళ్తే చంపేస్తారు: ట్రంప్



ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న తన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి తాను హాజరుకాకపోవచ్చని పేర్కొన్నారు. ఆ వేడుకకు హాజరైనా.. హాజరు కాకపోయినా తప్పుడు వార్తలతో తనను చంపేస్తారని చమత్కరించారు. అందుకే వివాహానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని.. అయితే ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో అది కష్టంగా మారే అవకాశం ఉందని తెలిపారు.

48 ఏళ్ల డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారాంతంలో తన ప్రియురాలు బెట్టినా ఆండర్సన్ను వివాహం చేసుకోనున్నారు. ఈ వేడుక బహమాస్‌లో జరగనుంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ వివాహానికి సన్నిహితులను మాత్రమే ఆహ్వానిస్తున్నట్టు తెలుస్తోంది. కాగా ట్రంప్ జూనియర్ 2005లో వెనెసాను వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత విభేదాలు రావడంతో 13 ఏళ్ల వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ 2018లో విడాకులు తీసుకున్నారు. వారికి ఐదుగురు సంతానం. 2020లో ట్రంప్ జూనియర్‌కు ఫాక్స్ న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో నిశ్చితార్థం జరగ్గా తర్వాత దానిని రద్దు చేసుకున్నారు. అనంతరం మోడల్, సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్‌తో ట్రంప్ జూనియర్ గతేడాది ఎంగేజ్మెంట్ చేసుకున్నారు.

# ఎవరెస్ట్‌పై విషాదం

### ఇద్దరు భారతీయ పర్వతారోహకులు మృతి



ఖాట్మండు: ప్రఖ్యాత ఎవరెస్ట్ శిఖరంపై విషాదం చోటుచేసుకుంది. పర్వతారోహణ ముగించుకుని దిగువకు వస్తుండగా ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారని నేపాల్ పర్వతారోహణ అధికారి రిషి భండారి తెలిపారు. మృతులను అరుణ్‌కుమార్ తివారీ, సందీప్ ఆరేగా గుర్తించారు. వారు కిందకు దిగుతున్న సమయంలో తీవ్రంగా అలసిపోయారని.. రక్షించేందుకు గైడ్స్ తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని చెప్పారు. బుధవారం ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన 274 మంది పర్వతారోహకులలో సందీప్ అరే సహా తులసి రెడ్డి పాల్వునూరి, అజయ్ పాల్ సింగ్ అనే మరో ఇద్దరు భారతీయులు ఉన్నట్టు నేపాల్ ఎక్స్‌పెడిషన్ ఆపరేటర్స్ అసోసియేషన్ వెల్లడించింది. ఒకే రోజులో అత్యధిక సంఖ్యలో ఎవరెస్ట్‌ను అధిరోహించిన బృందంగా వీరు ఒక కొత్త రికార్డు నెలకొల్పారు. అయితే పర్వతం దిగుతున్న సమయంలో సందీప్ ఆరే మృతి చెందాడు. గురువారం సాయంత్రం మరో బృందం పర్వత శిఖరాన్ని చేరుకుని తిరిగి వస్తుండగా అరుణ్‌కుమార్ తివారీ కూడా మృతి చెందినట్టు అధికారులు వెల్లడించారు.

కాగా ఎవరెస్ట్‌ను అత్యధికంగా 32సార్లు అధిరోహించిన నేపాలీ షెర్పా కామి రీటా ఒక అభ్యర్థన చేశారు. 8,849 మీటర్ల ఎత్తైన ఎవరెస్ట్ ఎక్కేందుకు పర్వతారోహకులు అధిక సంఖ్యలో వస్తున్నారని, దీనివల్ల ఆ కొండ రద్దీగా మారిందని తెలిపారు. అయితే పర్వతారోహకుల సంఖ్యపై నియంత్రణ పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈసారి చైనా వైపు నుంచి ఎవరెస్ట్ ఎక్కేందుకు అనుమతి లేకపోవడంతో.. నేపాల్ వైపు నుంచి భారీ సంఖ్యలో పర్వతారోహకులు రిజిస్టర్ చేసుకున్నారు. ఈసారి మొత్తం 494 మంది పర్వతారోహకులకు నేపాల్ అధికారులు పర్మిషన్ ఇచ్చారు. పర్వతారోహకులకు సరిపడా షెర్పాలు ఉన్నా.. ఎవరెస్ట్ పర్వతం రద్దీగా మారిపోయిందని కామి రీటా అన్నారు. అధికారులు క్లైంబర్ల సంఖ్యను కంట్రోల్ చేయాలన్నారు. ఎవరెస్ట్ శిఖరంపై రోప్ మార్గంలో ట్రాఫిక్ జామ్ కావడం వల్ల.. ఆ పర్వతారోహకులు అధిక సమయం కఠినమైన వాతావరణంలో గడపాల్సి వస్తోందని, దీనివల్ల వాళ్ల ప్రాణాలు ఇబ్బందుల్లో పడుతున్నాయన్నారు. కామి రీటాతో పోటీపడుతున్న పసాంగ్ దవా షెర్పా ఎవరెస్ట్‌ను ఇప్పటికే 31సార్లు అధిరోహించారు.

# కేన్స్‌లో మిస్ వెనెజువెలాపై దాడి!




సినీ, ఫ్యాషన్ రంగం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే కేన్స్ చిత్రోత్సవాలు ప్రస్తుతం ఫ్రాన్స్‌లో జరుగుతున్న సంగతి తెలిసిందే ఈ క్రమంలో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. కేన్స్‌లోని హోటల్ రూమ్‌లో సెలబ్రిటీ స్టైలిస్ట్ లగునా తనపై కత్తెరతో దాడి చేసిందని మిస్ వెనెజువెలా-2025 ఆండ్రియా డెల్‌వాల్ సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేశారు. అందులో ఆమె ముఖంపై రక్తపు మరకలు కనిపిస్తుండగా.. గది అంతా చిందరవందరగా ఉంది. ఆమె స్టైలిస్ట్ సైతం అక్కడే ఉండడం గమనార్హం. మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆండ్రియాపై దాడి గురించి హోటల్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సెలబ్రిటీ స్టైలిస్ట్ లగునాను అరెస్ట్ చేసినట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. వారిద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో స్టైలిస్ట్ ఆమెపై దాడి చేసినట్టు తెలిపాయి. అయితే ఈ ఘటనపై కేన్స్ నిర్వాహకులు, ఫ్రాన్స్ ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక స్పందన వెలువడలేదు.

# ఇరాన్ దెబ్బకు... అమెరికా రీపర్ డ్రోన్లు ఢమాల్



ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై జరిపిన యుద్ధంలో అమెరికాకు భారీగానే నష్టం జరిగినట్టు తెలుస్తోంది. ఈ ఘర్షణల్లో బిలియన్ డాలర్ల విలువైన యూఎస్‌కు చెందిన అత్యాధునిక ఎంక్యూ-9 రీపర్ డ్రోన్(M)-9 Reaper drome)లను టెహ్రాన్ ధ్వంసం చేసినట్టు సమాచారం. ఈ వివరాలను మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇరాన్ దాడుల్లో యూఎస్ దాదాపు 30 డ్రోన్లను కోల్పోయింది. ఇందులో కొన్ని దెబ్బతిన్నవి కాగా.. వాటిని తిరిగి ఉపయోగించుకోలేని పరిస్థితి. ఇవి ఘర్షణకు ముందు పెంటగాన్ వద్ద ఉన్న డ్రోన్ నిల్వల్లో దాదాపు 20 శాతానికి సమానం.

ఇందులో చాలా డ్రోన్లను ఇరాన్ గాల్లోనే కూల్చివేసింది. మరికొన్ని క్షిపణి దాడుల్లో నేలపై ధ్వంసమయ్యాయి. ఈ ఎంక్యూ-9 రీపర్ డ్రోనుకు ఒక్కొక్కటి సుమారు 30 మిలియన్ డాలర్ల వరకు ఖర్చవుతోంది. వీటిల్లో అత్యాధునిక కెమెరాలు, సెన్సార్లు ఉంటాయి. ఇరాన్ యుద్ధంలో యూఎస్ దళాలు ఈ డ్రోన్లను విరివిగా ఉపయోగించాయి. ప్రస్తుతం ఈ రీపర్ డ్రోన్ల ఉత్పత్తి ఆగిపోవడం యూఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ.

# పగ తీర్చుకున్న హైదరాబాద్..

## ఆర్సీబీపై ఘన విజయం

హైదరాబాద్: ఐపీఎల్ ఉత్కంఠ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఓటమిపాలైంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్దేశించిన కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆర్‌సీబీ బ్యాటర్లు చేతులెత్తేశారు. అయితే టేబుల్ టాపర్‌గా ఆర్సీబీనే నిలిచింది.

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఉప్పల్ పిచ్‌పై హైదరాబాద్ బ్యాటర్లు మొదటి బంతి నుంచే ఆర్‌సీబీ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ మైదానాన్ని హోరెత్తించారు. ఈ భారీ స్కోరుతోనే మ్యాచ్‌పై హైదరాబాద్ సగం పట్టు సాధించింది. బెంగళూరు బౌలర్లు ఎంత ప్రయత్నించినప్పటికీ పరుగుల వేగాన్ని అడ్డుకోలేకపోయారు.

**లక్ష్య ఛేదనలో తడబడిన బెంగళూరు... పోరాడినా తప్పని ఓటమి**

256 పరుగుల అసాధ్యమైన లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ఆరంభంలో మంచి భాగస్వామ్యం లభించినప్పటికీ మిడిల్



ఓవర్లలో వరుసగా వికెట్లు కోల్పోవడంతో ఒత్తిడిలో పడింది. సన్‌రైజర్స్ బౌలర్లు కచ్చితమైన ప్రణాళికతో బంతులు వేస్తూ పరుగుల వేగాన్ని నియంత్రించారు. ఆర్‌సీబీ బ్యాటర్లు ఒంటరి పోరాటం చేసినప్పటికీ కావలసిన రన్‌రేట్ భారీగా పెరిగిపోవడంతో విజయం వారికి దూరమైంది. నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి బెంగళూరు జట్టు 4 వికెట్ల నష్టానికి 200 పరుగులు మాత్రమే చేయగలిగింది.

### ఫిట్‌నెస్ ఉన్నంత వరకు

# రోహిత్, కోహ్లీ ఆడాలి



- కిరణ్ మోరే

ఇండియన్ క్రికెట్ లెజెండ్స్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తమ ఫామ్, ఫిట్‌నెస్ నిలబెట్టుకున్నంత కాలం అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడాలని మాజీ భారత మాజీ క్రికెటర్, చీఫ్ సెలెక్టర్ కిరణ్ మోరే ఆకాంక్షించారు. వారిద్దరినీ బలవంతంగా రిటైర్ చేయించే ఆలోచన సరైంది కాదన్నారు. పరుగులు చేస్తున్నంత కాలం వారిని కొనసాగించడం ఉత్తమమని పేర్కొన్నారు. గజియాబాద్‌లో జరుగుతున్న 'బియాండ్ రీచ్ ప్రీమియర్ లీగ్' (BRPL) ట్రయల్స్ సందర్భంగా కిరణ్ మోరే మీడియాతో మాట్లాడారు. రోకోకు ఇప్పటికీ విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని గుర్తు చేశారు. వీరిద్దరూ కలిసి ఆడటం చూడ్డానికి ఎంతో బాగుంటుందని చెప్పారు. వీరి రిటైర్మెంట్‌పై ఎలాంటి చర్చలూ చేయొద్దని సూచించారు. సచిన్ రిటైర్ చేసినప్పుడు నా కళ్లలో నీళ్లు వచ్చాయి. ఈ ఇద్దరూ ఆట నుంచి వైదొలిగినప్పుడు కూడా... వారి లోటు తీవ్రంగా బాధిస్తుందన్నారు. ఆ సమయం వచ్చినప్పుడు రిటైర్మెంట్ నిర్ణయాన్ని తీసుకునే సమర్థత వారికుందన్నారు. భవిష్యత్తులో వైభవ్ సూర్యవంశీతో భారత్‌కు గొప్ప కీర్తి లభిస్తుందన్నారు. మరోవైపు ఐపీఎల్‌లో కోహ్లీ తన ఆట తీరును అద్భుతమైన స్థాయికి మెరుగుపరుచుకుంటూనే ఉన్నాడు. ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు చేరుకున్న RCB తరపున ఆడుతూ 13 ఇన్నింగ్స్‌ల్లో 54.20 సగటుతో మొత్తం 542 పరుగులు సాధించాడు. ఒక సెంచరీ, నాలుగు హాఫ్ సెంచరీలతో తన కెరీర్‌లోనే అత్యధికమైన 164.74 స్ట్రైక్ రేట్ నమోదు చేసి 'ఆరెంజ్ క్యాప్' రేసులో కొనసాగుతున్నాడు. రోహిత్ 282 వన్డేల్లో 274 ఇన్నింగ్స్‌ల్లో 48.84 సగటుతో మొత్తం 11,577 పరుగులు సాధించాడు. ఇందులో 33 శతకాలు, 61 అర్ధ శతకాలు ఉన్నాయి. 264 అత్యధిక వ్యక్తిగత స్కోర్.

# భారత కాంపౌండ్ ఆర్చరీ టీమ్ చీఫ్ కోచ్‌గా డేవ్ కజిన్స్



కోల్‌కతా: భారత కాంపౌండ్ ఆర్చరీ జట్టు ప్రధాన విదేశీ కోచ్‌గా అమెరికాకు చెందిన మాజీ ప్రపంచ నెం.1 అర్చర్ డేవ్ కజిన్స్ (ఋజువ నియమితులయ్యారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల టర్కీలోని అంటాల్యాలో జరగబోయే ప్రపంచ కప్ స్టేజ్-3 టోర్నమెంట్ నాటికల్లా డేవ్ భారత జట్టు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు ఇటలీకి చెందిన ప్రముఖ కోచ్ సెర్గియో పాగ్ని భారత కాంపౌండ్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. ఆయన నేతృత్వంలో చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ ఐదు విభాగాల్లోనూ స్వర్ణ పతకాలు గెలిచి సరికొత్త చరిత్ర సృష్టించింది. అయితే తాజాగా ఆయన మరింత ఎక్కువ రెమ్యునరేషన్ డిమాండ్ చేయడంతో ఆర్చరీ సమాఖ్యతో చర్చలు ఫలించలేదు. దీంతో సమాఖ్య ప్రత్యామ్నాయంగా సరికొత్త కోచ్ వైపు మొగ్గుచూపింది.

రాబోయే లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో పోటీలు జరగనున్నాయి. ఈ మెగా క్రీడల చరిత్రలో కాంపౌండ్ ఆర్చరీ పోటీలను నిర్వహించబోతుండటం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో అత్యంత అనుభవజ్ఞుడైన డేవ్ కజిన్స్ పర్యవేక్షణలో భారత ఆర్చరీ జట్టు ఒలింపిక్స్‌లో పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగనుంది.

# పోక్సో కేసులో పారా ఆర్చరీ కోచ్‌కు ఐదేళ్ల జైలు

చండీగఢ్: మైనర్ అథ్లెట్‌పై లైంగిక వేధింపుల కేసులో జాతీయ పారా ఆర్చరీ కోచ్ కుల్దీప్ వేద్వాన్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ హర్యానాలోని సోనిపట్ ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు తీర్పునిచ్చింది. పోక్సో చట్టం కింద వేద్వాన్‌ను దోషిగా నిర్ధారించిన న్యాయ స్థానం జైలు శిక్షతో పాటు రూ.15వేల జరిమానా కూడా విధించింది. దీంతో బెయిల్‌పై ఉన్న వేద్వాన్‌ను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. 2023 ఏప్రిల్‌లో జరిగిన ట్రయల్స్ సందర్భంగా వేద్వాన్ తన హోటల్ గదిలోకి ప్రవేశించి లైంగికంగా వేధించాడని ఓ మైనర్ క్రీడాకారిణి ఫిర్యాదు చేసింది.

తన మాట వింటే 'పెద్ద ప్లేయర్'ను చేస్తానని వేద్వాన్ నిరంతరం ఒత్తిడి తెచ్చినట్టు చేసిన ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అతడిని అరెస్టు చేయగా.. 2024 పారిస్ పారాలింపిక్స్ ముంగిట బెయిల్ లభించింది. ఆర్మీ మాజీ ఉద్యోగి కుల్దీప్ వేద్వాన్‌కు కోచ్‌గా మంచి పేరుంది. టోక్యో పారాలింపిక్స్‌లో హర్విందర్ సింగ్ దేశానికి తొలి పతకం సాధించినప్పుడు అతనే కోచ్‌గా ఉన్నాడు. రెండు చేతులూ లేని వరల్డ్ నెం.1 పారా ఆర్చర్ శీతల్‌దేవికి మెంటార్‌గా వ్యవహరించి... ఆమె కాళ్లతో బాణాలు సంధించే వినూత్న శైలిని రూపకల్పన చేశాడు. ఇటీవల శీతల్‌ను ఓడించి సంచలనం



సృష్టించిన పాయల్ నాగ్ కూడా వేద్వాన్ అకాడమీకి చెందిన ఆర్చర్ కావడం గమనార్హం.

## 22ఏళ్ల తర్వాత..
## ఐఎస్ఎల్ ఛాంప్ 'ఈస్ట్ బెంగాల్'




కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నీలో ఈస్ట్ బెంగాల్ ఛాంపియన్‌గా నిలిచింది. 22 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆ జట్టు ఓ జాతీయ టైటిల్‌ను సొంతం చేసుకుంది. గురువారం జరిగిన ఫైనల్లో ఈస్ట్ బెంగాల్ 2-1తో ఇంటర్ కాశీపై విజయం సాధించింది. మ్యాచ్‌లో ఆరంభం మాత్రం ఇంటర్ కాశీదే. 14వ నిమిషంలో అల్ఫ్రెడ్ ప్లానాస్ చేసిన గోల్‌తో ఆ జట్టు ఆధిక్యంలో నిలిచింది. కానీ రెండో అర్ధంలో ఈస్ట్ బెంగాల్ గొప్పగా పుంజుకుంది. యూసెఫ్ (49వ) గోల్‌తో స్కోరు సమం చేసిన ఆ జట్టు.. తర్వాత రషీద్ (72వ) బంతిని నెట్లోకి పంపడంతో మ్యాచ్‌తో పాటు టైటిల్‌నూ సొంతం చేసుకుంది. 2004లో చివరగా ఈస్ట్ బెంగాల్ జాతీయ ఫుట్‌బాల్ లీగ్ టైటిల్ గెలిచింది. చాన్నాళ్ల తర్వాత విజేతగా నిలవడంతో అభిమానులు మైదానంలోకి దూసుకొచ్చి సంబరాలు చేసుకున్నారు.

## క్వార్టర్స్‌లో అష్మిత
## మలేషియా మాస్టర్స్ టోర్నీ



మలేషియా మాస్టర్స్ టోర్నీలో భారత యువ షట్లర్ అష్మిత చాలిహా క్వార్టర్స్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్స్‌లో 21-13, 21-16తో లోకల్ షట్లర్ జో జిన్ వీపై అలవోక విజయం సాధించింది. క్వార్టర్స్‌లో తను ఎనిమిదో సీడ్ డెన్మార్క్ ప్లేయర్ లైన్ హజ్‌మార్క్ తలపడనుంది. హజ్‌మార్క్ 16-21,21-8, 21-15తో మరో భారత షట్లర్ మాళవిక బన్సోద్‌ను ఓడించింది. ఇంకో మ్యాచ్‌లో దేవిక సిహగ్ 16-21, 13-21తో చెన్ యుఫీ (చైనా) చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్‌లో హరిహరణ్-ఎంఆర్ అర్జున్, మిక్స్‌డ్ డబుల్స్‌లో కనపురమ్ సాత్విక్-రాధిక శర్మ ప్రీ క్వార్టర్స్‌లోనే ఇంటిదారి పట్టారు.

## జర్మనీ ప్రపంచ కప్ జట్టులో నోయర్



బెర్లిన్: జర్మనీ వెటరన్ ఫుట్‌బాల్ గోల్‌కీపర్ మాన్యుయెల్ నోయర్ ప్రపంచ కప్ కోసం రిటైర్మెంట్ను వీడాడు. ఆటలోకి పునరాగమనం చేసేందుకు నోయర్‌ను ఒప్పించిన జర్మనీ కోచ్ జులియన్ నగెల్స్ మ్యాన్.. అతణ్ని ఫిఫా ప్రపంచకప్ కోసం ప్రకటించిన 26 మంది సభ్యుల జట్టుకు ఎంపిక చేశాడు. అమెరికా, కెనడా, మెక్సికో ఉమ్మడిగా ఆతిథ్యమిస్తున్న ప్రపంచ కప్ జూన్ 11న ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. 40 ఏళ్ల నోయర్.. 2024 యూరోపియన్ ఛాంపియన్‌షిప్ అనంతరం రిటైరయ్యాడు. ఇప్పుడు అతడు తిరిగి జట్టులోకి రావడం గోల్‌కీపర్ ఒలివర్ బౌమన్‌కు పెద్ద దెబ్బే. ఇంతకాలం అతడు జర్మనీ తొలి ప్రాధాన్య గోల్ కీపర్‌గా ఉన్నాడు. ఇప్పుడు కోచ్.. నోయర్ వైపు మొగ్గుచూపే అవకాశముంది.

# 'పెద్ది' ఐటెం సాంగ్ వెనుక పెద్ద కష్టం

## 50 రోజులు పట్టిందన్న అనంత శ్రీరామ్



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, స్టార్ డైరెక్టర్ సానా బుచ్చిబాబు కలయికలో రాబోతున్న 'పెద్ది'చిత్రంపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే.జూన్ 4న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్ల లోకి రాబోతున్నతరుణంలో చిత్ర బృందం ప్రమోషన్స్ స్పీడ్ పెంచింది. ఈ క్రమంలోనే తాజాగా విడుదలైన ఈ సినిమాలోని ప్రత్యేక గీతం 'హెల్లల్లో' ప్రోమో సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. 'చీర.. చొక్కా.. చిక్కెడిపోవా లంటూ..' సాగే ఈ మాస్ లిరిక్స్ యువతను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి.

అయితే ఈ పాట వెనుక ఉన్న ఆసక్తికరమైన ప్రయాణాన్ని ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ తాజాగా మీడియాతో పంచుకున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీత సారథ్యంలో తాను ఇప్పటివరకు సుమారు 30 పాటలు రాశానని, అయితే ఈ ఐటెం సాంగ్ కోసం చేసిన ప్రయోగం పూర్తిగా భిన్నమైనదన్నారు. సాధారణంగా వచ్చే ఐటెం సాంగ్స్ తరహాలో కాకుండా రెహమాన్ అద్భుతమైన కొత్త బాణీ అందించారని, ఆ ట్యూన్ వినడానికే తమకు ఐదు రోజులు పట్టిందని గుర్తుచేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకునే శైలిలో సాగే ఈ వినూత్నమైన పాటను పూర్తి చేయడానికి తనకు ఏకంగా 50 రోజుల సమయం పట్టిందని అనంత శ్రీరామ్ వివరించారు.

ఇదే సినిమాలో ఇప్పటికే ఆకట్టుకున్న 'రైరా రారా'పాట గురించి మాట్లాడుతూ... 'మెగాస్టార్ చిరంజీవి నుంచి వచ్చిన ప్రశంసను గుర్తుచేసుకున్నారు. ఆ పాట విన్న వెంటనే చిరంజీవి స్వయంగా ఫోన్ చేసి... తన జీవిత తత్వాన్ని, ఆలోచనలను ఇప్పటి కాలానికి తగ్గట్టుగా అద్భుతంగా ఆవిష్కరించావంటూ కొనియాడారని, అది తన కెరీర్‌లోనే మర్చిపోలేని గొప్ప గౌరవమని ఆనందం వ్యక్తం చేశారు. కాగా అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ స్పెషల్ ఐటెం సాంగ్‌ను శనివారం గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఇందుకోసం భోపాల్‌లో ఒక భారీ ఈవెంట ప్లాన్ చేశారు. ఈ వేడుకలో మ్యూజిక్ లెజెండ్ ఏఆర్ రెహమాన్ స్వయంగా లైవ్ కాన్సర్ట్ నిర్వహించి వేదికపైనే ఈ పాటను ప్రదర్శించనుండడం విశేషం.

# కోలీవుడ్‌లోకి జాన్వీ కపూర్ గ్రాండ్ ఎంట్రీ..

## యువ హీరోతో జత కట్టడంపై భారీ బజ్



బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ నటి జాన్వీ కపూర్...ఇప్పుడు దక్షిణాది చిత్ర సీమలో తన ప్రస్థానాన్ని మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. దివంగత అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన జాన్వీ ఇప్పటికే టాలీవుడ్‌లో దేవర, పెద్ది సినిమాలతో ప్రేక్షకులకు దగ్గరయ్యారు.ఇప్పుడు ఆమె తమిళ చిత్రసీమలోకి అడుగు పెట్టబోతున్నారనే వార్త సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. తాజా సమాచారం ప్రకారం... విలక్షణ నటుడు విక్రమ్ కుమారుడు, యువ హీరో ధృవ్ విక్రమ్ సరసన జాన్వీ నటించే అవకాశం ఉన్నట్లు కోలీవుడ్‌లో బలమైన ప్రచారం జరుగుతోంది.ఈ ఇద్దరు స్టార్ కిడ్స్ తొలిసారి ఒకే చిత్రంలో జంటగా కనిపించబోతుండటంతో ప్రాజెక్ట్‌పై అంచనాలు పెరుగుతున్నాయి.

ధ్రువ్ విక్రమ్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆయన తదుపరి చిత్రాన్ని యువ దర్శకుడు గణేష్ కే బాబు తెరకెక్కించనున్నట్లు సమాచారం. గతంలో యూత్‌కు బాగా కనెక్ట్ అయిన రొమాంటిక్ కథలతో ఆకట్టుకున్న దర్శకుడు ఈసారి కూడా ప్రేమ, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలను కలిపిన ఒక యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ను సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ కథను నేటి యువతకు దగ్గరయ్యేలా రూపొందిస్తున్నారని, ఇందులో ప్రేమ కథతో పాటు బలమైన భావోద్వేగ అంశాలు కూడా ఉండనున్నాయని టాక్ వినిపిస్తోంది. జాన్వీ గ్లామర్ ఇమేజ్‌తో పాటు ధ్రువ్ నటనా శైలిని దృష్టిలో పెట్టుకుని కథను డిజైన్ చేసినట్టు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

అలాగే ఈ చిత్రానికి భారీ నిర్మాణ విలువలు ఉండనున్నాయని సమాచారం. ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ ప్రాజెక్ట్‌ను గ్రాండ్ స్కేల్‌లో నిర్మించేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. విజువల్స్, మ్యూజిక్, టెక్నికల్ అంశాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా సినిమాను రూపొందించాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని టాక్. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. స్క్రిప్ట్ ఫైనలైజేషన్, లొకేషన్ ఎంపిక వంటి పనులు చివరి దశకు చేరుకున్నాయని సమాచారం. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకో ఆసక్తికర అంశం ఏమిటంటే.. ఈ సినిమాను కేవలం తమిళ భాషకే పరిమితం చేయకుండా మల్టీ-లాంగ్వేజ్ విడుదల దిశగా ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. తమిళంతో పాటు తెలుగు, హిందీ భాషల్లో కూడా ఒకేసారి విడుదల చేసే అవకాశాలను మేకర్స్ పరిశీలిస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు చెప్పున్నాయి.

# నల్లపూసలు, మట్టిగాజులతో కంగనా పెళ్లి రూమర్స్!



బాలీవుడ్ స్టార్ నటి, ఎంపీ కంగనా రనౌత్ సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమెకు సంబంధించిన ఒక వీడియో నెట్టింట విపరీతంగా షేర్ అవుతోంది. ఈ వీడియోలో కంగనా తన ఇంటి నుంచి బయటకు వచ్చి కారు ఎక్కుతూ కనిపించారు. అయితే అందులో ఆమె ఉన్న లుక్ ఇప్పుడు నెటిజన్ల మధ్య పెద్ద చర్చనీయాంశంగా మారింది. వైరలవుతున్న వీడియోలో కంగనా మెడలో నల్లపూసలు, చేతులకు మట్టిగాజులు ధరించి కనిపించారు. సంప్రదాయబద్ధంగా ఉన్న ఆమె రూపాన్ని చూసి నెటిజన్లు రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు. "కంగనా ఎవరికీ తెలియకుండా సీక్రెట్‌గా పెళ్లి చేసుకున్నారా?" అని ఒకరు కామెంట్ చేయగా.. "ఆమె పెళ్లి జరిగితే తప్పకుండా గ్రాండ్‌గా చేసుకుంటారు, రహస్యంగా ఎందుకు చేసుకుంటారు?" అని మరొకరు అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే ఇదంతా సినిమా షూటింగ్ కోసం వేసుకున్న గెటప్ అని ఆమె అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

కంగనా రనౌత్ ప్రస్తుతం ముంబైలో ఉన్నారు. ఆమె తన సూపర్ హిట్ చిత్రం 'క్వీన్' సీక్వెల్‌లో నటిస్తున్నట్టు సమాచారం. ఈ చిత్రం 'క్వీన్ 2' అనే టైటిల్‌తో ప్రచారంలో ఉంది. ఈ సినిమాలోని క్యారెక్టర్ లుక్ కోసమే ఆమె ఇలా సంప్రదాయబద్ధంగా తయారైనట్టు తెలుస్తోంది. ఇటీవల రాజకీయాల్లో బిజీగా ఉన్న కంగనా ఈ సినిమాతోనే మళ్లీ బాలీవుడ్‌లోకి గట్టి కమ్‌బ్యాక్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ పెళ్లి వార్తలపై కంగనా కానీ, ఆమె టీమ్ కానీ ఇప్పటిదాకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

# 'కేన్స్'కు ఐశ్వర్యరాయ్

## రూమర్స్‌కు చెక్ పెడుతూ బయల్దేరిన బ్యూటీ

సందడిగా జరిగే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో ఐశ్వర్యారాయ్ ఎప్పుడూ హైలైట్గా నిలుస్తుంటారు. అయితే ఈసారి ఆమె ఈ వేడుకకు హాజరుకావడం లేదంటూ కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. వీటికి చెక్ పెడుతూ ఈ బ్యూటీ తన కుమార్తెతో కలిసి ఫ్రాన్స్‌కు బయల్దేరారు. దీంతో కేన్స్‌లో చివరి రోజు ఐశ్వర్య సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. ఒక ప్రముఖ బ్రాండ్ తరపున ప్రతి ఏటా కేన్స్ రెడ్ కార్పెట్‌పై హొయలొలికించే ఐశ్వర్య ఈసారి ప్రచార చిత్రాల్లో కనిపించకపోవడంతో రూమర్స్ మొదలయ్యాయి. ఆమెకు బదులుగా ఈసారి బాలీవుడ్ నటి అలియా భట్ వెళ్లారంటూ కథనాలొచ్చాయి. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తాజాగా ఆమె ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో కనిపించడంతో వాళ్లు సంబరపడుతున్నారు. ఈసారి ఈ కేన్స్ క్వీన్ ఎలాంటి లుక్స్‌తో మెస్మరైజ్ చేయనున్నారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# ప్రభాస్ ఎంతో మందికి 'స్పిరిట్': వివేక్ ఒబెరాయ్

తన అభిమానులను వరుస సినిమాలతో ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు అగ్ర కథానాయకుడు ప్రభాస్. ప్రస్తుతం ఆయన రెండు సినిమాల షూటింగ్‌లతో బిజీగా ఉన్నారు. సందీప్ వంగా దర్శకత్వంలో 'స్పిరిట్', హను రాఘవపూడి డైరెక్షన్లో 'ఫౌజీ'లో నటిస్తున్నారు. తాజాగా ప్రభాస్ పై బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ ప్రశంసలు కురిపించారు.

"ఎండలు ఎంత తీవ్రంగా ఉన్నా.. ప్రభాస్ పట్టుదలతో తన పని పూర్తిచేస్తున్నారు. మౌనంగా తన పని తాను చేసుకునే విధానం నాకు చాలా నచ్చుతుంది. అంత పెద్ద స్టార్ హీరో అయినప్పటికీ అందరితో కలిసిపోయి ఉంటారు. స్టార్‌డమ్ ఏమాత్రం చూపించరు. గర్వం అసలు ఉండదు. ముఖ్యంగా లొకేషన్కు ఆయన తీసుకువచ్చే రుచికరమైన వంటల గురించి మాటల్లో చెప్పలేం.ఆయన ఎంతో మందికి స్ఫూర్తి" అన్నారు. 'స్పిరిట్'లో కీలక పాత్రలో వివేక్ కనిపించనున్నారు.

విపరీతంగా పెరిగిపోతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా ప్రభాస్ తన రాబోయే చిత్రాల షూటింగుల్లో బిజీగా గడుపుతున్నారు. రెండు చిత్రాల షూటింగ్లను ఒకేసారి పూర్తి చేస్తున్నారు. షెడ్యూల్స్ ఆలస్యం కాకుండా ఉండేందుకు ప్రభాస్ స్వయంగా డేట్స్ మేనేజ్ చేస్తూ ఒక లొకేషన్ నుంచి మరో లొకేషన్కు వెళ్తున్నారట. ఈరెండు సినిమాలు భిన్న కథాంశాలు కావడంతో లుక్స్ విషయంలో ప్రభాస్ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

# 'డ్రాగన్' తర్వాత 'సలార్ 2': ప్రశాంత్‌నీల్

ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా వచ్చిన 'సలార్' బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న విషయం తెలిసిందే. దీని సీక్వెల్ ఉన్నట్టు గతంలోనే ప్రకటించారు. తాజాగా దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో దీని గురించి మాట్లాడారు. ఎన్టీఆర్‌తో చేస్తున్న 'డ్రాగన్' పనుల్లో తాను బిజీగా ఉన్నానని చెప్పారు. ఈ చిత్రం పూర్తయిన వెంటనే 'సలార్-2 పనులు ప్రారంభిస్తానని వెల్లడించారు.

